నల్లగొండ వార్త
నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి
శుక్రవారం 13, మార్చి 2026 16 పేజీలు


2వ పేజీలో..

## నల్గొండ జిల్లా పరిషత్ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక శిక్షణ

పట్టణ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు ప్రభుత్వ పథకాల అమలుపై అవగాహన

ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి





2 లో..



# అర్ధరాత్రి కొహన్స్ ఫార్మాలో ప్రమాదం



## ముగ్గురు పరిస్థితి విషమం..

**మరికొంత మందికి అస్వస్థ..**

**సూర్యాపేట శాంతినగర్ లోని (సువెన్) ఫార్మాలో బ్లాస్ట్...**

**ఎగసి పడిన పౌడర్.....**

**భయబ్రాంతులకు గురైన తండావాసులు...**

**కంపెనీ గేటు ముందు గ్రామస్తులు ఆందోళన...**

**ప్రజల ప్రాణాలు తీస్తున్న కంపెనీని తరలించాలని డిమాండ్**

సూర్యాపేట బ్యూరో,మార్చి 12 (ప్రభాతవార్త)

సూర్యాపేట పట్టణంలోని శాంతినగర్ ప్రాంతంలో ఉన్న కోహన్స్ ఫార్మా (మునుపటి సువెన్ ఫార్మా) కంపెనీలో అర్ధరాత్రి జరిగిన పేలుడు ఘటన కలకలం రేపింది. గురువారం తెల్లవారుజామున సుమారు 2.30 గంటల సమయంలో కంపెనీలోని ఏఎన్ఎఫ్డి (నచ్ ఫిల్టర్ డ్రైన్) యంత్రం ఒక్కసారిగా పేలడంతో ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏడిఎం ప్రాజెక్టు స్టేజ్-3 లో ఎల్లో కలర్ పౌడర్ సెట్రిఫ్యూజ్ అయిన తర్వాత అన్‌లోడ్ చేసే సమయంలో ఈ ప్రమాదం సంభవించినట్లు తెలుస్తోంది. యంత్రంలో ప్రెషర్ పెరగడం లేదా వాల్వ్ కట్ కావడం, లేక మిషనరీలో లోపం తలెత్తడం వంటి పరిణామాల వల్ల ఈ పేలుడు జరిగి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పేలుడు సంభవించిన సమయంలో యంత్రం పూర్తిగా లోడ్ అయి ఉంటే భారీ విధ్వంసం సంభవించి, కంపెనీ గోడలు ఎక్కడికక్కడ పగిలిపోయేవని,ఎంతో మంది కార్మికులు తీవ్ర ప్రమాదానికి గురయ్యే పరిస్థితి ఉండేదని నిపుణులు చెబుతున్నారు. తక్కువ ప్రెషర్‌తోనే పేలినా, యంత్రంలో ఉన్న పౌడర్ సుమారు 500 మీటర్ల దూరం వరకు ఎగసి పడింది. కంపెనీలో మూడు ఫ్లోర్లలో ఈ పౌడర్



2 లో..

# ప్రజల మన్ననలు పొందేలా "ప్రజా ప్రతినిధులు పని చేయాలి"

**శిక్షణ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు సద్వినియోగం చేసుకోవాలి...**

**గ్రామ పంచాయతీ నిధులను ప్రణాళిక బద్ధంగా వినియోగించాలి...**

**ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి...**

**పాల్గొన్న తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి**

సూర్యాపేట బ్యూరో మార్చి 12 (ప్రభాతవార్త)

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని రవి ఫంక్షన్ హాల్ లో నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచులు, మునిసిపల్ చైర్ పర్సన్, వార్డు కౌన్సిలర్ లు, ఇతర ప్రజా ప్రతినిధులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ,ఎస్.పి నరసింహా తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాధ ఉత్తమ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి, రాష్ట్ర కేబినెట్ ఆలోచనల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా


2 లో..

# యాదాద్రిలో గవర్నర్ దంపతులు పూజలు

యాదగిరిగుట్ట మార్చ్ 12 (ప్రభాతవార్త)

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసిం హస్వామి దేవస్థానం లో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా గురువారం కుటుంబ సభ్యులతో స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆలయానికి వచ్చిన ఆయనకు వేద పండితులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితులు



ఆలయ సంప్రదాయంతో పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. గవర్నర్ ధ్వజ స్తంభం వద్ద బలిపీఠానికి

## అర్ధరాత్రి కొహన్స్ ఫార్మాలో ప్రమాదం...

### మొదటి పేజీ తరువాయి..

మొత్తం పడి బయటకు కూడా విస్తరించిందంటే ఏ స్థాయిలో పేలుడు సంబంధించిందో అర్థమవుతుంది. దీంతో కంపెనీ సమీప గ్రామాల్లో 2-3 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రజలు కొంతసేపు అస్వస్థతకు గురయ్యారు. ఘటన సమయంలో అక్కడ పని చేస్తున్న వినోద్, లక్ష్మయ్య, నాగరాజు, అంజయ్య, శేఖర్ తీవ్ర అస్వస్థతకు గురవడంతో వారిని సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అలాగే కంపెనీలో పని చేస్తున్న సుమారు 30 మంది కార్మికులు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. కంపెనీ పరిసరాల్లోని తండాల్లో నివసిస్తున్న సుమారు 200 మంది ప్రజలు కూడా అస్వస్థతకు గురయ్యారని స్థానికులు తెలిపారు. గుట్ట చప్పుడు కాకుండా క్షతగాత్రుల తరలింపు :ఇంత పెద్ద ప్రమాదం జరిగినప్పటికీ కంపెనీ నిర్వాహకులు సంబంధిత శాఖల అధికారులు, ఫైర్ సిబ్బంది, పోలీసులకు సమాచారం ఇవ్వలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రమా దానికి గురైన కార్మికులను కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా ఆసుపత్రులకు తరలించి గోప్యంగా చికిత్సలు అందిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై కొంతమంది తండా వాసులు అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం చేరవేశారని, ఆ తర్వాతే విషయం తమకు తెలిసిందని, కంపెనీ నిర్వాహకులు మాత్రం ఎలాంటి సమాచారం ఇవ్వలేదని అధికారులు తెలిపారు.

**గేటు ముందు గ్రామస్తుల ధర్నా :**

స్థానికులు, తండావాసులు తెల్లవారుజామున కంపెనీ గేటు ముందు ఆందోళన చేశారు. ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టే ఈ కంపెనీని వెంటనే ఇతర ప్రాంతానికి తరలించాలని వారు డిమాండ్ చేశారు.

**ప్రజల ప్రాణాలకు ముప్పు :**

స్థానిక 5వ వార్డు కౌన్సిలర్ ఛత్రు నాయక్ మాట్లాడుతూ, అర్ధరాత్రి రియాక్టర్ పేలి విషవాయువులు బయటకు రావడంతో తండాలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. రాత్రి మూడు గంటల సమయంలో కంపెనీ వద్దకు వెళ్లగా చుట్టుపక్కల ప్రాంతమంతా దట్టమైన పొగతో నిండిపోయి ఊపిరి తీసుకోవడమే కష్టంగా మారిందన్నారు. ఐదో వార్డులో మూడు వేల మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారని, ఫార్మా కంపెనీ కాలుష్యంతో తరచూ ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గతంలో కూడా ఈ కంపెనీని తరలించాలని అనేకసార్లు పోరాటాలు చేసినప్పటికీ ఫలితం లేదన్నారు. కంపెనీ కాలుష్యంతో తాగు, సాగు నీరు కలుషితమై పంటపొలాలపై కూడా ప్రభావితమవుతున్నాయని చెప్పారు.

**ముప్పై ఏళ్లుగా పోరాటం :**

మాజీ సర్పంచ్ భూక్యా నాగు నాయక్ మాట్లాడుతూ, గత ముప్పై సంవత్సరాలుగా కంపెనీని తరలించాలని ఎన్నోసార్లు ధర్నాలు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోలేదన్నారు. గతంలో సువెన్ ఫార్మా పేరుతో ఉన్న సమయంలో కూడా పలుమార్లు రియాక్టర్లు పేలి కార్మికులు గాయపడ్డారని తెలిపారు. 2004లో జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఇద్దరు గాయపడ్డారని గుర్తు చేశారు.

**మాకు భయం వెంటాడుతోంది :**

స్థానికుడు చాంప్ల నాయక్ మాట్లాడుతూ, తమ నివాసం కంపెనీకి కేవలం 200 మీటర్ల దూరంలోనే ఉందని, ఫార్మా కాలుష్యంతో ఎప్పటికప్పుడు ప్రమాద భయం వెంటాడు తోందన్నారు. గతంలో 25 టీఎంపీ ఉత్పత్తి ఉన్న కంపెనీని ఇప్పుడు 250 టీఎంపీకి పెంచారని, దాంతో కాలుష్యం పది రెట్లు పెరిగిందని ఆరోపించారు. ఈ కంపెనీ కాలుష్యంతో తన కుమారుడికి కిడ్నీ సమస్యలు వచ్చాయని, పెద్ద ఆసుపత్రుల్లో చికిత్స చేయించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో పెద్ద ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరు తీసుకుంటారో ప్రభుత్వం స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామ స్తులు, తండావాసులు ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి ఫార్మా కంపెనీపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## యాదాద్రిలో గవర్నర్ దంపతులు పూజలు

### మొదటి పేజీ తరువాయి..

నమస్కరించుకొని స్వామి వారి అంతరాలయం లోఅర్చనాది పూజా కార్యక్ర మాలునిర్వహించారు. ఆయనకు ఆలయ అర్చకులు స్వామి అమ్మవారి అష్టోత్తరంతో ప్రత్యేక పూజలు గావించి హారతిని ఇచ్చి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయనకు ఆలయ అర్చకులు వేద పండితుల సమక్షంలో ఘనంగా చతుర్వేద శ్లోకాలతో ఘనంగా ఆశీర్వచనాన్ని గావించారు. అనంతరం ఆయనకు కార్య నిర్వాహణాధికారి భవాని శంకర్ స్వామి అమ్మ వారిలో మెమెంటోను అందచేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్త స్వామి వారి ప్రసాదాన్ని గవర్నర్ కు అందచేశారు. అనంతరం అనుబంధ దేవాలయం శ్రీ పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో స్పటిక లింగానికి గవర్నర్ దంపతులు పంచామృ తాలతో అభిషేకం చేశారు. యాదగిరిగుట్టకు వచ్చిన రాష్ట్ర గవర్నర్ కు ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య,జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ , రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి గవర్నర్ కు పూల మొక్కలు బహుకరించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం అండ

### 27 మంది మావోయిస్టు సభ్యులకు చెక్కులు పంపిణీలో పాల్గొన్న జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

**కొత్తగూడెం క్రైమ్, మార్చి 12 ప్రభాతవార్త:**

లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీలో పని చేస్తూ ఇటీవల కాలంలో జిల్లా పోలీసులు ఎదుట లొంగిపోయిన 27 మంది సభ్యులకు 62,50,000 నగదు రివార్డును చెక్కుల రూపంలో జిల్లా ఎస్పీ గురువారం ఓఎస్పి కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... నిషేధిత మావోయిస్టు పార్టీలో పని చేస్తూ లొంగిపోయిన వారికి తెలంగాణ ప్రభుత్వం నుండి మంజూరైన రివార్డు నగదును వారి పునరావాసం కోసం అందజేయడం జరిగిందని చెప్పారు. కాలం చెల్లిన సిద్ధాంతాలతో స్వార్థ ప్రయోజనాల కోసం మావోయిస్టు పార్టీ నాయకులు అమాయకులైన ఆదివాసీలను బలవంతంగా తమ పార్టీలోకి చేర్చుకొని వారి చేత చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేయించారని లొంగిపోయిన నిషిద్ధ సిపిఐ మావోయిస్టు పార్టీ సభ్యులకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ నరేందర్ ఆర్ ఐ ఆపరేషన్స్ రవి ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## నల్గొండ జిల్లా పరిషత్ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక శిక్షణ

**నల్గొండ టౌన్ ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**

నల్గొండ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. పట్టణ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు ప్రభుత్వ పథకాల అమలుపై అవగాహన కార్యక్రమం నిర్వహిం చగా, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రోడ్లు, భవనాలు !! సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరైనారు.అనంతరం మున్సిపల్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి మంత్రి కోమటిరెడ్డి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలతో సన్నిహిత సంబంధాలే ప్రజా ప్రతినిధులను గెలిపిస్తాయని మంత్రి వ్యాఖ్యానించారు.అభివృద్ధి, సంక్షేమంతో పాటు ప్రజలతో సమన్వయం అవసరమని, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు పదవిని హోదాగా కాక బాధ్యతగా భావించి పనిచేయాలని సూచించారు.అహంకారంతో వ్యవహరించే ప్రజా ప్రతినిధులను వచ్చే ఎన్నికల్లో ప్రజలు తిరస్కరిస్తారని,ఎన్నికల తర్వాత పార్టీలకతీతంగా అభివృద్ధి చేయాలని సూచించారు.తెలంగాణలో రూ.22 వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం జరుగుతుందని, నల్గొండ నియోజ కవర్గం ఎస్ఎల్బీసీలో రూ.220 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు డిసెంబర్ 9 నాటికి స్కూల్ నిర్మాణం పూర్తి చేస్తామని మంత్రి వెల్లడించారు.మున్సిపల్ కార్పొరేషన్ సహా అన్ని మున్సిపాలిటీల్లో ప్రాపర్టీ టాక్స్ వసూలు చేయాలని ఆదేశించారు.అర్హులైన వారందరికీ పెన్షన్లు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.నల్గొండ-గుర్రంపోడ్ రహదారి నాలుగు లైన్లుగా విస్తరణ పనులు కొనసాగుతున్నాయని,కనగల్-మాల్ వరకు నాలుగు లైన్ల రోడ్డుకు త్వరలో టెండర్లు పిలుస్తామని తెలిపారు.చదువుకునే నిరుపేద విద్యార్థులకు సహాయం చేయాలని ప్రజా ప్రతినిధులకు మంత్రి పిలుపునివ్వగా అలాంటి విద్యార్థుల వివరాలు తన దృష్టికి తీసుకురావాలని మంత్రి సూచించారు.రోడ్డు ప్రమాదం తీవ్రంగా బాధిస్తుందనినిన్న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయాలపాలై చికిత్స పొందుతూ మరణించిన ముస్లిం యువకుడికి మరియు జిల్లాలో దాదాపు 7గురు యువకులు రోడ్డు ప్రమాదంలో హెల్మెట్ లేని కారణంగా మరణించారని,ట్రాఫిక్ సమస్యలపై పోలీసు వారు కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రమాద రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరు తోడ్పడాలని సూచించారు.

## ప్రజల మన్ననలు పొందేలా "ప్రజా ప్రతినిధులు పని చేయాలి"...



అమలు చేస్తున్నామని, ప్రజల కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు గురించి అవగాహన కల్పించడంతో పాటు అర్హులైన లబ్ధిదారు లకు అవి చేరేలా చూడాలని తెలిపారు. ప్రజలకు మంచి చేయాల్సిన బాధ్యత మనపై నేడు ఉందని అన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం కొంత సమయం కేటాయిస్తే క్షేత్రస్థాయిలో మంచి మార్పు కనిపిస్తుందని అన్నారు. పాలక వర్గాలు లేక గ్రామాలకు నిధులు రాలేదని, గత నెలన్నర కాలంలో పెద్ద ఎత్తున నిధులు విడుదల అయ్యాయని, మార్చి 31 లోపు మరిన్ని నిధులు విడుదల అవుతాయని మంత్రి తెలిపారు. ప్రతి గ్రామానికి జనాభా ఆధారంగా 5 లక్షల నుంచి 60 లక్షల రూపాయల వరకు నిధులు విడుదల అయ్యాయని, ఈ నిధులు ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలని అన్నారు. చట్ట పరిధిలో నిధులను సద్వినియోగం చేయాలని, ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కాకుండా కాపలాదారుగా ఉండాలని తెలిపారు.పేద ప్రజలకు నిరంతరం మంచి చేసే విధంగా, రాజకీయాలక తీతంగా ప్రభుత్వం పని చేస్తున్నదని అన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలు ఉంటాయని, ప్రస్తుతం గెలిచిన ప్రతి ఒక్క ప్రజా ప్రతినిధి ఆ ప్రాంతాల అభివృద్ధి కోసం పని చేయాలని కోరారు. ప్రతి ప్రాంత అభివృద్ధికి పార్టీలకతీతంగా తన సహకారం ఉంటుందని ఆయన తెలిపారు. రాబోయే వేసవిలో త్రాగునీటి సమస్య ఏ గ్రామంలో లేకుండా ఉండే విధంగా అధికారులు, నూతన ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని మంత్రి సూచించారు. గ్రామ పంచాయతీకి విడుదలైన నిధులు సద్వినియోగం అయ్యే విధంగా ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాలలో సమస్యలు కేవలం డబ్బుతో మాత్రమే పరిష్కారం కావని అన్నారు. సిసి రోడ్లు, డ్రైయిన్ నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టడం చాలా కీలకమని అన్నారు. గ్రామాలలో నిర్మించే నూతన రోడ్లు, డ్రైయిన్ సమయంలో అధికారులు ప్రజా ప్రతినిధుల పర్యవేక్షణ అధికంగా ఉండాలని, ఎక్కడ కూడా మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని అన్నారు. ప్రజలతో నిరంతరం ప్రజా ప్రతినిధులు అందుబాటులో ఉంటూ సమయస్ఫూర్తితో ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాలని అన్నారు. నేటి శిక్షణ కార్యక్రమాన్ని ప్రజా ప్రతినిధులు సరిగ్గా వినియోగించు కోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలు మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం విజయవంతం చేసేందుకు స్థానిక ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయడం కీలకమని తెలిపారు. 99 రోజుల కార్యక్రమం పై స్థానిక ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నేడు ఈ శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులకు గుర్తింపు కార్డులు, 99 రోజుల కార్యక్రమంపై మెటీరియల్ అందించామని అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 99 రోజుల పాటు 10 థీమ్స్ లో చేపట్టే ప్రోగ్రాంలలో ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం, ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమాలైన వివిధ సంక్షేమ, అభివృద్ధి పనుల అమలు గురించి అవగాహన, పంచాయతీ, మున్సిపల్ చట్టాల గురించి కూడా శిక్షణ అందిస్తామని కలెక్టర్ తెలిపారు.నేటి శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటే క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుందని అన్నారు. ఇంటరాక్టివ్ సెషన్ లాగా నేటి శిక్షణ కార్యక్రమం ఉంటుందని, ప్రతి ఒక్కరూ తమకు ఉన్న సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ కోరారు.తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన సర్పంచ్, పట్టణ ప్రాంత ప్రజా ప్రతినిధులకు విధి నిర్వహణ, ప్రభుత్వ ముఖ్యమైన కార్యక్రమాలు ప్రజలకు అందించేందుకు ఉన్న నిబంధనలు విధివిధానాల గురించి తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతో 99 రోజుల కార్యాచరణ చేపట్టడం జరిగిందని అన్నారు. ప్రతి ఒక్క ప్రజా ప్రతినిధి తమ గ్రామం, మున్సిపల్ వార్డు, డివిజన్ పరిధిలో నిబంధనల ప్రకారం బాగా పనిచేసి జాతీయస్థాయిలో ఆదర్శ వంతంగా తీర్చిదిద్దాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కోదాడ శాసనసభ్యులు పద్మావతి రెడ్డి, తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, అదనపు కలెక్టర్ కె. సీతారామారావు,జెడ్పీ సిఈఓ శ్రీశైల, డిపిఓ యాదగిరి, సిపిఓ కిషన్, డివైఎస్ఓ వెంకట రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, సర్పంచులు, మునిసిపల్ చైర్ పర్సన్లు, వార్డు కౌన్సిలర్ లు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# తలరాత తప్పలేదు..... మృత్యువు ఆగలేదు....

## కర్మ ఫలితం అంటే ఇదేనేమో.....! విచిత్రమైన పరిస్థితిలో మృత్యు ఒడిలోకి....

### . గరిడేపల్లిలో చిత్రమైన ప్రమాదం.... వ్యక్తి మృతి

గరిడేపల్లి, మార్చి 12, ప్రభాతవార్త :

తాను ఒకటి తలుస్తే...... విధి ఒకటి తలచినట్లుగా...... కర్మ ఫలితమేమో అని ఎవరికైనా అనిపించే విధంగా..... ప్రతి ఒక్కరూ అయ్యో పాపం అన్న చందంగా మండల కేంద్రమైన గరిడేపల్లి లో గురువారం ఒక విచిత్రమైన ప్రమాదం చోటుచేసుకుంది..

..... ఈ ప్రమాదంలో అనూహ్యంగా ఊహించని విధంగా ఒక వ్యక్తి మృత్యువాత పడటం అందరిని ఆశ్చర్యపడేటట్లు చేసింది..... చిత్రంగా జరిగిన ప్రమాదంలో ఒకరి ప్రాణాలు ఊహించని విధంగా గాలిలో కలిసిపోయాయి..... అందరూ చూస్తుండగానే...... దారిన పోయే వ్యక్తి మీద ఒక్కసారి పిడుగు పడ్డట్లుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యుత్ స్తంభం తలపై పడి తీవ్ర గాయాలపాలై మృత్యువాత పడ్డాడు..... ఈ చిత్ర విచిత్ర ప్రమాదంపై అందరూ చర్చించుకోవడం కనిపించింది..

.... విధి అంటే ఇదేనేమో....... తన దారిన తాను పోతూ ఉంటే ఒక్కసారిగా కూలిన విద్యుత్ స్తంభం ఒక వ్యక్తి ప్రాణాలను నిట్ట నిలువుగా తీసుకోవటాన్ని చూసిన జనం చలించిపోయి ఆ ప్రమాదాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు...... వివరాల్లోకి వెళితే...... మండల కేంద్రమైన గరిడేపల్లి లో విద్యుత్ స్తంభం రూపంలో ఒక





వ్యక్తిని మృత్యువు కబలించింది... పాలకవీడు మండలం బెట్టె తండా గ్రామానికి చెందిన మాలోతు లక్ష్మా (42) కోర్టు లో కేసు విషయంలో మోటార్ సైకిల్ పై హుజూర్నగర్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో గరిడేపల్లి కి చేరిన సమయంలో స్థానిక గుండాలమ్మ గుడి సమీపంలో డివైడర్ మధ్యన ఉండే విద్యుత్ స్తంభం తలపై పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. హుజూర్నగర్ వైపు నుంచి మిర్యాలగూడ వైపుకు అతిపెద్ద పడవ తో ఒక కంటైనర్ వస్తు గరిడేపల్లి గుండాలమ్మ గుడి వద్ద డివైడర్ లో ఉన్న సెంటర్ లైటింగ్ స్తంభాన్ని తగలడంతో అది విరిగి మరోవైపు మోటార్ సైకిల్ పై వెళ్తున్న లక్ష్మా పై ఒక్కసారిగా పడటంతో తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. మోటార్ సైకిల్ పైనుంచి కింద పడిన లక్ష్మాకు తలకు గాయమై తీవ్ర రక్తస్రావం జరిగింది. పరిస్థితి తీవ్రంగా ఉండడంతో గాయపడిన లక్ష్మాను 108 లో హుజూర్నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. ఈ ప్రమాదాన్ని చూసి అందరూ ఒక్కసారి అవాక్కయ్యారు....

.. మండల కేంద్రమైన గరిడేపల్లి లో నాలుగు లైన్ల రహదారి ఉంది. మధ్యలో డివైడర్ ఉంది. డివైడర్ కు ఒకవైపు కంటైనర్ వస్తుండగా మరోవైపు నుంచి మోటార్ సైకిల్ పై లక్ష్మా వెళ్తున్నాడు. కంటైనర్ లో ఉన్న పడవ సెంటర్ లైట్ స్తంభానికి తగలడం రెప్పపాటు కాలంలో ఆ స్తంభం విరిగి డివైడర్ కు మరోవైపున మోటార్ సైకిల్ పై వెళ్తున్న లక్ష్మా తలపై పడటం అతను కింద పడటం...... చనిపోవడం జరిగింది.

ఈ సంఘటన చూసి కాలం కలిసి రాకపోతే మృత్యువు నుంచి ఎవరూ తప్పించుకోవడం సాధ్యం కాదంటూ అక్కడ సంఘటన చూసిన అందరూ అనుకోవడం కనిపించింది. పాయింట్ బ్లాక్ లో తుపాకీ పెట్టి కాల్చినట్టుగా డివైడర్ మధ్య ఉన్న స్తంభం మోటార్ సైకిల్ పై వెళుతున్న లక్ష్మాపై సరిగ్గా తలపై పడటం, కింద పడటం తీవ్ర గాయాలు కావటం చనిపోవడం చూస్తే...... విధి ఎంత శక్తివంతమైనదో...... కాలం ఎంత కఠినమైనదో..... ఈ విచిత్ర ప్రమాదంలో తనువు చాలించిన ఒక వ్యక్తి మరణం సాక్ష్యంగా నిలుస్తుంది. చనిపోయిన లక్ష్మాకు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. బిజెపి పార్టీలో అనేక పదవులు అలంకరించి లక్ష్మా రాజకీయాల్లో కూడా చురుకైన వాడని గ్రామస్తులు తెలిపారు. ఊహించని విధంగా అనుకోని ప్రమాదంలో లక్ష్మా చనిపోవడం విషాదకరమైన సంఘటనగా నిలిచింది. సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గరిడేపల్లి ఎస్సై చలి కంటి నరేష్ తెలిపారు.

# నేరాలు-దారుణాలు



## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఆలేరు, మార్చి 12, ప్రభాతవార్త :

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలేరు పట్టణ కేంద్రంలో గురువారం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఆలేరు పట్టణం పోచమ్మ వాడకు చెందిన చిన్నం రమేష్ వయస్సు 32 బుధవారం రోజున చిన్న రామచంద్ర గ్రామంలో తన బావమరిది భాస్కర్ వివాహానికి వెళ్ళాడని హల్దీ కార్యక్రమం తర్వాత రమేష్ ఒంటరిగా ఆలేరుకు వచ్చాడని మరుసటి రోజు గురువారం ఉదయం ఫోన్ ఎత్తలేదని పొరుగు ఇంటి వారు కిటికీలోంచి చూడగా రమేష్ తన ఇంట్లో సీలింగ్ ఫ్యాన్ కు తాడుతో వేలాడుతూ కనిపించాడని మృతుడి చెల్లెలు చిన్నం స్వప్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

## బహదూర్ పేటలో దౌర్జన్యాలు చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి



ఆలేరు ,మార్చి 12, ప్రభాతవార్త :

ఆలేరు మున్సిపాలిటీ పరిధిలోని బహదూర్ పేట ఆరో వార్డులో ప్రజలను వేధింపులకు దౌర్జన్యాలకు గురి చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆలేరు సి ఐ యాలాద్రి గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ వార్డులో సుమారు 1500 జనాభా కలిగిన వార్డులో అన్ని కులాల ప్రజలు సంవత్సరాలుగా కలిసిమెలిసి జీవిస్తున్నారని తెలిపారు. బహదూర్ పెట కు చెందిన జంపాల దశరథ అనే వ్యక్తి ప్రజల మధ్య చిచ్చు పెట్టి కులాల మధ్య పంచాయితీలు సృష్టిస్తున్నాడని ఆరోపించారు. అతడు చెప్పినట్లు వినని వారిపై ఇతరులతో ఫిర్యాదు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. గ్రామంలో తరచు గొడవలు దౌర్జన్యాలకు పాల్పడడంతో అతనిపై ఆలేరు పోలీస్ స్టేషన్లో గతంలో రౌడీ షీటర్ గా నమోదు అయినట్లు తెలిపారు. అయినప్పటికీ రాజకీయ కక్షతో గ్రామంలో కలిసిమెలిసి ఉన్న ప్రజల మధ్య తగాదాలు సృష్టిస్తూ సామరస్య వాతావరణాన్ని చెడగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు . బహదూర్ పేట ఆరవ వార్డులో ప్రజల మధ్య చిచ్చుపెట్టి ఇబ్బందుల గురిచేస్తున్న జంపాల దశరథ పై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకొని వార్డులో శాంతి భద్రతలను కాపాడాలని ప్రజలు పోలీసు అధికారులను కోరారు. ఈ కార్యక్రమం లో గ్రామస్తులు వట్టిపల్లి శ్రీనివాస్, సిద్దిమల్లయ్య, కర్రే సత్తయ్య, పర్సి నరేష్, శ్రీకాంత్, గజరాజు ప్రకాష్,బర్ల మల్లయ్య, వట్టిపల్లి నవీన్, భాను, కర్రే సత్తమ్మ, స్వరూప, వస్పరి యాదమ్మ, బర్మ గంగమ్మ, నీలం మహేశ్వరీ,తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీపీ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ప్రభుత్వ విప్

తుర్కపల్లి, మార్చి 12 ప్రభాతవార్త

తుర్కపల్లి మండలం గంధ మల్ల గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ గజం ఉప్పలయ్య తల్లి ఇటీవల మరణించడంతో ఆయన కుటుంబాన్ని మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి పరామర్శించారు .అనంతరం మాదాపూర్ మాదాపురం గ్రామంలో సిద్ధంకి మహేష్ నూతనంగా ఏర్పాటు చేసిన తాటి బెల్లం కాఫీ షాపును ప్రారంభించారు .గొల్లగూడెం గ్రామ మాజీ సర్పంచ్ పాంగల కిష్టయ్య కుమారుని వివాహం సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పిన్నపురెడ్డి నరేందర్ రెడ్డి ,మండల సెక్రెటరీ జనరల్ సాగర్ల పరమేష్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## అక్రమ మద్యం స్వాధీనం

మర్రిగూడ, మార్చి 12, ప్రభాతవార్త :



మండలంలోని అజిలాపురం గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న మద్యం ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అక్రమంగా బెల్ట్ షాపు నిర్వహిస్తున్నారని నమ్మదగిన సమాచారం మేరకు పోలీస్ సిబ్బంది తో కలిసి అట్టి షాప్ పై రైడ్ నిర్వహించి కాపర్తి అంజయ్య అనే వ్యక్తి ఇంట్లో నిల్వ ఉంచిన సుమారు 15 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో అక్రమంగా బెల్ట్ షాప్స్ నిర్వహించినాకు,మద్యం విక్రయించినా అట్టి వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

## రాజాపేటలో అక్రమ ఇసుక రవాణా - కేసు నమోదు

రాజాపేట మార్చి 12 ప్రభాతవార్త

రాజాపేట పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఘటనపై గురువారం ఎస్సై లింగారెడ్డి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రెవెన్యూ ఇన్స్పెక్టర్ పల్లెపాటి నరసింహులు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం ఉదయం సుమారు 11:00 గంటల సమయంలో విధులు నిర్వహిస్తున్నప్పుడు రఘునాథ్పూర్ గ్రామం సమీపంలోని వాగులో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారం అందిందగా ఆయన గ్రామ పంచాయతీ అధికారి గణేష్తో కలిసి అక్కడికి వెళ్లి తనిఖీ చేయగా, టీ. ఎస్. 30 టి. ఎ.4075 నంబరు గల స్వరాజ్ ట్రాక్టర్ టి. ఎస్ 30 టి. ఎ.4089 నంబరు గల ట్రాలీలో ఇసుకను లోడ్ చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు గుర్తించారు.అధికారులు ట్రాక్టర్ను ఆపి డ్రైవర్ను ఇసుక రవాణాకు సంబంధించిన అనుమతి పత్రాలు చూపించాలని కోరగా, అతను ఎలాంటి చెల్లుబాటు అయ్యే పత్రాలు చూపించలేకపోయాడు. తరువాత విచారణలో డ్రైవర్ తన పేరు జంగిలి ప్రవీణ్ (25), యాదగిరిగుట్ట మండలం ధర్మారెడ్డిగూడెం గ్రామంకు చెందినవాడిగా తెలిపాడు. అతను అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. అనంతరం ట్రాక్టర్ను ఖాళీ చేసి డ్రైవర్తో కలిసి రాజాపేట పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ ఘటనపై ఎస్సై లింగారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## ముగ్గురు పేకటరాయుళ్ళు అరెస్ట్. .... 22 వేల నగదు స్వాధీనం

నేరేడుచర్ల మార్చి 12 ప్రభాతవార్త

నేరేడుచర్లమండలం చింతకుంట్ల లో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసి వారి నుండి సెల్ ఫోన్లు, నగదు, ద్విచక్ర వాహనాలను గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రవిందర్ తెలిపారు , మండలంలోని చింతకుంట్ల గ్రామంలో పేకాట ఆడుతున్నారని కొంత మంది ఇచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఆ దాడుల్లో నల్లమేకల శంకర్, చిమ్ముట మల్లయ్య, కత్తి భాస్కర్ రెడ్డిలు పట్టుబడగా వారి నుంచి రూ.22,300 నగదు, మూడు సెల్ ఫోన్లో, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మరో ఇద్దరు వ్యక్తులు ఇట్టే శంకర్, మాతంగి మహేష్ లు పరారీలో ఉన్నారని తెలిపారు.

## పురుగులు మందు తాగి వ్యక్తి మృతి

అనంతగిరి మార్చి 12 ప్రభాత వార్త:



పిల్లలు లేరని మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందిన ఘటన పాలవరం గ్రామంలో చోటు చసుకుంది.ఎస్సై నవీన్ కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం మండల పరిధిలోని పాలవరం గ్రామానికి చెందిన మట్టపల్లి రాధాకృష్ణ (55) కు పెళ్ళి 30 ఏళ్ల అవుతోంది.అప్పటినుంచి పిల్లలు పుట్టలేదు.దీంతో మనస్తాపం చెంది.జీవితంపై విరక్తితో మద్యంకు బానిసై అనారోగ్యం పాలయ్యాడు.వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ ప్రాణాపాయ స్థితి నుంచి కోరుకుంటున్న సమయంలో ఒకవైపు పిల్లలు లేరని,మరో వైపు ఆరోగ్యం సహకరించకపోవడంతో మనస్థాపానికి గురైన రాధాకృష్ణ బుధవారం ఇంట్లో పురుగుల మందు తాగాడు.గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కోదాడలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.చికిత్స పొందుతున్న రాధాకృష్ణ సుమారు రాత్రి 9గంటల సమయంలో మృతి చెందాడనీ ఎస్సై అన్నారు.భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# సీఎం గారూ..! జవాబు చెప్పకుండా అడుగు పెట్టొద్దు.

**రాజేష్ హత్య బాధ్యులపై చర్యలేవి..**
**!!14న హుజూర్నగర్ లో ముఖ్యమంత్రి కాన్వాయ్ ని అడ్డుకుంటాం.**
**సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ విడుదల చేసిన మాజీ ఎమ్మెల్యే బొల్లం**



కోదాడ, మార్చి 12, ప్రభాతవార్త:

పట్టణానికి చెందిన దళిత బిడ్డ కర్ల రాజేష్ ను చిత్రహింసలకు గురిచేసి చంపిన పోలీసు అధికారులను సస్పెండ్ చేయలేదని, దీనికి జవాబు చెప్పకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హుజూర్నగర్ లో అడుగు పెడితే శాంతియుతంగా ప్రజాస్వామ్య పద్ధతుల్లో అడ్డుకుంటామని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. బుధవారం కోదాడలో ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరిట ఓ బహిరంగ లేఖ విడుదల చేశారు. హుజూర్నగర్ పర్యటనలో పాల్గొనే ముందు తాము లేవనెత్తే ప్రశ్నలకు సమాధానం చెప్పాలన్నారు. కర్ల రాజేష్ హత్య జరిగి నాలుగు నెలలు కావస్తున్నప్పటికీ, ఆ రక్తపు మరకలు ఇంకా ఆరని పరిస్థితిలో, తల్లి లలితమ్మకు గర్భశోకం మిగిల్చిన చిలుకూరు ఎస్సైని ఇప్పటివరకు సస్పెండ్ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే బాధ్యులైన పోలీసు అధికారులను సర్వీస్ నుంచి తొలగించి హత్య కేసు నమోదు చేసి జైలుకు పంపేందుకు మీ ప్రభుత్వం ఎందుకు వెనకాడుతుందన్నారు. తనపై వ్యక్తిగత కక్షతో దళిత బిడ్డను హత్య చేశారని, దాని వెనుక మంత్రి ఉత్తం దంపతుల ప్రమేయం ఉందని సాక్షాత్తు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆధారాలతో సహా నిరూపించినప్పటికీ ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదో సమాధానం చెప్పాలన్నారు. మంత్రులను కాపాడుకోవడం కోసం దళిత బిడ్డ ప్రాణాలను ఫణంగా పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు రాజేష్ కుటుంబాన్ని మంత్రి కనీసం పరామర్శించకపోవడం శోచనీయమన్నారు. ఈ పరిణామాలలో హుజూర్నగర్ గడ్డపై ఎలా అడుగు పెడతారని ముఖ్యమంత్రిపై విమర్శనాస్త్రాలు సంధించారు. మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అంటే ఎందుకు వెనకాడుతున్నారని, తాను బహిరంగ లేఖతో వెలు వరించిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, హత్యలో బాధ్యులైన పోలీస్ అధికారులను జైలుకు పంపకుండా హుజూర్నగర్ కు రావాలని ప్రయత్నిస్తే ప్రజల పక్షాన మీ పర్యటన అడ్డుకుంటామని మాజీ ఎమ్మెల్యే బొల్లం స్పష్టం చేశారు. పోలీసుల లాఠీలకు తూటాలకు, కేసులకు ఇక్కడ భయపడే వారెవరు లేరని, రాజేష్ కుటుంబానికి న్యాయం జరగని పక్షంలో 14న ముఖ్యమంత్రి కాన్వాయ్ ని ముందుకు కదలనివ్వమని ఆయన హెచ్చరించారు.

# పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**మండల విద్యాధికారి సలీం షరీఫ్..**



.. కోదాడ, మార్చి 12, ప్రభాతవార్త:

పట్టణంలో ఈనెల 14 నుండి నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మండల విద్యాధికారి సలీం షరీఫ్ బుధవారం తెలిపారు. విద్యార్థులు ఎవరు ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు. కోదాడ పట్టణంలో 11 పరీక్ష కేంద్రాల్లో లోటుపాట్లు తలెత్తకుండా, కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్ ఫోన్లను అనుమతించడం లేదని, పరీక్ష కేంద్రానికి సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని ఆదేశించామన్నారు. పట్టణంలో 1485 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఆయన తెలిపారు. 130 మంది సిబ్బంది తో, 11 సెంటర్లలో 22 మంది చీఫ్ సూపరిండెంట్, డిపార్ట్మెంట్ ఆఫీసర్లు విధులు నిర్వహిస్తారని తెలిపారు. ప్రతి సెంటర్ కి పోలీస్ బందోబస్తు ఉంటుందని, పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముఖ్యంగా తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, అవసరమైన ఫర్నిచర్తో పాటు వైద్య సేవలను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. విద్యార్థులు పరీక్షల ఒత్తిడికి గురై ఆందోళన చెందవద్దని ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలన్నారు. తల్లిదండ్రులు ప్రశాంత వాతావరణం కల్పించాలని ఒక గంట ముందు విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఐదు నిమిషాలు ఆలస్యమైనా పరీక్షకు అనుమతిస్తారని ఆయన పేర్కొన్నారు. ప్రశ్నపత్రాలను సీసీ కెమెరాల ఎదుటే తెరిచేలా ఏర్పాటు చేశామని, ప్రతి పరీక్ష కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఆయన తెలిపారు. కోదాడ హై స్కూల్ భవాని నగర్ అడ్రస్ కోదాడ హై స్కూల్ కేటీఎస్ అశోక్ నగర్, విజయవాడ రోడ్డులో ఉంటుందని, ఆక్స్ఫర్డ్ హై స్కూల్ హుజూర్ నగర్ రోడ్డు లోని భారతి విద్యా మందిర్ పక్కన కలదని, ఎస్ వి హై స్కూల్ భవాని నగర్ నందు ప్రభుత్వ ఆసుపత్రి ఎదురు సందులో ఎస్వీ కాలేజ్ దగ్గర కలదని తెలిపారు.

## హృద్రోగికి పునర్జన్మ.. ఆఫ్‌పంప్ బైపాస్ విజయవంతం

కోదాడ, మార్చి 12, ప్రభాతవార్త:



తీవ్రమైన గుండె జబ్బుతో పాటు దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్న 61 ఏళ్ల మహిళకు మలక్ పేట్ యశోదా హాస్పిటల్లో అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్స నిర్వహించి ప్రాణాలు కాపాడినట్లు ప్రముఖ గుండె శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ వెంగల్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక పబ్లిక్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాన రక్తనాళాల్లో అడ్డంకులు ఉండటం, షుగర్, బీపీ వంటి సమస్యల వల్ల ఈ కేసు అత్యంత ప్రమాదకరంగా మారిందన్నారు. గుండెను ఆపకుండా నిర్వహించే ఖిఆఫ్ పంప్ఖి పద్ధతిలో బైపాస్ శస్త్రచికిత్స చేసి రోగిని ప్రాణాపాయం నుంచి రక్షించామన్నారు. శస్త్రచికిత్స జరిగిన రోజే వెంటిలేటర్ తొలగించామని, ప్రస్తుతం ఆమె పూర్తి ఆరోగ్యంతో ఉన్నారని వివరించారు. అత్యాధునిక సాంకేతికత, అనుభవజ్ఞులైన వైద్య బృందంతో ఎంతటి క్లిష్టమైన కేసులనైనా విజయవంతంగా పూర్తి చేస్తున్నామన్నారు. ప్రజలందరూ అన్ని రకాల వసతులు, వైద్య బృందం ఉన్న ఆసుపత్రులలో చికిత్స చేసుకోవాలన్నారు. అతి త్వరలోనే జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యులకు కోదాడలో మెగా ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీజీఎం లక్ష్మణ్ శ్రీకాంత్, సీనియర్ మేనేజర్ వాసు కిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఖాతాదారులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం



కోదాడ, మార్చి 12, ప్రభాతవార్త:

తమ బ్యాంకు ఖాతాదారులకు అత్యుత్తమ సేవలు అందించినందుకు గాను అంతర్జాతీయ హై క్వాలిటీ హైమ్ రేటింగ్ సంస్థ ఫైవ్ స్టార్ రేటింగ్ ప్రకటించిందని సుధా బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ తెలిపారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన ఖాతాదారుల ఆత్మీయ సమావేశంలో వారు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత 26 ఏళ్లుగా 300 కోట్ల టర్నోవర్ తో 9 శాఖలలో ఖాతాదారులకు నమ్మకమైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సైతం రుణాలు ఇచ్చి వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్నామన్నారు. కమర్షియల్ బ్యాంకులకు దీటుగా తక్కువ వడ్డీకే బంగారం, ఇండ్లు, వ్యక్తిగత, వ్యాపార రుణాలు అందిస్తున్నామని, ఇట్టి అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డిపాజిట్లపై అధిక వడ్డీ చెల్లిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ చైర్మన్ మీలా మహాదేవ్, వైస్ చైర్మన్ కక్కిరేణి చంద్ర శేఖర్, డైరెక్టర్ లు తోట శ్యామ్, స్వామి వెంకటేశ్వర్లు, ఇరుకుల్ల చెన్న కేశవ రావు, వెంపటి వెంకట రమణ, బ్యాంక్ మేనేజర్ చెన్నూరు రవి కుమార్, బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.




## ఘనంగా కొల్లు పాపయ్య వర్ధంతి

నడిగూడెం, మార్చి 12, ప్రభాతవార్త :

స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం కొల్లు పాపయ్య 69వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పాఠశాల స్థాపనకు సహకరించిన కొల్లు పాపయ్య అందరికీ ఆదర్శప్రాయుడని అన్నారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ మహానుభావుడి సహకారంతో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు కావడానికి అవకాశం కలిగిందని తద్వారా ఎంతోమంది పాఠశాలలో చదువుకొని ఆ తర్వాత ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో రాణించారన్నారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల పురం మాజీ సర్పంచ్ కళ్ళు శత్రుజ్ఞ, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు శ్రీదేవి, మెహరాజ్, మోలానా, కత్తి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## అందని రైతు భరోసా

నడిగూడెం, మార్చి 12, ప్రభాతవార్త

:రైతు భరోసా పథకం అమలులో ప్రభుత్వం విఫలమైందని పలువురు రైతులు విమర్శిస్తున్నారు. యాసంగి సీజన్ ముగియ వస్తున్నప్పటికీ రైతు భరోసా పెట్టుబడి సాయం ఖాతాల్లో జమ చేయకపోవడం అన్యాయమని రైతులు అంటున్నారు. ఐదు ఎకరాల లోపు రైతులకు కూడా పెట్టుబడి సాయం అందించకపోవడం సరైంది కాదని రైతులు వాపోతున్నారు. వరి కోతలు ప్రారంభించే సమయం ఆసన్నమైనప్పటికీ పెట్టుబడి సాయం అందించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. రైతు భరోసా పథకాన్ని ప్రభుత్వం పూర్తిగా నీరుగార్చిందన్నారు. సన్న చిన్న కారు రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఆశించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని అంటున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతు భరోసా పథకాన్ని కింద పెట్టుబడి సాయం అందించాలని రైతులు కోరుతున్నారు.

## ఈనెల 15 నుండి వంటి పూట బడులు

నడిగూడెం, మార్చి 12, ప్రభాతవార్త :

రాష్ట్రంలో పాఠశాలలకు ఈనెల 15 నుంచి వంటి పూట బడులు నిర్వహించేలా విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయం 8 గంటల నుంచి 12:30 గంటల వరకు పాఠశాలను నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆ తర్వాత విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందజేసి ఇళ్లకు పంపాలని పేర్కొన్నారు. పదవ తరగతి పరీక్షా కేంద్రాలు ఉన్న ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి ఐదు గంటల వరకు తరగతులను నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పదవ తరగతి పరీక్షలు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరుగుతాయి. ఆ తర్వాత విద్యార్థులకు ఒంటిగంట నుంచి ఐదు గంటల వరకు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించారు.

## స్వర్ణ భారతి సేవలు అభినందనీయం.

కోదాడ, మార్చి 12, ప్రభాతవార్త:



పేద ప్రజలకు వైద్య సేవలు అందించడంలో స్వర్ణ భారతి చారిటబుల్ ట్రస్ట్ కృషి అభినందనీయమని నల్లబండగూడెం గ్రామ సర్పంచ్ అలసకాని భవాని శరభేశ్వరరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని నల్లబండగూడెం గ్రామంలో చక్కా చన్నయ్య జ్ఞాపకార్థం ఐషు ప్రొడక్ట్స్ అధినేత చక్కా హరిబాబు సహకారంతో యశోద హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. శిబిరంలో 400 మందికి షుగర్, బీపీ, ఈసీజీ, 2డీ ఎకో, థైరాయిడ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సామాజిక సేవలో స్వర్ణ భారతి ట్రస్ట్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విశిష్ట అతిథిగా పైడిమర్రి సత్యబాబు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చారుగుండ్ల ప్రవీణ రాజశేఖర్, ఒరుగంటి కిట్టు, యధా సుధాకర్, ట్రస్ట్ సభ్యులు హైమావతి, శ్రీనివాసరావు, కొత్తూరి శ్రీనివాసరావు, అనిల్, గ్రామ పెద్దలు వైస్ సర్పంచ్ యరమల అరుణ, శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ సుశీల బెంజిమన్, రంగారావు తదితరులు పాల్గొన్నారు.




## గ్రామ పంచాయతీ సిబ్బంది శ్యామల నాగన్న కుటుంబానికి ఆర్థిక సాయం



**తిరుమలగిరి మార్చి 12 ప్రభాతవార్త.**

తిరుమలగిరి మండలంలోని తాటిపాముల గ్రామ పంచాయతీ సిబ్బంది గా పనిచేస్తున్న సామల నాగయ్య అనారోగ్య రీత్యా గత కొన్ని రోజుల క్రితం చనిపోవడంతో వారి యొక్క కుటుంబానికి అభ్యుదయ యువజన సమైక్య యూత్ తరఫున 13000 వేల రూపాయల ఆర్థిక సహాయం చేయడం జరిగింది. రేపు భవిష్యత్తులో కూడా వారి కుటుంబానికి అభ్యుదయ యువజన సమైక్య యూత్ అండగా ఉంటుందని వారన్నారు .ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోయపల్లి కృష్ణయ్య యూత్ అధ్యక్షులు పాక మహేష్, యూత్ సీనియర్ సభ్యులు కాకర్ల రమేష్ మాజీ ఉపసర్పంచ్ నాయిని మల్లయ్య, గౌరవ అధ్యక్షులు కొడిదల అంజి, యూత్ మాజీ అధ్యక్షులు నక్క దయా యాదవ్, కోల మహేష్ గౌడ్, రేగుల మహేందర్ ముదిరాజ్ , యూత్ ఉపాధ్యక్షులు నక్క మహేష్, యమగాని సురేష్, నక్క నాగరాజు, పాక అవిలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సంతలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం



**తిరుమలగిరి మార్చి 12 ప్రభాతవార్త.**

99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 100 కేజీల కంటే ఎక్కువ చెత్త ఉత్పత్తి చేసే హోటల్స్ ని పరిశీలించారు, అనంతరం కూరగాయల మార్కెట్లో క్లీన్ చేశారు హోటల్లోనే కూరగాయల చెత్త ద్వారా సేంద్రియ ఎరువు తయారు చేయడం పైన హోటల్ యాజమాన్యానికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్, శోభ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ అఖిల , నికిత వార్డు ఆఫీసర్ మరియు ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కేంద్రంలోని కోహేన్స్ ఫార్మసీ కంపెనీలో ప్రమాదం.

షార్ట్ సర్క్యూట్ తో గ్యాస్ లీకై ఇద్దరికీ అస్వస్థత, ప్రైవేట్ హాస్పిటల్ కు తరలింపు.

**సూర్యాపేట మార్చి 12, ప్రభాతవార్త:**

మున్సిపాలిటీ పరిధిలో నీ కోహేన్స్ ఫార్మసీ కంపెనీలో షార్ట్ సర్క్యూట్ తో గ్యాస్ లీకై ఇద్దరు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. బాధితులను చికిత్స కోసం పట్టణం లో నీ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. షార్ట్ సర్క్యూట్ తో గ్యాస్ లీకై ఇద్దరికీ అస్వస్థత గురి కావడం తో, ఈ సఘటనతో ఆగ్రహించిన స్థానికులు కంపెనీ ముందు ఆందోళన చేపట్టారు. సిపిఐ ఎంఎల్, కంపెనీ ముందు ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ. జనావాసాల మధ్య ఉన్న ఈ పరిశ్రమను తక్షణమే వేరే ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేశారు. పారిశ్రామిక భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని వారు ఆరోపించారు. ఈ ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి గాయపడిన బాధితులకు న్యాయం చేయాలని కోరారు.




## కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలకు 422 మంది విద్యార్థులు గైరాజర్

**.సూర్యాపేట, మార్చి 12 (ప్రభాతవార్త)**

: సూర్యాపేట జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం (కెమిస్ట్రీ, కామర్స్) పరీక్షలు గురువారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి అని జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్, డీఈసీ, డీఐఈఓ వి. భాను నాయక్ తెలిపారు. ఈ పరీక్షలకు మొత్తం 8,378 మంది విద్యార్థులకు గాను, 7,956 మంది విద్యార్థులు హాజరయ్యారు. సాధారణ విభాగంలో 6,921 మంది విద్యార్థులకు గాను 6,676 మంది హాజరయ్యారు. వృత్తి విద్య విభాగంలో 1,457 మందికి గాను 1,280 మంది పరీక్షలకు హాజరయ్యారు. మొత్తం 422 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలకు జిల్లాలో 94.96 శాతం హాజరు నమోదైంది. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని, మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని . పరీక్షలు ప్రశాంత వాతావరణ జరిగాయని పేర్కొన్నారు.

## నంద్యాల దయాకర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షల వెల్లువ

**సూర్యాపేట, మార్చి 12 (ప్రభాత వార్త)**



: బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, ప్రముఖ న్యాయవాది నంద్యాల దయాకర్ రెడ్డి జన్మదిన సందర్భంగా పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి దయాకర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి సహకారంతో బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు (కేసీఆర్) ను, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు (కేటీఆర్) ను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా కేసీఆర్, కేటీఆర్, దయాకర్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని దయాకర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

## ఆర్థిక సహాయం అందజేత

**హాలియా, ప్రభాతవార్త, మార్చి 12:**



అనుముల మండలం కొత్తపల్లి గ్రామంలో కనకరాజు కృష్ణయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో కొత్తపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉడుతూరి కోటి రెడ్డి కృష్ణయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పించి కుటుంబ సభ్యుల నీ పరామర్శించారు. కృష్ణయ్య కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు ఆయన వెంట హాలియా వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ సజ్జల రఘుపతి రెడ్డి, ఉడుతూరి భాస్కర్ రెడ్డి, చెన్ను సైది రెడ్డి తదితరులు ఉన్నారు.

## నేడు విద్యుత్ కు అంతరాయం

**హాలియా, ప్రభాతవార్త, మార్చి**

12: 33 కె.వి హాలియాఫీడర్ లైన్ షిఫ్టింగ్ వర్క్ జరుగుతునందున 33/11 కె.వి హాలియా సబ్ స్టేషన్ పరిదిలోని అన్ని ఫీడర్లకు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుండి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని హాలియా ఏఈ ధనరాజ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున గృహ, వాణిజ్య, ఇండస్ట్రియల్ వినియోగదారులు, రైతులు విద్యుత్ సిబ్బందికి, అధికారులకు సహకరించాలని కోరారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన బుసిరెడ్డి

**పెద్దవూర మార్చి 12 ప్రభాతవార్త**



మండల కేంద్రంలోనిరాఘవేంద్ర ఫంక్షన్ హాల్ నందు...మట్టపెల్లి నాగమ్మ హనుమంత్ రెడ్డిల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా హాజరై వధూవరులు ధరణి రవీందర్ రెడ్డిలను బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి ఆశీర్వదించారు. వీరితో పాటు ఈ కార్యక్రమంలో శ్రీరాంపల్లి ఉప సర్పంచ్ గజ్జల శివారెడ్డి, వార్డు మెంబర్ పోలోజు రమేష్ చారి, తిరుమలగిరి సాగర్ మండలం మాజీ వైస్ యంపిపి యడవెల్లి దిలీప్ కుమార్ రెడ్డి, పెద్దవూర మాజీ సర్పంచ్ నడ్డి లింగయ్య యాదవ్, మాజీ ఉప సర్పంచ్ మట్టపల్లి ప్రదీప్ కుమార్ రెడ్డి, కొప్పోలు మాజీ సర్పంచ్ తిరుగుడు లింగారెడ్డి, కర్నాటి వినోద్ రెడ్డి, పున్ రెడ్డి వెంకటరెడ్డి, పున్ రెడ్డి రవీందర్ రెడ్డి, పున్ రెడ్డి భార్గవ్ రెడ్డి, కర్నాటి జాన్ రెడ్డి, బిపిఆర్ వైడిఆర్ అధ్యక్షుడు గడ్డం సజ్జన్, ఇస్రం లింగస్వామి, వడిత్య విజయ్, అలుగుబెల్లి ఆదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీ గురుకుల కళాశాలలో అదనపు తరగతి గదుల మంజూరుకు కృషి

**గుర్రంపోడు, మార్చి 12, ప్రభాతవార్త:**

గుర్రంపోడు మండలంలోని పిట్టలగూడెం గ్రామంలో గల మైనార్టీ బాలుర గురుకుల కళాశాలలో అదనపు తరగతి గదుల మంజూరుకు కృషి చేస్తానని స్థానిక సర్పంచ్ సూదిని సునీత జగదీశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం కళాశాలను ఆకస్మికంగా సందర్శించారు. కళాశాలలో సమస్యలను విద్యార్థులను, అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. కళాశాల పురోగతికై తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. కళాశాలలో భోజనాన్ని రుచి చూశారు. సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట కళాశాల ప్రిన్సిపాల్ మహమ్మద్ ఫా రూక్, ఉప సర్పంచ్ మారపాక అంబేద్కర్, పంచాయతీ కార్యదర్శి జగదీష్, తిరందాసు అంజయ్య , ఆదాం, వార్డు సభ్యులు ఉన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**గుర్రంపోడు, మార్చి 12 ప్రభాతవార్త :**



మండలంలోని బొల్లారం గ్రామానికి చెందిన కామల్ల ప్రసాద్ అకాల మరణం చెందగా, ఆ మిత్రుడి కుటుంబం రోడ్డున పడకుండా 200001 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు తమ వంతు బాధ్యతగా అండగా నిలిచారు. గుర్రంపోడు మండలం కొప్పోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 200001 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న కామల్ల ప్రసాద్ పది రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబ పెద్దను కోల్పోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ప్రసాద్ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన స్నేహితులు నిర్ణయించుకున్నారు. కొప్పోలు హైస్కూల్ మిత్రులందరూ సమన్వయం చేసుకుని తలా కొంత నగదు పోగు చేసి, మొత్తం 60,000 రూపాయల ఆర్థిక సహాయాన్ని సేకరించారు. గురు వారం రోజున మిత్రుల బృందం బొల్లారం గ్రామంలోని బాధిత కుటుంబాన్ని పరామర్శించి, సేకరించిన నగదును అందజేశారు. ఈ సందర్భంగా మిత్రులు మాట్లాడుతూ.. తమతో కలిసి చదువుకున్న ప్రసాద్ మరణం తమను తీవ్రంగా కలిచివేసిందని, వారి పిల్లల భవిష్యత్తు కోసం ఈ చిన్న సాయం చేశామని తెలిపారు. చిన్ననాటి స్నేహితులు చూపిన ఈ మానవత్వాన్ని స్థానికులు, గ్రామస్తులు అభినందించారు.

# 7ఆర్ మైనర్“ కాల్వ పనులు తక్షణమే చేపట్టాలి ..

## సాగు నీరులేక ఎండిన వరి పంటను పరిశీలించిన ఎమ్మెల్సీ

మునుగోడు మార్చి 12 ప్రభాత వార్త



మండలంలో సాగునీటికి సంబంధించిన “7ఆర్ మైనర్“ కాల్వ పనులు తక్షణమే చేపట్టాలని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కల్వలపల్లి గ్రామంలో బోరుబావుల మీద ఆధారపడి రైతులు సాగుచేసిన నీరులేక ఎండిన వరి పంటను గురువారం రైతులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు.ట్యాంకర్లాతో రైతులు ఎండిన పంటకు నీరును అందించి కాపాడుకునే ప్రయత్నం చేయడం పట్ల ఆయన అధికారులపై ఆవేదన వ్యక్తం చేశారు. 7ఆర్ కాల్వ నిర్మాణం పట్ల నిర్లక్ష్యం వహించిన సదర్ కాంట్రాక్టర్ పై చర్యలు చేపట్టాలని అన్నారు. మునుగోడు ప్రాంతంలో 17 గ్రామాల్లో వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయావని బాధిత రైతులకు ఎకరాకి 40 వేల చొప్పున ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆరుగలం శ్రమించి పంట ఎండితే రైతుకు ఎంత బాధ ఉంటుందో తాను స్వయంగా వ్యవసాయం చేసి అనుభవించనని ఆయన గుర్తు చేశారు.మునుగోడు ప్రాంతానికి చెంతనే ఉన్న బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు నుండి కాల్వను కిష్టాపురం వరకు పొడిగించి మునుగోడు, నల్లగొండ మండలాలలోని చెరువులను నింపాలని కోరారు.కొలమానాలు లేకుండా ఇక్కడి నుండి నకిరేకల్ , నల్లగొండ నియోజకవర్గాలకు తరలించడం అన్యాయమన్నారు.పులిపలుపుల, కాల్వలపల్లి, కాశవారు గూడెం, బీరెల్లిగూడం లకు తక్షణమే నీరు ఇచ్చే అవకాశం ఉన్నా.. అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. 7ఆర్ కాల్వ నిర్మాణం కొరకు ఒక్క కాల్వలపల్లి గ్రామం నుండే 36 ఎకరాలు భూమిని సేకరించినట్లు పేర్కొన్నారు.అయినాను నేటికిని పనులు పూర్తి చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యధోరణికి అద్దం పడుతుందన్నారు.ఇకనైనా పనులను చేపట్టి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. లేనిచో ఇక్కడి 17 గ్రామాల రైతులను సమీకరించి సాగునీటిని సాధించేవరకు ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కాల్వలపల్లి మాజీ సర్పంచి గట్టుపల్లి నర్సిరెడ్డి, తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురజా రామచంద్రం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బోల్గురి నరసింహ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి తీర్పారీ వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిల్ సభ్యులు సురిగి చలపతి, ఉప సర్పంచ్ వీరమల్లు, సిపిఎం మండల కార్యదర్శి మల్లేశం, యంపల్ల సాయిలు, పంతంగి లక్ష్మయ్య, గుండెబోయిన దానమ్మ, పర్నే లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## పశువుల, కూరగాయల సంత బహిరంగ వేలం

మునుగోడు మార్చి 12 ప్రభాత వార్త

మునుగోడు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈ నెల 17వ తేదీ ఉదయం 10:30 గంటలకు పశువుల సంత,కూరగాయల సంత బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు.వేలంలో పాల్గొనే వారు ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు పంచాయతీ కార్యదర్శి గ్రామపంచాయతీ మునుగోడు పేరుతో పశువుల సంతకు రూ.80 వేలు, కూరగాయల సంతకు రూ.40 వేల డీడీ తీసి పంచాయతీ కార్యాలయంలో సమర్పించాలన్నారు. 2026-27 సంవత్సరానికి సంబంధించిన తైబజార్ చార్జీల వసూలు హక్కులను 01042026 నుంచి 31032027 వరకు వేలం ద్వారా కేటాయించనున్నట్లు తెలిపారు.మరిన్ని వివరాలకు గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

## వరల్డ్ కిడ్నీ డే వేడుకలు

మర్రిగూడ, మార్చి 12, ప్రభాతవార్త :



వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా గురువారం మర్రిగూడ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో డయాలసిస్ వార్డులో హాస్పిటల్స్ సూపరింటెంట్ డాక్టర్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మర్రిగూడ డయాలసిస్ సెంటర్లో 32 మంది కిడ్నీ బాధితులు ఉన్నారని వారికి క్రమం తప్పకుండా డయాలసిస్ చేయడం జరుగుతుందన్నారు . ఈ కార్యక్రమంలో హెడ్ సిస్టర్స్ శ్రీదేవి, సంధ్య, డయాలసిస్ ఇన్చార్జులు గిరి, సంధ్య, అనూష, సిస్టర్స్ రేవతి, మంగమ్మ తో పాటు, ఆరోగ్య మిత్ర గిరి. యాదయ్య పాల్గొన్నారు.

## మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

మర్రిగూడ మార్చి 12 ప్రభాతవార్త

మర్రిగూడలోని ముస్లింలకు ఇఫ్తార్ విందుని మర్రిగూడ గ్రామ సర్పంచ్ వీరమళ్ళ శిరీషలోకేష్ గౌడ్ ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రంజాన్ ముస్లిం సోదరులకు పవిత్ర మాసమన్నారు. రంజాన్ ఉపవాస దీక్షలు చేస్తున్నవారికి ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నల్ల యాదయ్య మాజీ వైస్ ఎంపీపీ వెంకటేష్ గౌడ్ గ్రామ ఉపసర్పంచ్ మహేశ్వరం రమేష్ ముస్లిం మత పెద్దలు వార్డ్ సభ్యులు యండి జమీర్ మాజి కోఆప్షన్ సభ్యులు యాకుబ్ అలీ వెంకటం పేట శేఖర్ యండి జబ్బార్ అశ్వక్ యూసుఫ్ సలీం పాల్గొన్నారు

## అంగరంగ వైభవంగా 16 రోజుల మహోత్సవం

చింతలపాలెం,మార్చి 12 ప్రభాతవార్త

మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి, అంకమ్మ తల్లి ఆలయంలో 16 రోజుల పండుగ భక్తి శ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. 16 రోజుల పండుగలో భాగంగా గురువారం మండలంలోని పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. సంప్రదాయబద్ధంగా



అలంకరించిన బోనాలను మహిళలు తలపై మోసుకుని మేళ తాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పులు, మేళ తాళాలు, భక్తుల జయజయధ్వానాలతో మండల కేంద్రం అంతా భక్తి వాతావరణంతో కళకళలాడింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణానికి భారీ సంఖ్యలో భక్తులు చేరుకుని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పండుగలో భాగంగా ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక వేడుకలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తన్నీరు శివ, ధర్మకర్తలు తన్నీరు కొండ, భీమిశెట్టి సత్యనారాయణ, భూక్యా మోతీరాం, యరగాని వెంకటేశ్వర్లు, తోడేటి కృష్ణంరాజు, బాణావత్ రమణ నాయక్, చిత్తలూరి లాలయ్య, కారింగుల బ్రహ్మయ్య, మామిడి గోపి, పాల్గొన్నారు.

## బ్రిడ్జిపై ప్రయాణం ఎప్పుడో.......

చండూరు,మార్చి12,ప్రభాత వార్త:



నిత్యం రద్దీగా వుండే చండూరు మాల్ రోడ్డులో అంగడిపేట వద్ద నిర్మిస్తున్న హైలెవల్ వంతెన పనులు గత కొన్ని నెలలుగా పూర్తిగా నిలిచిపోయాయి.2.80 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించినప్పటికి ప్రజలకు అందుబాటులోకి తేవటంలో సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహారిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.బ్రిడ్జ నిర్మాణం పూర్తి అయినప్పటికీ బ్రిడ్జకు ఇరువైపుల తారురోడ్డు వేయటంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యగా వ్యవహారిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అధికభాగం పనులు పూర్తి అయినా కొంత మొత్తంలో పనులను అపటంలో అంతర్యమేమిటో అని వాహనదారులు చర్చించుకుంటున్నారు.ఇప్పటికీ బ్రిడ్జి పక్కన తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టిరోడ్డుపై ప్రయాణాలు సాగిస్తున్నారు.వానకాలం ప్రారంభమైతే ఈ మట్టి రోడ్డుపై నీరు ప్రవహించి వాహానాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.వానలు కురిస్తే ప్రయాణికులు ఇతర మార్గాల ద్వారా తమ గమ్యస్థానాలకు చేరుకోవాల్సి వుంటుంది. ఇప్పటికైనా పనులు త్వరగా పూర్తిచేసి వంతెనను అందుబాటులోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.ఇందుకోసం ప్రజా ప్రతినిధులు,నాయకులు, ఉన్నతాధికారులు చొరవ చూపాలని వేడుకుంటున్నారు.

## సర్పంచ్‌ను పరామర్శించి ఎమ్మెల్యే బాలునాయక్



కొండమల్లేపల్లి,మార్చి12,ప్రభాతవార్త:

కొండమల్లేపల్లి మండలంలోని గాజీనగర్ కారోబార్ తండా సర్పంచ్ సర్దార్ తండ్రి మరణించగా,విషయం తెలుసుకున్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ గురువారం తండాకి వెళ్లి వారి స్వగృహంలో భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి,ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన వెంట స్థానిక నాయకులు,ప్రజా ప్రతినిధులు,తదితరులు ఉన్నారు.



## ఆపద్బాంధవం పై (108 )ఆకస్మిక తనిఖీ..

మునుగోడు మార్చి 12 ప్రభాత వార్త



మునుగోడు మండలంలోని ఆపద్బాంధవం(108) ని జిల్లా అధికారులు ఎస్.కె సలీం ప్రోగ్రాం మేనేజర్, ఎమర్జెన్సీ మేనేజ్మెంట్ ఎగ్జిక్యూటివ్ ప్రదీప్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నర్మదా గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు, ఎమర్జెన్సీ పరికరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న వేసవికాలంలో ఉష్ణోగ్రత అత్యధికంగా ఉండడం వలన వడదెబ్బ, అత్యవసర కేసులు అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. వడదెబ్బ కేసులను తక్షణమే ప్రథమ చికిత్స గా శరీరం చల్లబరిచే ఐస్ బాక్స్ టవల్స్ ఓఆర్ఎస్ అందుబాటులో ఉన్నాయన్నారు. 108 ఆపద్బాంధవంలో మెడికల్, అత్యాధునిక పరికరాలు, మానిటర్, ఏఈడి,అంబు బ్యాగ్,ఆక్సిజన్, స్ట్రక్చర్,స్కూప్ స్ట్రక్చర్,స్పైన్ బోర్డ్, సెక్షన్ ఆపరేటర్ మొదలగున్నవి ఉన్నాయన్నారు. ప్రతి నెల దాదాపుగా 120 కేసులు ఆర్టిఏ, స్ట్రోక్, చెస్ట్ పెయిన్ ,పెరాలసిస్, పాయిజన్ ,హ్యాంగింగ్ ,డెలివరీ, స్నేక్ బైట్ , అన్కాన్షియస్ తదితర కేసులు చేస్తుందన్నారు. తధానంతరం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నర్మద కి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఆపద్బాంధవం ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 108 సిబ్బంది ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ గుంటి రమేష్, నల్లగంటి వరప్రసాద్, పైలట్ ఎండి గాలిబ్, ఎస్.కె మునీర్ పాల్గొన్నారు.

## కుదభక్షపల్లి లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

మర్రిగూడ,మార్చి 12, ప్రభాతవార్త:

మర్రిగూడ మండలం ఖుదాబక్షపల్లి గ్రామంలో బేతేల్ గాస్పల్ చర్చ్, స్ట్రాంగ్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్ట్రాంగ్ ఫ్యామిలీ డైరెక్టర్ సిస్టర్ క్రిష్ సోనీ బూడిద జ్యోతి, మాజీ ఉప సర్పంచ్ మైలారపు పార్వతమ్మ, వార్డ్ మెంబర్ ఊరుపక్క రజిత హాజరయ్యారు. కార్యక్రమంలో సిస్టర్ క్రిష్ మాట్లాడుతూ మహిళలు సమాజంలో అన్ని రంగాల్లో ముందుండాలని, కుటుంబాన్ని సమర్థంగా ముందుకు నడిపించే శక్తి మహిళలదేనని తెలిపారు. మహిళలు ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ మహారాణులలా జీవించాలని సూచించారు. ఈ కార్యక్రమం మహిళల్లో అవగాహన పెంచుతూ ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. కార్యక్రమంలో కలలి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమం తమకు ప్రేరణగా నిలిచిందని తెలిపారు.



## ఉగాది వేడుకలకు ఆహ్వానం

**నార్కెట్ పల్లి ప్రభాతవార్త మార్చి 12**

మండలంలోని నక్కలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు,ప్రముఖ కవి, రచయిత,పుడమి సాహితీ వేదిక జాతీయ అధ్యక్షులు డా.చిలుముల బాల్ రెడ్డికి మద్రాసు విశ్వవిద్యాలయం ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించే ఉగాది వేడుకలకు ఆహ్వానం అందింది ఈ నెల 18 వ తేదీన మధ్యాహ్నం రెండు గంటలకు చెన్నైలోని మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆధ్వర్యంలో జరగనున్న మహా కవి సమ్మేళనంలో పాల్గొనే అవకాశం పొందిన ఏకైక కవి బాల్ రెడ్డి.ఈ మహా కవి సమ్మేళనంలో జాతీయ స్థాయిలో ప్రముఖ తెలుగు కవులు తెలుగువారి సాంస్కృతిక వారసత్వాన్ని,ఉగాది విశిష్టతను తమ కవితా పఠనంతో అలరించనున్నారు. జిల్లా నుండి ఇటువంటి అవకాశం పొందిన ఏకైక కవి బాల్ రెడ్డికి మండల,పట్టణ కవులు, సాహితీవేత్తలు, ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

## పెద్దిరెడ్డి వెంకట్ రెడ్డి మృతి పట్ల సంతాపం

**నార్కట్పల్లి ప్రభాతవార్త జనవరి 12**

చెరువుగట్టు గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ నారాయణరెడ్డి తండ్రి



పెద్దిరెడ్డి వెంకట్ రెడ్డి మృతి పట్ల నల్గొండ జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ రేగట్టే మల్లికార్జున్ రెడ్డి, చెరువుగట్టు మాజీ సర్పంచ్ మల్ల బాలకృష్ణ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. గురువారం పెద్దిరెడ్డి వెంకట్ రెడ్డి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ఈ కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. మాజీ సర్పంచ్ బాలకృష్ణ మాట్లాడుతూ పెద్దిరెడ్డి వెంకట్ రెడ్డి మరణం కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పిట్టల నాగన్న, మాజీ ఉపసర్పంచ్ దోనాల శంకర్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు బండమీద లింగస్వామి, పెద్ద కురుమ చీరా యాదయ్య, దొడ్డి రాములు, కంకల సతీష్, కొమ్ము అశోక్, మిర్యాల రమేష్, చీర శంకర్, దయ్యాల స్వామి, దయ్యాల శంకర్, మోటే ప్రవీణ్, పేట రామస్వామి తదితర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మహమ్మద్ ముక్తం మృతి పట్ల చిరుమర్తి సంతాపం

**నార్కట్పల్లి ప్రభాతవార్త మార్చి 12**

నార్కెట్పల్లి మండలం కొండపాకగూడెం గ్రామానికి చెందిన మహమ్మద్ ముక్తం అనారోగ్యంతో మృతి చెందగా, వారి పార్థివ దేహాన్ని నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య సందర్శించి ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. మహమ్మద్ ముక్తం మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ, ఈ కష్టకాలంలో కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఆయన వెంట స్థానిక నాయకులు గ్రామస్తులు పాల్గొని నివాళులర్పించారు.

## ఉప్పలమ్మ తల్లికి పూజలు...

**చిట్యాల రూరల్, మార్చి 12, ప్రభాతవార్త**

:తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను వనిపాకల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో తెలంగాణ జాగృతి నకిరేకల్ నియోజకవర్గ ఇంచార్జి డా. టీజీ లింగం గౌడ్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని 80మంది విద్యార్థులకు మాజీ సర్పంచ్ కట్టంగూరి పద్మ మల్లేష్ గౌడ్, ప్రధానోపాధ్యాయురాలు కౌసల్యతో కలసి మిఠాయిలు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేసి కవితకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయాల్లో ఉన్నత పదవుల్లో రాణించాలని కోరారు. అంతకు ముందు పాఠశాల ఆవరణలో స్వయంభువుగా వెలిసిన ఉప్పలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు.

## గాలికుంటు టీకాలను వినియోగించుకోవాలి -

**నార్కెట్ పల్లి ప్రభాతవార్త మార్చి 12**

పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని జిల్లా పశు వైద్యాధికారి డా. జి.వి. రమేష్ రైతులకు, పశుపాలకులకు సూచించారు.గురువారం గోపులాయిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. పశువులకు గాలికుంటు వ్యాధి అత్యంత ప్రమాదకరమైనదని, ఈ వైరస్ వల్ల పశువుల ఆరోగ్యం దెబ్బతిని పాల ఉత్పత్తి తగ్గి రైతులకు తీవ్ర నష్టం కలుగుతుందని , రైతులు తమ పశువులకు టీకాలు వేయించి వ్యాధి నుంచి రక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నార్కెట్పల్లి మండల పశువైద్యాధికారి డా. ఏ. రవి నాయక్, సిబ్బంది ఎం.డి. రియాజుద్దీన్ ( ఎల్ ఎస్ ఏ), అటెండర్ రియాజ్, గోపాల మిత్రులు సీహెచ్. వెంకన్న, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడబిడ్డకు ఆర్థిక సాయం



**శాలిగౌరారం. ప్రభాతవార్త. మార్చి. 12**

పేదింటి ఆడబిడ్డ పెళ్లి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం పంపించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు దండ అశోక్ రెడ్డి శాలిగౌరారం మండలం భైరవుని బండ గ్రామానికి చెందిన పులిగిల్ల రాముల కుమార్తె శంకరమ్మ వివాహ ఖర్చుల నిమిత్తం తన వంతు సహాయంగా 5.000. రూపాయలు ఆర్థిక సాయం పంపించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు దండా అశోక్ రెడ్డి ఇట్టి సహాయాన్ని గ్రామ సర్పంచ్ నరి గే యాదయ్య గ్రామ శాఖ అధ్యక్షులు పదాల శంకరయ్య చేతుల మీదుగా నూతన వధువు కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు లక్ష్మణ చారి. మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు ఈదులకంటి శంకరయ్య. దండంపెల్లి సర్వయ్య. వాడపల్లి జానయ్య .చోకళ్ళ శ్యాం. సాకి సతీష్ రాములు. కోనేటి వీరయ్య .అంజయ్య. పులిచర్ల పాండు. తదితరులు పాల్గొన్నారు

## స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు శిక్షణ



**నకిరేకల్. ప్రభాతవార్త. మార్చి. 12**

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా నల్గొండలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పథకాల అమలు పై అవగాహన కల్పించుటకు పట్టణ మరియు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆర్ బీ, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తో కలిసి పాల్గొన్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషించాలని, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు సమర్థవంతంగా అందేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్ , జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ , వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షలు జీవితానికి తొలిమెట్టు

**నకిరేకల్ . ప్రభాత వార్త .మార్చి .12**

పదవ తరగతి పరీక్షలు జీవితానికి తొలిమెట్టు అని, ప్రణాళిక బద్ధంగా చదివి విజయం సాధించాలని నకిరేకల్ మండల విద్యాధికారి మేక నాగయ్య



అన్నారు. గురువారం తాటికల్ ఉన్నత పాఠశాలలో జరిగిన పదవ తరగతి వీడ్కోలు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సీనియర్ ఉపాధ్యాయులు ప్రజ్ఞాపురం వెంకన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మేక నాగయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో నిర్భయంగా ఎటువంటి మానసిక ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని సూచించారు. వీడ్కోలు సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పండుగ తిరుమలయ్య మోసంగి హరీష్ చంద్ర, మార్త రాములు, డాక్టర్ సాగర్ల సత్తయ్య, నర్రా వెంకటరెడ్డి, లొట్లపల్లి కోటయ్య, నూకల జానయ్య తదితరులు పాల్గొన్నారు.




## గాలికుంటు టీకాల శిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జ డైరెక్టర్



**చిట్యాల, మార్చి 12, ప్రభాతవా**

పశువులకు ఉచిత గాలికుంటు నిరోధక టీకాల కార్యక్రమాన్ని పశువైద్య, పశుసంవర్ధక శాఖ నల్గొండ జాయింట్ డైరెక్టర్ డా. జి.వి. రమేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శిబిరంలో జరుగుతున్న వ్యాక్సినేషన్ ప్రక్రియను మరియు నిర్వహణకు సంబంధించిన రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ కోసం తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని సూచించారు. పశువుల ఆరోగ్యం మరియు పాల ఉత్పత్తి రక్షణలో ఈ టీకాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డా. వి. అభినవ్, డా. అమరేందర్, విఎల్ఓ పి. శ్రీనివాస్, ఎల్ఎస్ఏ మల్లారెడ్డి, గోపాలమిత్రలు సత్యనారాయణ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డును ప్రారంభించిన అశోక్ రెడ్డి



**న కిరేకల్ ప్రభాతవార్త మార్చి 12**

99 రోజుల ప్రజా పాలన ప్రణాళికలో భాగంగా బైరవునిబండ గ్రామంలో పంచాయతీ రాజ్ నిధులు విళినిబిళీ ద్వారా 10 లక్షల రూపాయలతో మంజూరైన నూతన దిది రోడ్డును ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు. బేస్తవారం రోజు శాలిగౌరారం మండలం బైరవునిబండ గ్రామంలో భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మరియు తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ ఆధ్వర్యంలో 99 రోజుల ప్రజా పాలన ప్రణాళికలో భాగంగా విళినిబి నిధుల క్రింద 10 లక్షల రూపాయలతో మంజూరైన నూతన సిసి రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు దండ అశోక్ రెడ్డి,గ్రామ సర్పంచ్ నరిగె యాదయ్య ,ఉప సర్పంచ్ దండ శ్రీలత క్రిష్ణారెడ్డి,మాజీ సర్పంచ్ నరిగె శంభయ్య గ్రామ శాఖ అధ్యక్షులు పడాల శంకరయ్య ,5 వ వార్డు సభ్యులు లక్ష్మణాచారి మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు ఈదులకంటి శంకరయ్య, నాయకులు దండెంపల్లి సర్వయ్య,వాడపల్లి జానయ్య,చొక్కాల శ్యామ్,సాకి సతీష్,కోనేటి వీరయ్య,గోగు వెంకట్ రెడ్డి,సంకటి రాములు,నరిగె సోమయ్య,కోనేటి అంజయ్య,సాకి రాములు,పులిచర్ల పాండు ,గ్రామ పంచాయతీ సిబ్బంది సంకటి నగేష్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వేములను కలిసి ఆశీర్వాదం తీసుకున్న కాటం

**చిట్యాల రూరల్, మార్చి 12, ప్రభాతవార్త**

పెద్దకాపర్తి గ్రామ సర్పంచ్, చిట్యాల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు కాటం వెంకటేశం తన జన్మదినం సందర్భంగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంను గురువారం నకిరేకల్ లోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.అనంతరం శాలువాతో ఘనంగా సత్కరించి, కేకు కోయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. . ఈకార్యక్రమంలో చిన్నకాపర్తి, బొంగోనిచెర్వు సర్పంచులు ఆవుల సుందరయ్య, కట్ట ఆశయ్య నాయకులు మారగోని ఆంజనేయులు గౌడ్, కుర్రు యాదయ్య, సాగర్ల నాగరాజు, ఆనగంటి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# సమీప గ్రామాల ప్రజలకు శాపంగా మారిన డంపింగ్ యార్డ్

**దట్టమైన పొగ భరించలేని దుర్గంధం**
**త్రాగునీరు కలుషితం..పంట పొలాలకు నష్టం**
**టన్నుల కొద్ది చెత్త.. ఉదయం సముద్రం త్రాగు నీటికి**
**ముప్పుడంపింగ్ యార్డ్ తరలించాలని అఖిల పక్షం నేతల డిమాండ్**



నల్గొండ రూరల్ ఫిబ్రవరి 12, ప్రభాత వార్త: నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చందనపల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్ సమీప గ్రామాల ప్రజలకు శాపంగా మారిందని అఖిలపక్ష నేతలు ఆరోపించారు. నల్గొండ మండలం చందనపల్లి గ్రామ శివారులోని డంపింగ్ యార్డును అఖిలపక్షం నేతలు, సామాజిక కార్యకర్తలు గురువారం సందర్శించారు. వారు మాట్లాడుతూ.. ప్రతిరోజు పట్టణంలోని 48 డివిజన్ ల నుంచి సుమారు 120 నుండి 130 మెట్రిక్ టన్నుల చెత్తను ఇక్కడ పడేస్తుండడంతో చుట్టుపక్క గ్రామాల ప్రజల తీవ్ర కాలుష్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. డంపింగ్ యార్డ్ నుంచి వస్తున్న భరించలేని దుర్గంధం, చెత్తను తగలబెట్టడంతో ఏర్పడుతున్న దట్టమైన పొగ కారణంగా ప్రజలు అనేక అనారోగ్య సమస్యలు గురవుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం, సాయంత్రం సమయంలో చెత్తకు నిప్పు పెట్టడంతో చదనపల్లి, ఖాజీ రామారం, శేషమ్మ గూడెం, అల్లిగూడెం, పజ్జూరు, తానేదారు పల్లి గ్రామాలపై పొగ కమ్మేస్తుండడంతో ప్రజలు ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారని, ముఖ్యంగా పిల్లలు వృద్దులు, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారని తెలిపారు. డంపింగ్ యార్డ్ లో చెత్తతో పాటు కుళ్ళిన మాంసం కళేబరాలను కూడా పడేయడంతో కుక్కలు గుంపులుగా తిరుగుతూ ప్రజలకు ముప్పుగా మారుతున్నాయని, రైతులు వ్యవసాయ పొలాలకు వెళ్లడానికి, డి39 కాలువ వెంట ప్రయాణం చేయడానికి, నల్గొండ నుండి నకిరేకల్ వెళ్లే వాహనదారులకు ఆటంకంగా మారుతోందని అన్నారు. ఎన్నికల సమయంలో డంపింగ్ తొలగిస్తామని ప్రజా ప్రతినిధులు ఇచ్చిన హామీలు ఇప్పటికీ నెరవేర్చకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## తాటికోల్ గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు




**.దేవరకొండ, మార్చి 12, ప్రభాత వార్త :** దేవరకొండ మండల పరిధిలోని తాటికోల్ గ్రామ సర్పంచ్ చలమల్ల విజయ్ ఆధ్వర్యంలో గురువారం యూనియన్ బ్యాంక్ ఖాతాలు ఉన్నవారికి భీమా ఇన్సూరెన్స్ పాలసీ గురించి గ్రామంలో యూనియన్ బ్యాంక్, సిఎస్సి, సిఎఫ్ఎల్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ సర్పంచ్ చలమల విజయ్ మాట్లాడుతూ బ్యాంక్ ఖాతాలు ఉన్నవారు ప్రతి ఒక్కరు వృద్దులు వికలాంగులకు మేలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పెన్షన్ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పాలసీలు గురించి గ్రామ ప్రజలకు బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన వార్షిక ప్రీమియం కేవలం 20 రూపాయలకే 2 లక్షల రూపాయల ప్రమాద భీమా లభిస్తుందని ఈ పథకం 18 సంవత్సరాల నుండి 70 సంవత్సరాల వయస్సు గల బ్యాంకు ఖాతాదారులకు మాత్రమే మీ తరువాత మీ కుటుంబ సభ్యులకు భీమా సొమ్ము లభిస్తుందని తెలిపారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన వార్షిక ప్రీమియం కేవలం 436 రూపాయలకే 2 లక్షల రూపాయల ప్రమాద బీమా లభిస్తుందన్నారు. ఈ పథకం 18 సంవత్సరాల నుండి 50 సంవత్సరాల వయస్సు గల బ్యాంకు ఖాతాదారులకు మాత్రమే మీ తరువాత మీ కుటుంబ సభ్యులకు దుర్ఘటన స్థాయి, వైకల్యం కూడా భీమాలో ఉంటాయని గ్రామ ప్రజలకు సూచించారు. భీమా అనేది అనుకోని ప్రమాదాలు,మరణం లేదా అనారోగ్యంతో మరణించిన వారికీ ప్రీమియం చెల్లించడం ద్వారా పాలసి దారుడు తన కుటుంబాన్ని ప్రధానంగా జీవిత బీమా, ఆరోగ్య బీమా చెల్లించబడుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమం లో పంచయితి కార్యదర్శి నిరంజన్, నేరేడుగొమ్ము సిఎఫ్ఎల్ కోఆర్డినేటర్ రాపర్తి వినయ్ కుమార్, అసోసియేట్ లక్ష్మణ్, యూనియన్ బ్యాంక్ సిఎస్సి శ్రీశైలం గ్రామా ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ విధ్వంస రహిత ఔషధ పరిశోధనలు జరగాలి




**నల్గొండ టౌన్ ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** పర్యావరణాన్ని ఏమాత్రం కలుషితం చేయకుండా ఔషధ పరిశోధనలు జరగాలని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ, హైదరాబాద్ ముఖ్య శాస్త్రవేత్త ప్రొఫెసర్ నాగారపు లింగయ్య అన్నారు. గురువారం నాగార్జున ప్రభుత్వ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో భారతదేశంలో హరిత ఇంధన వనరుల ప్రాముఖ్యత మరియు పర్యావరణ పరిరక్షణ పై రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా. లింగయ్య హాజరై ప్రసంగించారు. ఔషదాలను కనుగొనడం ఎంత ముఖ్యమో పర్యావరణాన్ని రక్షి ంచుకోవడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర విభాగం ప్రొఫెసర్ రాము శ్రీధర్ కీలక ప్రసంగం చేస్తూ కార్బోహైడ్రేట్ల ప్రాముఖ్యతను వివరించారు. ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డా. పరంగి రవి కుమార్ మాట్లాడుతూ.. మారుతున్న కాలంతో పాటు పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టడానికి హరిత ఇంధన వనరులు ఏకైక మార్గమని అన్నారు. భారతదేశం ప్రస్తుతం ప్రపంచంలోనే పునరుత్పాదక ఇంధన రంగంలో వేగంగా దూసుకుపోతున్న దేశాల్లో ఒకటిగా నిలిచిందని అన్నారు. సదస్సు సంచాలకులు ప్రొఫెసర్ అంతటి శ్రీనివాసులు మాట్లాడుతూ.. విద్యార్థులు హరిత ఇదనం దిశగా పాటుపడాలని తద్వారా దేశాన్ని శిలాజ ఇంధనాల నుండి వచ్చే కాలుష్యం నుండి కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పరీక్షల నియంత్రణాధికారి డా. డి. మునిస్వామి, విద్యాత్మిక సమన్వయ కర్త బత్తిని నాగరాజు, రసాయన శాస్త్ర విభాగ అధ్యాపకులు డా. అనిల్ అబ్రహం. డా. అనిల్ బొజ్జ, డా. బి. వెంకటేశ్వర్లు. అధ్యాపకులు డా. సి. జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

# పది పరీక్షలకు సర్వం సిద్ధం

**చింతపల్లి మార్చి 12 ప్రభాత వార్త :** మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్టు మండల విద్యాధికారి నీరుడు అంజయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మార్చి 14శనివారం నుండి ఏప్రిల్ 13వరకు జరగబోయే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు చింతపల్లి మండలంలో అన్ని విధాలుగా పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.మండలంలో మొత్తం మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయబడ్డాయి. అందులో హై స్కూల్ చింతపల్లి పరీక్షా కేంద్రంలో 113 మంది విద్యార్థులు, తెలంగాణ మోడల్ స్కూల్ చింతపల్లి పరీక్షా కేంద్రంలో 213 మంది విద్యార్థులు, మాతృశ్రీ హైస్కూల్ చింతపల్లి పరీక్షా కేంద్రంలో 220 మంది విద్యార్థులు మొత్తంగా 546 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్టు తెలిపారు.వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా పరీక్షా కేంద్రాలలో తాగునీటి సౌకర్యం, ఫ్యాన్లు, కుర్చునే సౌకర్యం తదితర అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ పేర్కొన్నారు.విద్యార్థులు ఎటువంటి ఆందోళనకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని, పరీక్షా కేంద్రాలకు సమయానికి ముందుగానే చేరుకోవాలని సూచించారు. అలాగే పరీక్షా నిబంధనలు పాటిస్తూ ప్రతి విద్యార్థి పరీక్షలను విజయవంతంగా పూర్తి చేయాలని ఆకాంక్షి ంచారు.

## నాగార్జున ప్రభుత్వ కళాశాలలో ఎకో క్లబ్ ఆధ్వర్యంలో క్షేత్ర పర్యటన

**నల్గొండ రూరల్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**




:తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ సూచనల మేరకు నాగార్జున గవర్నమెంట్ కళాశాల ఏకో క్లబ్ ఆధ్వర్యంలో దండెంపల్లి గ్రామంలో వ్యర్థాల నిర్వహణ కేంద్రానికి విద్యార్థులతో కలిసి ఫీల్డ్ విజిట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వైస్ ప్రిన్సిపల్స్ డా. పరంగి రవి, డా. ఏ. శ్రీనివాసులు, సీ.ఓ.ఈ డా. డి. మునుస్వామి మరియు అకాడమిక్ కోఆర్డినేటర్ డా. బత్తిని నాగరాజు ప్రారంభించారు. ఏకో క్లబ్ కన్వీనర్ వి. శిరీష మాట్లాడుతూ.. వ్యర్థాలను సరైన విధంగా వర్గీకరించడం చాలా అవసరమని తెలిపారు. ఇంటి వద్దే తడి వ్యర్థాలు మరియు పొడి వ్యర్థాలను వేరు చేయడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చని చెప్పారు. అలాగే "రెడ్యూస్, రీయూస్ , రీసైకిల్ " విధానాన్ని పాటించడం ద్వారా వ్యర్థాలను ఉపయోగకరమైన వనరులుగా మార్చుకోవచ్చని విద్యార్థులకు వివరించారు. ముఖ్యంగా తడి వ్యర్థాలను కంపోస్ట్‌గా మార్చి వ్యవసాయం మరియు తోటలలో ఉపయోగించవచ్చని తెలియజేశారు. ఈ సందర్భంగా స్టేట్ ఫీల్డ్ విజిట్ ఆఫీసర్ సూర్యకిరణ్ మరియు జిల్లా స్వచ్ఛ భారత్ సమన్వయకర్త మొయినుద్దీన్ వ్యర్థాల వర్గీకరణ ప్రక్రియను విద్యార్థులకు ప్రత్యక్షంగా చూపించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏకో క్లబ్ సభ్యులు కె. శివరాణి, డా. పి. సిద్దేశ్ గౌడ్, డా. డి. కృష్ణ మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ఫీల్డ్ విజిట్ ద్వారా విద్యార్థులు వ్యర్థాల నిర్వహణపై ప్రాయోగిక అవగాహన పొందారు.

## అధికారుల ఆకస్మిక తనిఖీలు :

**అక్రమ సిలిండర్ల బాగోతం బట్టబయలు.అక్రమాలకు పాల్పడితే గ్యాస్ ఏజెన్సీ లైసెన్సులు రద్దు.**

**దేవరకొండ,మార్చి 12, ప్రభాత వార్త**



: గృహ అవసరాల కోసం కేటాయించిన(డొమెస్టిక్) గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు అక్రమంగా వాడుతున్నట్లు వచ్చిన ఫిర్యాదులతో గురువారం దేవరకొండ నియోజకవర్గం కొండ మల్లేపల్లి పట్టణంలోని హోటల్స్, ధాబాలు, రీఫీలింగ్ సెంటర్లలో సివిల్ సప్లయ్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు, టాస్క్ ఫోర్స్ అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దాడులు నిర్వహించారు. జిల్లా పౌర సరఫరా అధికారి పి.వెంకటేష్ ఆదేశాల మేరకు నిర్వహించిన తనిఖీలలో మొత్తం 60 గృహ అవసరాల సిలిండర్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. అక్రమాలకు పాల్పడితే సదర్ గ్యాస్ ఏజెన్సీ లైసెన్సులను రద్దు చేస్తామని అధికారులు హెచ్చరించారు. దాడుల్లో సివిల్ సప్లయ్స్ అధికారులు, డిప్యూటీ తహసిల్దార్ సివిల్ సప్లయ్స్ ఎస్.డి.ముబీన్, డిటిసిఎస్ ఎండి ముక్తార్, ఏ. దీపక్, ఆర్. సైదులు గౌడ్, జ్యోతి, ఆర్ ఐ లు ఏ. సైదులు, కుమార్ రెడ్డి, టాస్క్ ఫోర్స్ సిబ్బంది సైదులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు మంచి ఫలితాలను సాధించాలి

**బీబీనగర్, మార్చి 12 ప్రభాతవార్త:**
ప్రతి విద్యార్థి కష్టపడి చదువుల్లో మంచి ఫలితాలను సాధించాలని సర్పంచ్ సిద్ధగోని శ్రీకాంత్ గౌడ్ అన్నారు. మండలంలోని రాఘవాపురం గ్రామానికి చెందిన పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా కిట్లను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థుల జీవితంలో కీలకమైన దశ అని, ఇది భవిష్యత్తుకు పునాది అని అన్నారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రణాళిక బద్ధంగా చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చు అని తెలిపారు. పరీక్షల సమయంలో భయపడకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తోర్పునూరి రవి, గ్రామ శాఖ అధ్యక్షులు మేకల కుమార స్వామి, మాజీ సర్పంచ్ రక్తని కృష్ణ, మాజీ ఉప సర్పంచ్ అంబటి చంద్రయ్య, నాయకులు రక్తాని మల్లేష్, జంగయ్య,



తిరుపెల్లి ఎల్లేష్, గొలనుకొండ ప్రసాద్ యూత్ కాంగ్రెస్ నాయకులు జక్కి యాదగిరి, అంబటి గణేష్, మంద మధు, సిద్ధగోని వెంకటేష్, రక్తని రమేష్, అంబటి మహేష్, గొలనుకొండ నవీన్, న్యాలపట్ల అఖిల్, మధు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వపరిపాలనా దినోత్సవం

**బీబీనగర్, మార్చి 12 ప్రభాతవార్త**
:మండల పరిధిలోని చిన్న రావులపల్లి గ్రామంలో గల ప్రాథమిక పాఠశాల లో గురువారం స్థానిక స్వపరిపాలనా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా, అధికాఅల రించారు. ఈకార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కే. జోసెఫ్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులు కస్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆశీర్వదించారు. చిన్న రావుల పల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాసు రెడ్డి పాల్గొని పిల్లలు నిజ జీవితంలో అధికారులు కావాలని కోరారు. గ్రామ సర్పంచ్ కొమిరే శ్రీకాంత్ పాల్గొని పాఠశాల అభివృద్ధికి తోడ్పడుతానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి. వెంకటా చారి,



పాఠశాల కమిటీ ఛైర్పర్సన్ మీసాల సుజాత, ఉపాధ్యాయులు కే. అరుణ, విద్యార్థుల తల్లిదండ్రులు అండాలమ్మ, సరిత, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

## ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో రైతుల భూములపై కన్నా

**అడ్డగూడూరు, మార్చి 12 (ప్రభాత వార్త):**
యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం డీ.రేపాక గ్రామంలో ఇండస్ట్రియల్ పార్క్ నిర్మాణం పేరుతో వ్యవసాయ భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు తీవ్ర వివాదానికి దారితీశాయి. సర్వే నంబర్ 165లో భూసేకరణకు వ్యతిరేకంగా బాధిత రైతులు, యాదవ సంఘాల నాయకులు గురువారం గంగాదేవిగుట్ట వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. తమ జీవనాధారమైన పంట భూములను లాక్కోవద్దని రైతులు ప్రభుత్వాన్ని కోరారు. తరతరాలుగా సాగు చేస్తున్న భూములను ఇండస్ట్రియల్ పార్క్ కోసం స్వాధీనం చేసుకుంటే తమ కుటుంబాలు ఉపాధి కోల్పోయే పరిస్థితి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సర్వే నంబర్‌లో దేవాలయాలు ఉన్నప్పటికీ అధికారులు దేవాలయాలు లేవని తప్పుడు నివేదికలు సమర్పించారని రైతులు ఆరోపించారు. ఆ ప్రాంతంలో యాదవుల కులదైవాలైన గంగాదేవి, లింగమంతుల స్వామి, కోటప్ప ఆలయాలు



ఉన్నాయని తెలిపారు. ఈ ఆలయాలు, గంగాదేవి గుట్టను భూసేకరణ నుంచి మినహాయించాలని యాదవ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఇండస్ట్రియల్ పార్క్ నిర్మాణంపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పునర్విమర్శించాలని, రైతుల వ్యవసాయ భూములను కాపాడాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షులు గొలుసుల ముత్తయ్య, పెద్ద గొల్ల ముక్కాముల లింగయ్య, గొలుసుల నరసింహ, సారి గొల్ల ముక్కాముల సైదులు, ముక్కాముల నరేష్, యాదమల్లు, గొలుసుల నవీన్, గొలుసుల ఉపేందర్, రామనర్సయ్య, గణేష్ పురుషోత్తం, నాగరాజు కొమరమల్లు, గంగమల్లు, వెంకటేశ్వర్లు, సోమన్న, ఉమేష్, గంగయ్య, మల్లేష్, మల్లయ్య, యాదగిరి తదితర రైతులు పాల్గొన్నారు.

## సకాలంలో వేతనాలు చెల్లించాలి

**భువనగిరి రూరల్ మార్చ్ 12 ప్రభాతవార్త**




: అత్యవసర వైద్య సేవలందించి ప్రజల ప్రాణాలను కాపాడే108 అంబులెన్స్ ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు జిల్లా ఉద్యోగుల సంఘం ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పథకలలో అత్యధిక గుర్తింపు పొందిన పథకం108 కాని గత ఆరు నెలల నుండి సకాలంలో జీతాలు అందక ఉద్యోగులు ఆర్థిక, మానసిక ఆందోళనకు గురవుతున్నట్లు ఉద్యోగుల సంఘం ప్రకటనలో తెలిపారు. పగలు, రాత్రి తేడా లేకుండా ప్రమాదాలు జరిగిన వెంటనే ప్రజలకు సేవలందిస్తూ ప్రాణాలను రక్షి స్తున్న 108 ఉద్యోగుల జీతాల పట్ల ప్రజా ప్రభుత్వం నిరక్ష ్యంగా వ్యవహరించడంతో పిల్లల చదువులు, ఇళ్ల అద్దెలు, బ్యాంకు లోన్లు, కుటుంబ అవసరాల నిమిత్తం అప్పులు చేయాల్సిన దుస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సరైన సమయానికి జీతాలు అందించి ఆర్థికంగా ఆదుకోవాలని 108 ఉద్యోగుల సంఘం ప్రకటనలో కోరారు.

## విద్యుత్ సమస్యలు పరిష్కరించడమే ధ్యేయం

**మార్కెట్ కమిటీ ఛైర్మన్ రేఖ బాబురావు**

**భువనగిరి రూరల్ మార్చి 12 ప్రభాతవార్త**



భువనగిరి మండలం బోల్లేపల్లి గ్రామంలో 50 లక్షలతో విద్యుత్ స్తంభాలు మంజూరు చేసి గురువారం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ ఛైర్మన్ రేఖ బాబురావు మాట్లాడుతూ బొల్లెపల్లి లో స్తంభాలు లేక ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యను స్థానిక శాసనసభ్యులు అనిల్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి జిల్లా అధికారి శీని కి ఆదేశించగా సమస్యని గుర్తించిన అధికారులు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి పనులు మొదలుపెట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు జిట్టా కృష్ణరెడ్డి, మద్ది ముత్యంరెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ నాయకులు కనకుంట్ల కొండల్, బాలస్వామి, బాలకృష్ణ, నల్లగొండ ప్రభాకర్,.శ్రీను, .శ్రీను, నర్సింహా, యాదయ్య, బుచ్చయ్య, బాలయ్య, వేంకటేష్ లు హర్షం వ్యక్తం చేశారు.




## కేటీఆర్ ను కలిసిన బొక్క జైపాల్ రెడ్డి

**బీబీనగర్, మార్చి 12 ప్రభాతవార్త:**
బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావును గురువారం హైదం బాదులోని ఆయన నివాస గృహంలో బీబీనగర్ మండల మాజీ రైతుబంధు సమితి అధ్యక్షులు బొక్క జైపాల్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ బలోపేతంపై చర్చించినట్లు తెలిపారు.



ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు నంద్యాల దయాకర్ రెడ్డి ఉన్నారు

## నేడు సీల్డ్‌టెండర్ ద్వారా పశువుల సంత వేలం

**బీబీనగర్, మార్చి 3 ప్రభాతవార్త :** నేడు సీల్డ్ టెండర్ ద్వారా పశువుల సంత వేలం నిర్వహించనున్నట్టు డిఎల్ఓ శ్రీకాంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కొండమడుగు గ్రామంలో 2026 2027 సంవత్సరానికి సంబంధించిన పశువుల సంత రుసుము వసూలు హక్కుల కోసం మూడవసారి వేలంపాట నిర్వహించగా ఉజ్జాయింపు ధర రాక వేలం పాట వాయిదా పడిందన్నారు. వేలం పాటలో అత్యధికంగా రూ.80,08,000కు ఎర్కల శ్రీనివాస్ పాట పాడగా, రెండో పాటదారుగా రూ. 80,07,000కు మీసాల రాములు పాల్గొన్నారని తెలిపారు. అదే నియమ నిబంధనలతో మార్చి 13(నేడు) శుక్రవారం రోజున సీల్డ్ టెండర్ కమ్ కొటేషన్ విధానంలో మళ్లీ వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు.

## కస్తూర్బా పాఠశాలకు ఉచితంగా ప్యాడు పెన్నుల పంపిణీ చేసిన కిరాణా షాపు యజమాని రమేష్

**ఆత్మకూర్ ఎం మార్చి 12 ప్రభాతవార్త.**



ఆత్మకూర్ ఎం మండలంలో కస్తూర్బా పాఠశాల లో పదవ తరగతి 45 మంది విద్యార్థులకు 14వ తేదీన జరిగే ఆనివెల్ పరీక్షలకు హాజరవుతున్న వారికి కిరాణా షాపు యజమాని దాచ రమేష్ గుప్తా పరీక్ష మెటీరియల్ ఆయన ఉచితంగా అందజేశారు

## ఈత చెట్లకు నిప్పంటించిన గుర్తుతెలియని వ్యక్తులు

**ఆత్మకూర్ ఎం మార్చి 11 ప్రభాతవార్త.**
మండలంలో పల్లెర్ల గ్రామంలో గ్రామ గీత కార్మిక సంఘానికి చెందిన ఐదెకరాల భూమిలో సుమారు 600 ఈత చెట్లు పెట్టగా గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతోపూర్తిగా కాలిపోవడంతో స్పందించిన ఎక్సైజ్ సీఐ హనుమంతు పరిశీలించడం జరిగింది బుధవారం నాడు మండలంలో పల్లెర్ల గ్రామంలో ప్రభుత్వం కేటాయించిన ఈత చెట్లు పెంచుకోవడానికి గీత కార్మికులను బలోపేతం చేయడానికి ప్రభుత్వాలు కేటాయిస్తే గుర్తుతెలియని వ్యక్తులు తగలబెట్టారని పూర్తిగా ధ్వంసం అయిపోయింది అని గౌడ సంఘం కార్మికులు ఆయన వ్యక్తం చేశారు వెంటనే స్పందించిన ఎక్సైజ్ అధికారులు దానికి కారకులు వెంటనే పట్టుకొని అరెస్టు చేస్తామని హామీ ఇచ్చారు



# అంగరంగ వైభవంగా శ్రీకళ్యాణ వేంకటేశ్వరుని కళ్యాణమహోత్సవం

**మేళ్ళచెరువు మార్చి 12 ప్రభాతవార్త:**

స్థానిక మైహోమ్ ఇండస్ట్రీయస్ మహా సిమెంట్ శ్రీనగర్ కాలనీలో వేంచేసియున్న శ్రీదేవిభూదేవి సమేత శ్రీకళ్యాణవేంకటేశ్వరస్వామి ఆలయములో గురువారం 28వ కళ్యాణబ్రహ్మోత్సవముల కార్యక్రమా లలో భాగంగా శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ త్రిదండి ఆహోబిల రామానుజ జీయర్స్వామి, శ్రీశ్రీశ్రీ త్రిదండి దేవనాథ జీయర్ స్వామి ముగ్గురు పీఠాధిపతుల ప్రత్యేక్ష పర్యవేక్షణలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీకళ్యాణవెంకటేశ్వరస్వామి కళ్యాణమహోత్సవ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. శ్రీవిష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనము, కంకణధారన, అగ్ని ప్రతిష్ట, అఖండ దీపారాధన, వజ్రవైడూర్యములతో, అనేకరకాల పూలమాలలతో స్వామివారి, అమ్మవార్ల అలంకరణ, పట్టువస్త్రముల సమర్పణ, జిలకర బెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాలు, మంగళహారతులు, వివిధ కళ్యాణ కార్యక్రమాలు వేదమంత్రోచ్చరణతో, వేలాధిమంది భక్తుల గోవిందనామ స్మరణ నడుమ మేళతాలములతో, మంగళవాయిద్యములతో, కళ్యాణమహోత్సవము అంగరంగవైభ వంగా జరిగింది. నిత్యపూర్ణాహుతి, దైవనామస్మరణా భజనలు, వాహనసేవలు, భజనకోలాటములు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులందరిని ఆకట్టుకున్నాయి. సుమారు 15 వేలమంది భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమము అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాలలో రామానుజదాసులు డాక్టర్ జూపల్లి రామేశ్వరరావు, శ్రీకుమారి, వినోదరావు, భార్గవి, రంజిత్రావు, రాజిత, రాముూరావు, మేఘన, శ్యామూరావు, ఐశ్వర్య, మునగాల రామమోహన్రావు, అరుణ, జూపల్లి జగపతిరావు, యరబెల్లి మురళీధర్రావు పటేల్, కాచవరపు బాబు రావు, నిర్మల, సుధాకర్రావు, విజయలక్ష్మి, నందనమూడి శ్రీనివాసరావు, అనురాధ, శ్రీరామ్, గుండా లక్ష్మినారాయణ, సాంబశివరావు, చంద్రశేఖర్ పాండే, నల్లాన్ చక్రవర్తుల వెంకటప్రసాదాచార్యులు, చెట్లూరి వాసుదేవా చార్యులు, బట్టర్ శేషు, ముడుంబై వెంకట క్రిష్ణమాచార్యులు, రంగనాధాచార్యులు, మధుసూధనాచార్యులు, కల్వకుంట్ల వరప్రసాదా చార్యులు, రంగరాజ భట్టర్ స్వామి, శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామివారి శిష్యబృంధం, షంశాబాద్ వేదపాఠశాల విద్యార్థులు, పరిశ్రమ అన్నివిభాగాల అధికారులు, భారీసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

**హుజూర్ నగర్ టౌన్, మార్చి 12, ప్రభాత వార్త :**

మహిళలు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో రాణించాలని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బొల్లు రాంబాబు అన్నారు. గురువారం హుజూర్ నగర్ ప్రభుత్వ పెన్షనర్ల కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళా పెన్షనర్ ఎస్ రాధా దుర్గా అధ్యక్షత వహించగా ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మహిళలకు మరింతగా గౌరవం పెరగాలన్నారు. మహిళల పట్ల అక్కడక్కడ కొనసాగుతున్న వివక్షతను రూపుమాపి వారి అభ్యున్నతికి పాటు పడాలన్నారు . మహిళలతోనే నేడు కుటుంబాలకు గొప్ప, మంచి పేరు వస్తుందన్నారు.మహిళ సాధికారత సాధించటానికి పురుషులు సహకరించా లని కోరారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించినప్పుడే అన్ని వివక్షతలు దూరమవుతాయని అన్నారు.. సమావేశంలో జిల్లా పెన్షనర్ల సంఘం ఉపాధ్యక్షులు విద్యాసాగర్ రావు, స్థానిక మహిళా పెన్షనర్లు ఎస్ లలిత, టి విజయ మేరీ, చెన్న సౌభాగ్య, ఏ సుధారాణి, బి రామలక్ష్మి, థెరీసా, శ్రీలత, అంకతి అప్పయ్య, రఘునాథ్, ధర్మరి వెంకటేశ్వర్లు, పారుపల్లి చంద్రశేఖర్, ఎం ఎస్ ఎన్ రాజు ,చెన్నా సైదులు, కే లక్ష్మయ్య, ఏ చంద్రయ్య, ఎంబి దేవదానం పాల్గొనగా అంతకు ముందు మహిళా పెన్షనర్లు జ్యోతి ప్రజ్వ లన చేసి కేక్ కట్ చేశారు. నకార విగ్రహా నికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా పలువురు రిటైర్డ్ మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు సమావేశ నిర్వ హణ మొత్తం మహిళలకే అప్పగించటం పట్ల వారు సంతృప్తి వ్యక్తం



## గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలివ్వాలి

**నేరేడుచర్ల మార్చి 12 ప్రభాతవార్త**

ఖమ్మంలోని భూధాన్ బాధితులకు, హైదరాబాద్, వరంగల్, రంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం పట్టాలిచ్చి వారిని ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ధూళిపాళ ధనుంజయనాయుడు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం స్థానిక కార్యాలయంలో సీపీఐ ముఖ్యనాయకులతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికలు ముగిసిన వెంటనే రైతు బంధు వేస్తామని సాక్షాత్తు సీఎం రేవంత్ రెడ్డి బహిరంగంగా ప్రకటించి నెల రోజులు కావాస్తున్న నేటికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ప్రారంభమైందన్నారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చడం సరికాదన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవన్నారు. సమావేశంలో మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమర్రాజు వెంకట్, ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షుడు భరత్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు



## మలిదశ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

**నేరేడుచర్లమార్చి 12 ప్రభాతవార్త**

తెలంగాణ మలిదశ ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని మలిదశ ఉద్యమకారుడు గోపగాని మారయ్య గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం అనేక ఉధ్యమాలల్లో చాలా మంది పోరాంటం చేశామని అన్నారు. అలాంటి వారిని ప్రభుత్వాలు గుర్తించడం లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు నిజమైన మలిదశ తెలంగాణ ఉధ్యమకారులను గుర్తించి వారిని ఆదుకోవాలని కోరారు.



## ముగిసిన ఇంటర్ ప్రధమ సంవత్సరం పరీక్షలు...

### ఉత్సాహంగా గృహాలకు తరలి వెళ్లిన విద్యార్థులు

**నేరేడుచర్ల మార్చి 12 ప్రభాతవార్త**

నేరేడుచర్ల పట్టణంలోని ప్రభుత్వ కళాశాల, స్పంధన జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలలో గత నెల 25న ప్రారంభమైన ఇంటర్ ప్రధమ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా ముగిసాయి. ఈ సందర్భంగా విద్యార్థులు కేరింతలు కొడుతూ సంబరాలు చేసుకున్నారు. తమ స్నేహితులతో కలిసి సెల్ఫీలు తీసుకున్నారు. అనంతరం ఎవరి గ్రామాలకు వారు తరలివెళ్లారు.






## భారతదేశం అన్నిరంగాలలో అభివృద్ధి చెందాలిపాడి

### పంటలు పుష్కలంగా లభించాలి

### ఇండియా ప్రపంచంలో అగ్రస్థాయిలో ఉండాలి

### శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి మంగళశాసనములు

**మేళ్ళచెరువు మార్చి 12 ప్రభాతవార్త:**

స్థానిక మైహోమ్ ఇండస్ట్రీయస్ మహా సిమెంట్ శ్రీనగర్ కాలనీలో వేంచేసియున్న శ్రీదేవిభూదేవి సమేత శ్రీకళ్యాణవేంకటేశ్వరస్వామి ఆలయములో గురువారం 28వ కళ్యాణబ్రహ్మోత్సవముల కార్యక్రమా లలో కళ్యాణవేధికపై శ్రీపరాభవ నామ సంవత్సర నూతన పంచాంగమును శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామివారి చేతులమీదుగా హర్షధ్వానాల మధ్య, భక్తుల గోవిందనామాల స్మరణ మధ్య ఆవిష్కరించారు. ఈ సంధర్భముగా భక్తులనుద్దేశించి శ్రీ చిన్నజీయర్ స్వామివారు మాట్లాడుతూ పవిత్రమైన శ్రీపరాభవ నామ నూతన



సంవత్సరములో మన భారతదేశం అన్ని రంగాలలో, అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలని, భారత ప్రజలంతా సుఖసంతోషములతో, మంచి ఆరోగ్యములతో జీవించాలని, పశుసంపద పెరగాలని, సకాలములో సక్రమంగా వర్షాలు కురవాలని, పాడిపంటలు పుష్కలంగా లభించాలని, మన ఇండియా ప్రపంచంలోనే అగ్రస్థాయిలో ఉండాలని, ఆశీర్వదిస్తూ మంగళ శాసనములు చేసారు. దేశప్రజలంతా, ప్రతినిత్యం, భక్తిశ్రద్ధలతో, దేవాలయములను దర్శించాలని, ప్రతిదేవాలయములో ప్రతినిత్యం అర్చ నలు, అభిషేకములతోపాటు దైవనామాస్మరణా భజనా కార్యక్రమాలు భక్తిశ్ర ద్ధలతో నిర్వహించాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో భక్తులు, దాతల సహకారంతో ప్రతిదేవాలయం అభివృద్ధి చెందాలని అన్నారు. ప్రతికుటుంబం భక్తిగా, శ్రద్ధగా గోవులను పెంచాలని, మొక్కలు నాటాలని, చెట్లను పెంచాలని, పర్యావరణమును కాపాడుకునేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. మైహోమ్ పరిశ్రమతోపాటు మేళ్ళచెర్వు గ్రామము దినదినాభివృద్ధి చెందాలని, ఆశీర్వదించి మంగళాశాసనములు చేసారు. మానవుని జీవితంలో కష్టాలు ఉంటాయని, కష్టాలు వచ్చినప్పుడు ఓర్పుతో, ధైర్యముతో, భగవంతుని తోడుతో తట్టుకోవాలని అన్నారు. సుఖాలు వచ్చినప్పుడు అహంకారము ఉండకూడదని, భగవంతుని సుఖాలలో తోడుగా ఉంచుకోవాలని అన్నారు. ఉత్తర, ద్రౌపది, కుంతిదేవీల గురించి శ్రీకృష్ణభగవానుని గురించి సీతారాములవారి గురించి, మహాభారతము గురించి వివరించారు. ఈ కార్యక్రమములో శ్రీశ్రీశ్రీ త్రిదండి ఆహోబిల రామానుజ జీయర్స్వామి, శ్రీశ్రీశ్రీ త్రిదండి దేవనాధ జీయర్ స్వామి, రామానుజదాసులు జూపల్లి రామేశ్వరరావు, శ్రీకుమారి, మునగాల రామమోహనరావు, అరుణతో పాటు పరిశ్రమ యజమాన్య కుటుంబ సభ్యులు, పరిశ్రమ అన్నివిభాగాల అధికారులు, పెద్దసంఖ్యలో వేధపండితులు, భారీసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# పేదల ప్రజల ఇండ్ల జోలికొస్తే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బొంద పెడతాం.

..ఆలేరు, మార్చి 12,ప్రభాతవార్త :



తెలంగాణ రాష్ట్రంలోని పేద ప్రజల ఇండ్ల జోలికి వస్తే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బొంద పెడతామని బిజెపి ఆలేరు మండల, పట్టణ అధ్యక్షుడు పూజారి కుమార స్వామి నంద గంగేష్ లు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం ఆలేరు పట్టణంలోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆచరణ సాధ్యం కానీ హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో నిరంకుశ పాలన చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాలుగా పేద ప్రజలనే టార్గెట్ చేస్తూ మూసి సుందరి కరణ, హైడ్రా అంటూ పేద ప్రజల ఇండ్లను కూల్చి వారిని రోడ్డుపై పడేశారు. ఇప్పుడు నిషేధిత జాబితా( పి ఓ టి )అంటూ పేద ప్రజల ఇండ్లను కూల్చే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికల ముందు ఎన్నో దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక పేద ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య నిషేధిత ఇండ్ల జాబితా గురించి ప్రజలకు తెలపకుండా బిజెపి బి ఆర్ ఎస్ చీకటి ఒప్పందాలంటూ అసత్య ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇందిరమ్మ ఇల్లు కడుతున్న లబ్ధిదారులకు సరిగా బిల్లులు రాక మధ్యలోనే నిలిపివేస్తున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల ఇండ్ల జోలికి వస్తే బిజెపి పార్టీ పేద ప్రజలకు అండగా ఉండి ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఇండ్ల నిషేధిత జాబితా విడుదల చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం ఆ విషయాన్ని మభ్యపెడుతూ స్థానిక ఎమ్మెల్యే బీజేపీపై బూరద చెల్లె ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఇలాంటి ఆరోపణ చేస్తే భయపడేది లేదని ఇండ్ల జోలికి వస్తే గ్రామాల్లో ఎమ్మెల్యేని బిజెపి నాయకులు ప్రజలతో కలిసి అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి చిరిగే శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ నెంబర్ వడ్డేమాన్ నరేందర్ ప్రధాన కార్యదర్శి సుంకరి సృజన్ జిల్లా నాయకులు తునికి దశరథ మండల కార్యదర్శి బైరి మహేందర్ వడ్డేపల్లి కిషన్ తదితరులున్నారు.

# పేదల సంక్షేమం కోసం పనిచేస్తుంది కాంగ్రెస్ పార్టీ

### సూది మానంత భూమి కూడా ఎవరు గుంజుకోరు : ఎమ్మెల్యే బీర్ల

ఆలేరు, మార్చి 12 (ప్రభాతవార్త) :



పేదల సంక్షేమం కోసమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పనిచేస్తుందని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తెలిపారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలోని ఇందిరాగాంధీ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజిస్ట్రేషన్ యాక్ట్ 1908 ప్రకారం యాక్ట్-22 కింద నిషేధిత జాబితాలో చేర్చబడిన ప్రభుత్వ భూములు, ఎండోమెంట్ భూములు, సీలింగ్ భూములు, దేవస్థానాలకు సంబంధించిన భూములను రిజిస్ట్రేషన్ చేయవద్దని ప్రభుత్వం నిషేధం విధించిందన్నారు. కొందరు దుర్మార్గులు ప్రభుత్వ భూములు, సీలింగ్ భూములను అక్రమంగా ఆక్రమించి బై నెంబర్లు వేసి రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని, అలాంటి అక్రమాలను అరికట్టేందుకే యాక్ట్-22 ప్రకారం నిషేధిత జాబితాలో చేర్చడం జరిగిందన్నారు. గతంలో ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లు గానీ, ప్రభుత్వ భూములపై నిర్మించుకున్న ఇండ్లు గానీ ఏ ఒక్క గుంట కూడా ప్రభుత్వం తీసుకునే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన ప్లాట్లు లేదా ఇండ్లలో ఒక గజం కూడా ప్రభుత్వం తీసుకోదని హామీ ఇచ్చారు. త్వరలోనే ఆలేరు పట్టణంలో ఇల్లు లేని నిరుపేదలకు 250 ఇళ్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. రాజకీయంగా ఎదుర్కోలేక బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పేద ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ మీ ఇళ్లు గుంజుకుంటారని అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అలాంటి దుష్ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం అని, పేదలకు కూడు, గుడ్డ, గూడు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎదుగుదలను తట్టుకోలేక బీఆర్ఎస్, బీజేపీ నాయకులు చీకటి ఒప్పందాలు చేసుకుని కాంగ్రెస్ పార్టీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఎవరైనా తప్పుడు ప్రచారాలు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు నీలం పద్మ వెంకటస్వామి, టౌన్ అధ్యక్షుడు ఎజాస్, మున్సిపల్ చైర్మన్ బాలమణి భాస్కర్, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వరరాజు, మాజీ ఎంపీపీ శ్రీశైలం, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, ఎండి సలీం, ప్రకాష్ రెడ్డి, మధు, అజయ్, రాజశేఖర్, విక్రమ్, సిద్ధులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక డంప్ స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు

ఆలేరు, మార్చి 12, ప్రభాతవార్త :



ఆలేరు మండలంలోని సాయిగూడెం గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను గురువారం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా వాగు నుంచి ఇసుకను తరలించి నిల్వ చేసినట్లు సమాచారం అందడంతో అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అభివృద్ధి పనుల పేరుతో సాయిగూడెం వాగు నుంచి సుమారు 50 ట్రాక్టర్ల ఇసుకను అక్రమంగా తవ్వి ఒకచోట డంప్ చేసినట్లు అధికారులు గుర్తించారు. దీనిపై స్పందించిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పూర్ణచందర్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది, పోలీసుల సహకారంతో ఆ ఇసుక డంప్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇసుక తరలింపుకు ఎలాంటి అధికారిక అనుమతులు లేకపోవడంతో ఆ డంప్‌ను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. అక్రమంగా వాగుల నుంచి ఇసుకను తవ్వడం పర్యావరణానికి హానికరమని, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతి లేకుండా ఇసుక తవ్వకం లేదా నిల్వ జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే రెవెన్యూ అధికారులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. అక్రమ ఇసుక రవాణా, నిల్వలను అరికట్టేందుకు నిరంతరం తనిఖీలు కొనసాగిస్తామని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమం లో జూనియర్ అసిస్టెంట్ స్వామి, జిపిఓ శ్రీనివాస్, కానిస్టేబుల్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు తోఫా అందజేత



రాజాపేట మార్చి 12 ప్రభాతవార్త

రాజపేట మండల కేంద్రంలో, చల్లూరు గ్రామాల్లో ప్రభుత్వ విప్ఆలేరు శాసనసభ్యులు బిర్లా ఐలయ్య సతీమణి బీర్ల అనిత ఫౌండేషన్ చైర్మన్ సహకారంతో ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా (కానుక ) గురువారం సాయంత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు మహేందర్ గౌడ్ రాజపేట ఉప సర్పంచ్ కేదార్ గౌడ్ టౌన్ అధ్యక్షుడు ఐరన్ నవీన్ కుమార్ డాక్టర్ చింతల రవి గొల్ల నస్వామి చల్లూరు సర్పంచ్ రూప బాల్ నర్సయ్య ఉపసర్పంచ్ బొంత సుధాకర్ గ్రామ శాఖ అధ్యక్షుడు నవీన్ వార్డ్ మెంబర్లు నాయకులు ఇంజనరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి నిత్యవసర సరుకుల పంపిణీ

తుర్కపల్లి, మార్చి 12 ప్రభాతవార్త

తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఏషబోయిన అంజమ్మ ఇటీవల మరణించడంతో ఆమె కుటుంబానికి శ్రీ పలుగుల మైసమ్మ సిఐటియు పెయింటర్ యూనియన్ తరపున 50 కిలోల బియ్యం, గణపతి పెయింటింగ్ షాప్ వినీత్ తరపున 5 కేజీల మంచి నూనెను అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు మేడిపల్లి రాజు, ఉపాధ్యక్షుడు సంతోష్ కుమార్ గౌడ్ జనరల్ సెక్రెటరీ శ్రీశైలం, రాజు, సత్యనారాయణ ,కుటుంబ సభ్యులు పాల్గొన్నారు




## గవర్నర్ శివప్రసాద్ శుక్లాను శాలువాతో సత్కరించిన బిజెపి జిల్లా అధ్యక్షుడు అశోక్

యాదగిరిగుట్ట మార్చి 12 (ప్రభాత వార్త ):



యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి గురువారం వచ్చిన రాష్ట్ర గవర్నర్ శివప్రసాద్ శుక్లను యాదాద్రి భువనగిరి జిల్లా బిజెపి అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ శాలువా కప్పి సత్కరించి స్వాగతం పలికారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిషన్ మోర్చా కౌన్సిల్ మెంబర్ గుంటుపల్లి సత్యనారాయణ, జిల్లా కౌన్సిల్ మెంబర్ చంద్రమోళి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గుండ్లపల్లి వద్ద ఆర్టీసీ బస్సులు ఆపాలి

యాదగిరిగుట్ట మార్చ్ 12 (ప్రభాతవార్త ):




యాదగిరిగుట్ట మండలం లోని గుండ్లపల్లి స్టేజి వద్ద భువనగిరి నుంచి వెళ్లే ప్రతి బస్సు ఆపాలని కోరుతూ యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో ముందు సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అలాగే ఆర్టీసీ డిపో మేనేజర్ కు మెమోరాండం అందించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ మాట్లాడుతూ గుండ్లపల్లి స్టేజి వద్ద బస్సులు ఆపకపోవడంతో అక్కడి ప్రజలు వృద్ధులు, పిల్లలు బస్టాండ్ వద్దకు నడవడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు వీరబోయిన మహేందర్, మాజీ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య, ఎనిమిదో వాడు శాఖ కార్యదర్శి ముకేర్ల పెంటయ్య రామచందర్ వెంకటేష్ యాదవ్ కోపగాని రాజు తదితరులు పాల్గొన్నారు.

## స్థల దాతకు నివాళి

రాజాపేట, మార్చి 12 ప్రభాతవార్త

రాజపేట మండలం రఘునాధపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్మాణానికి 1990 సంవత్సరంలో రెండున్నర ఎకరాల భూమితో పాటు 1,20,000 రూపాయలను నగదును ఇచ్చిన గొప్ప మనసున్న మహనీయుడు దాతలు సంగిశెట్టి శ్నైబయ్య సతీమణి సంగిశెట్టి సరస్వతమ్మ మృతి చెందారు. ఆమె మృతి పట్ల పాఠశాలలో గురువారం సంతాపం ప్రకటించారు. ఆమె చిత్రపటానికి పూలమాలవేసి వారికి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించి రెండు నిమిషాలు మోనం పాటించారు. ప్రధానోపాధ్యాయులు కే. మనోజ్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆ కుటుంబానికి సానుభూతి ప్రగాడ తెలిపారు. ఉపాధ్యాయ బృందం పాఠశాల సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు, గ్రామ పెద్దలు గ్రామ మాజీ సర్పంచ్ గాడి పెల్లి శ్రవణ్ కుమార్ మాజీ ఎంపిటిసి బుడిగే రేణుక పెంటయ్య గౌడ్ బింగి రమేష్, సామల భాస్కర్, బూరేల శ్రీనివాస్ లు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

## పరీక్ష ప్యాడ్లు పంపిణీ

రాజాపేట మార్చి 12 ప్రభాతవార్త

దానధర్మా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాజపేట మండలంలోని నెమిల, పారుపల్లి, బొందుగుల, కుర్రారం, సింగారం గ్రామాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ గురువారం జరిగింది. మేకల రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలలో మంచి ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులకి మంచి పేరు తేవాలని భవిష్యత్తులో ఉన్నతమైన శిఖరాలను అధిరోహించాలని సంస్కారవంతమైనజీవితం తో ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మేకల రమేష్ పుట్ట వీరయ్య షాపురం శ్రీశైలం ముత్యం రాజు, బర్మ శ్రీశైలం బుడిగా కరుణాకర్, గౌర మధు, మార్గశివకుమార్ ఇంద్రపాల రవి మాయకోటి రాజు పిడిశెట్టి కనకయ్య బూరుగు వెంకట్ తదితరులు పాల్గొన్నారు

## రసాభాసగా మారిన అవగాహన సమావేశం

**యాదాద్రి భువనగిరి బ్యూరో ప్రభాతవార్త**

: జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజా పాలన ,ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం అవగాహన సమావేశం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. నిధుల కేటాయింపులో వివక్షత చూపుతున్నారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ సర్పంచుల ఫోరం ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని నేరుగా నిలదీయడంతో సమావేశం రసాభాసగా మారింది.భువనగిరిలో జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్న సమయంలో బీఆర్ఎస్‌కు చెందిన పలువురు సర్పంచులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అభివృద్ధి పనుల మంజూరులో అధికార పార్టీ అయిన కాంగ్రెస్‌కు చెందిన సర్పంచులకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తూ ఇతర పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులను పక్కన పెడుతున్నారని ఆరోపించారు.సర్పంచిగా పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టంగా కనిపిస్తుందని వారు విమర్శించారు. ఇప్పటి వరకు అధికార పార్టీకి చెందిన వారికే పనులు మంజూరు చేస్తూ మిగతా గ్రామాలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.ఈ సందర్భంగా సమావేశ హాలులోనే ఎమ్మెల్యేను ప్రశ్నిస్తూ సర్పంచులు ఆందోళనకు దిగారు. దీంతో హాలులో కొంతసేపు వాగ్వాదం నెలకొని పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. బీఆర్ఎస్ సర్పంచుల ఫోరం అధ్యక్షురాలు పడమటి మమతారెడ్డి, నాయకులు కొమతం శ్రీను, మద్దెల మంజుల, బుడిగి లింగస్వామి, ఆవుల నరసింహ, దాసరి గుడి దాసిరెడ్డి,



రాపోలు గోపి తదితరులు ఎమ్మెల్యేపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.ఉద్రిక్తతలు పెరగడంతో సమావేశం మధ్యలోనే ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ పరిణామంతో సమావేశం మరింత గందరగోళంగా మారింది.అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ ఆరోపణలను ఖండించారు. గ్రామాభివృద్ధి విషయంలో పార్టీలకతీతంగా పని చేస్తున్నామని ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామ పంచాయతీలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం అవసరాలను గుర్తించి తక్షణమే పనులు చేపడుతున్నామని చెప్పారు.రాబోయే ఐదు సంవత్సరాలకు ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టి గ్రామాల్లో కనీస మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే వివరించారు. ఈ ఘటనతో భువనగిరి నియోజకవర్గ రాజకీయాల్లో మరోసారి ఉద్రిక్తతలు పెరిగాయి. సర్పంచుల ఆరోపణలు, ఎమ్మెల్యే స్పందనతో ఈ వ్యవహారం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## హోటళ్లపై పౌరసరఫరాల దాడులు

**కమర్షియల్‌కు బదులుగా డొమెస్టిక్ సిలిండర్లు వాడుతున్న దందా బట్టబయలు**

**భువనగిరి , రామన్నపేటల్లో కలిపి 49 సిలిండర్లు సీజ్**

యాదాద్రి భువనగిరి బ్యూరో ప్రభాతవార్త:

జిల్లాలో హోటళ్లు, వ్యాపార కేంద్రాల్లో డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను అక్రమంగా వినియోగిస్తున్న వారిపై పౌరసరఫరాల శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో మొత్తం 49 డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీనపర్చుకున్నారు.గురువారం భువనగిరి పట్టణంలో పౌరసరఫరాల ఉప తహశీల్దార్ నర్సింగ్ రావు ఆధ్వర్యంలో సిబ్బంది పలు హోటళ్లు, వ్యాపార కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమర్షియల్ సిలిండర్లకు బదులుగా డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వాడుతున్నట్లు గుర్తించి 25 డొమెస్టిక్ సిలిండర్లను సీజ్ చేశారు.అదేవిధంగా రామన్నపేటలో పౌరసరఫరాల ఉప తహశీల్దార్ బాలామణి , హైదరాబాద్ విజిలెన్స్ అధికారులు కలిసి వ్యాపార కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 24 డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీనపర్చుకున్నారు.ఈ రెండు ప్రాంతాల్లో కలిపి మొత్తం 49 డొమెస్టిక్



గ్యాస్ సిలిండర్లు సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు.అధికారులు వ్యాపారులకు హెచ్చరిక జారీ చేస్తూ,వ్యాపార సంస్థలు, హోటళ్లు , ఇతర కమర్షియల్ కేంద్రాల్లో కేవలం కమర్షియల్ గ్యాస్ సిలిండర్లనే వినియోగించాలి, డొమెస్టిక్ సిలిండర్లను వాడటం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. ఉల్లంఘనలు కొనసాగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ తనిఖీల్లో పౌరసరఫరాల శాఖ అధికారులు, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## కెవి సత్యనారాయణ సేవలు చిరస్మరణీయం

**హాలియా, ప్రభాతవార్త, మార్చి 12:**



మాజీ ఏపీపీఎస్సీ సభ్యులు మాజీ సిఎల్పీ నేత కుందూరు జానారెడ్డి రాజకీయ గురువు కే.వి సత్యనారాయణ సేవలు ఉమ్మడి రాష్ట్రానికి, ఈ ప్రాంతానికి చిరస్మరణీయమని టి ఆర్ టి యు టీఎస్ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు మంద సైదులు రావు గౌతమ్, అనుముల మాజీ సర్పంచ్ జూపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం కే వి సత్యనారాయణ ఏడవ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ రాజకీయాల్లో అపర చాణక్యుడిగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంలో రాష్ట్ర కార్యదర్శిగా పని చేసి ఎన్టీఆర్ కు సలహాలు అందిస్తూ పాలన లో అనేక సంస్కరణలు చేసిన మహనీయుడని వారి సేవలను కొనియాడారు. నివాళులు అర్పించిన వారిలో ఎడవల్లి సోమశేఖర్, చెరుకూరి సతీష్, అన్నపాక శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

## విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ

**పెద్దవూర మార్చి 12 ప్రభాత వార్త**



మండల కేంద్రంలోని వండర్ కిడ్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ప్రజా ప్రతినిధులు గా, ఉపాధ్యాయులు గా అద్భుతంగా పోషించారు. కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో విధులు, బాధ్యతల పట్ల అవగాహన పెరిగి, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకోవాలనే పట్టుదల పెరుగుతుందని,మంచి పౌరులుగా తీర్చిదిద్దబడుతారని పాఠశాల కరస్పాండెంట్ షేక్ మోలాలి తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రిన్సిపాల్ అశోక్, ఉపాధ్యాయులు లక్ష్మణ్, రాజేశ్వరి, శిరీష ముస్కాన్ తేజ సుభాషిని, పావని, రమ తదితరులు పాల్గొన్నారు

## పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

**హాలియా, ప్రభాతవార్త, మార్చి 12:**

హాలియా పట్టణంలో శనివారం నుంచి పదవ తరగతి పరీక్షలు జరగనున్నట్లు అందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అనుముల మండల విద్యాధికారి ముచ్చర్ల శ్రీనివాస్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. హాలియా కేంద్రంలో నాలుగు పరీక్ష కేంద్రాలు ఉన్నట్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కృష్ణవేణి హై స్కూల్, సెంట్ జాన్స్ కేరళ మోడల్ స్కూల్, నిర్మల స్కూల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలలో 808 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి పరీక్షా కేంద్రానికి చీఫ్ సూపరిండెంట్ డిపార్ట్మెంట్ ఆఫీసర్ ఉంటారనీ, పరీక్షలకు 40 మంది ఇన్విజిలేటర్లు, క్లర్కులతో కలిపి 44 మంది పరీక్షల నిర్వహణలో పాల్గొననున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, విద్యార్థులు పరీక్షా సమయం కంటే ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు హాల్టికెట్ వెంట తీసుకెళ్లాలని, ప్రశాంతంగా పరీక్షలు రాసుకోవాలని కోరారు. పరీక్షా కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీలు పదవ తరగతి పరీక్షలను మార్చి 14వ తేదీన తెలుగు పరీక్ష, 18వ తేదీన హిందీ, 23వ తేదీన ఆంగ్లము, 28వ తేదీన గణితము, ఏప్రిల్ 2, 7 తేదీన సైన్స్ పరీక్షలు, 13 తేదీన సాంఘిక శాస్త్రము ఉంటుందని తెలిపారు.





## క్రీడా పాఠశాల ప్రవేశాల కోసం మండల స్థాయి క్రీడా పోటీలు

**అడ్డగూడూరు, మార్చి 12 (ప్రభాత వార్త):**

హకింపేట్‌క్రీడా పాఠశాలలో నాల్గవ తరగతి ప్రవేశాల కోసం మండల స్థాయి క్రీడా పోటీలు ఈ నెల 17వ తేదీన నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి నర్రా సభిత గురువారం తెలిపారు.ఈ పోటీలకు 01092017 నుంచి 31082018 మధ్య జన్మించిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. పోటీల్లో భాగంగా 30 మీటర్ల ఫ్లైయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800 మీటర్ల పరుగుపందెం, 10 మీటర్ల షటిల్ రన్, మెడిసిన్ బాల్ పుట్, వెర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్ వంటి క్రీడాంశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.పోటీలు ఈ నెల 17వ తేదీ ఉదయం 9:30 గంటలకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించబడతాయని ఆమె పేర్కొన్నారు.

## వివాహానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే బిక్షమయ్య గౌడ్.

ఆత్మకూరు ఎం మార్చి 12 ప్రభాతవార్త.



ఆత్మకూర్ ఎం మండల కేంద్రంలో కొమ్మరాజుల శ్రీను కూతురు వివాహానికి గురువారం నాడు మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్ వివాహంలో పాల్గొని అక్షి ంతలు వేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బీసు చందర్ గౌడ్ జిల్లా నాయకులు కోరేబిక్షపతి యాస ఇంద్రారెడ్డి లోడి మధు, లోడి శ్రీను లోడి సోములు తదితరులు పాల్గొన్నారు

## కేసీఆర్ కలిసిన బొక్క జైపాల్ రెడ్డి

**బీబీనగర్, మార్చి 12 ప్రభాతవార్త:**



మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఎర్రబెల్లి ఫామ్ హౌస్ లో గురువారం బీబీనగర్ మండల మాజీ రైతుబంధు సమితి కో ఆర్డినేటర్ బొక్క జైపాల్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు కలిశారు. అంతకు ముందు టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావును మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ బలోపేతంపై చర్చించారు. తిరిగి అధికారంలోకి బీఆర్ఎస్ పార్టీ వస్తుందని కెసిఆర్ ధీమా వ్యక్తం చేసినట్లు తెలిపారు.

## 50వేల మేకలను దొంగలించిన దొంగలు

**మోత్కూర్ రూరల్ మార్చి 12 ప్రభాతవార్త**

మోత్కూర్ మండలం మున్సిపాలిటీ పరిధి కొండగడప గ్రామంలో ఐదు మేకలను గుర్తు తెలియని దొంగలు దొంగిలించినట్లు రైతుదొండ లింగమల్లు మోత్కూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. మోత్కూర్ సిఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం దొండ లింగమల్లు రోజువారిగా మేకలు బుధవారం సాయంత్రం దొడ్డిలో తోలి నిద్రించాడని గురువారం తెల్లవారుజామున చూసేసరికి ఐదు మేకలు గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్లు దొండ లింగమలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దొంగలను త్వరలోనే పట్టుకుంటామని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

## ఇరువురు కాంగ్రెస్ నాయకుల సస్పెండ్

*నేరేడుచర్ల, మార్చి 12, ప్రభాతవార్త*

8 నేరేడుచర్ల మున్సిపాలిటీలో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 7వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి వ్యతిరేకంగా పని చేసిన రామాపురం మాజీ సర్పంచ్ జంగిలి వెంకటేశ్వర్లు, కొదమగుండ్ల నాగరాజును పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు నూకల సందీప్ రెడ్డి గురువారం తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. పార్టీ కార్యకలాపాలకు వ్యతిరేకంగా పాల్పడితే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం

*పాలకీడు మార్చి 12, ప్రభాతవార్త*

పాలకీడు మండలంలోని ఎల్లాపురం గ్రామ పంచాయతీ ఆవరణలో రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేసిన సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ లీటరసి (మనీ వైస్) ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పించడమే లక్ష ్యంగా ఈ కార్యక్రమం సాగింది. ఈ



సందర్భంగా ధన్ ఫౌండేషన్ దామచర్ల కోఆర్డినేటర్ శివ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంకింగ్ సేవలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పొదుపు మాత్రం ప్రతి కుటుంబం తన ఆదాయాన్ని కొంత భాగాన్ని భవిష్యత్తు అవసరాల కోసం బ్యాంకింగ్ లో పొదుపు చేసుకోవాలని కోరారు. బీమా రక్షణ ఆకస్మికంగా ప్రమాదాలు జరిగినప్పుడు కుటుంబానికి అండగా ఉండేందుకు ఇన్సూరెన్స్ పాలసీలు తప్పనిసరి అని పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్లు ప్రస్తుతం పెరిగిపోతున్న తధ్యంలో స్కాంలు పట్ల ప్రజలకు అవగాహన ఉండాలని గుర్తు తెలియని వ్యక్తులకు ఓటీపీలు వ్యక్తిగత వివరాలు చెప్పకూడదని హెచ్చరించారు. ఇట్టి కార్యక్రమంలో పాలకీడు మండల అసోసియేట్ సునీత , ఎల్లాపురం గ్రామ ఉపసర్పంచ్ షేక్ అజీమ్ నాయ కులు పెరుమాళ్ళ రమేష్ వార్డ్ నే ్బర్ జిన్నా రెడ్డి వెంకట్ రెడ్డి షేక్ అభిబ్ వీరబాబు సైదులు వినయ్ సలాం శ్రీనాథ్ గ్రామ పెద్దలు నాయకులు గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## స్పీకర్ నిర్ణయం ఫిరాయింపులను ప్రోత్సహించేలా ఉంది

### మాజీ జెడ్పిటిసి కొప్పుల సైదిరెడ్డి

*హుజూర్ నగర్ రూరల్, మార్చి 12,ప్రభాతవార్త*

తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ బిఆర్ఎస్ పార్టీ బీఫామ్ పై గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన 10 మంది ఎమ్మెల్యేల పై దాఖలైన అనర్హత పిటిషన్లను విచారించి పార్టీ మారారు అనడానికి ఆధారాలు లేవని వారిపై అనర్హత వేటు వేయకపోవడం పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టానికి విఘాతం కలిగించడమే గాక ఫిరాయింపులను ప్రోత్సహించేల స్పీకర్ నిర్ణయం ఉందని మాజీ జెడ్పిటిసి కొప్పుల సైదిరెడ్డి అన్నారు.మండల



పరిధిలోని సీతార్నాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గ్రామ సర్పంచ్ అద్దంకి సైదీశ్వరరావు తో కలిసి మాట్లాడారు. బిఆర్ఎస్ బీఫామ్ పై ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేంద్ర, ఎంపీ ఎన్నికలలో కాంగ్రెస్ బి ఫాంపై ఎంపీగా పోటీ చేసిన కాంగ్రెస్ సభలు సమావేశంలో పాల్గొంటున్న కడియం శ్రీహరి లను ఇప్పటికీ బీఆర్ఎస్ పార్టీ సభ్యులేనని తేల్చి స్పీకర్ తీసుకున్న నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమన్నారు . పార్టీలకు రహితంగా స్వతంత్రంగా వ్యవహరించవలసిన సభాపతి కాంగ్రెస్ పార్టీ పెద్దల ఒత్తిడి మేరకు ప్రజా తీర్పును అపహాస్యం చేసేలా అనైతిక నిర్ణయం తీసుకున్నారని ఇటువంటి చర్యలను ప్రజలు ప్రజాస్వామిక వాదులు ఆమోదించరని అన్నారు. ఇప్పటికే 8 మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఇచ్చిన స్పీకర్ బుధవారం దానం నాగేంద్ర ,కడియం శ్రీహరి లకు క్లీన్ చిట్ ఇస్తూ వారిపై దాఖలైన పిటిషన్ను కొట్టివేయడం స్పీకర్ అప్రజా స్వామిక నిర్ణయం అన్నారు. దీనిపై న్యాయస్థానంలో పార్టీ పరంగా పోరాడుతామని పేర్కొన్నారు .ఈ సమావేశంలో ఉప సర్పంచ్ కాచవరపు వెంగళరావు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు సామల మట్టా రెడ్డి ,వీరమల్ల సుందరయ్య ,శరత్ బాబు, సాయి ,నరసింహారావు, గోదా ఏసు ,అద్దంకి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు

## అంగరంగ వైభవంగా తిరుపతమ్మ అంకమ్మ తల్లుల 16 రోజుల మహోత్సవ వేడుకలు ..

### సంప్రదాయబద్ధంగా మహిళల బోనాల ఊరేగింపు..

### అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

*చింతలపాలెం, మార్చి 12 ( ప్రభాతవార్త):*

మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ ్మ తిరుపతమ్మ తల్లి, అంకమ్మ తల్లి ఆలయంలో 16 రోజుల పండుగ భక్తి శ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. 16 రోజుల పండుగలో భాగంగా గురువారం మండలంలోని పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. సంప్రదాయబద్ధంగా అలంకరించిన బోనాలను మహిళలు తలపై మోసుకుని మేళ తాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పులు, మేళ తాళాలు, భక్తుల జయజయధ్వానాలతో మండల కేంద్రం అంతా భక్తి వాతావరణంతో కళకళలాడింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగ ణానికి భారీ సంఖ్యలో భక్తులు చేరుకుని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పండుగలో భాగంగా ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక వేడుకలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ తన్నీరు శివ, ధర్మకర్తలు తన్నీరు కొండ, భీమిశెట్టి సత్యనారాయణ, భూక్యా మోతిరాం, యరగాని వెంకటే శ్వర్లు, తోడేటి కృష్ణంరాజు, బాణావత్ రమణ నాయక్, చిత్తలూరి లాలయ్య, కారింగుల బ్రహ్మయ్య, మామిడి గోపి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## వైద్య శిబిరాలను ప్రజల సద్వినియోగం చేసుకోవాలి

*గరిడేపల్లి, మార్చి 12, ప్రభాతవార్త :*

ప్రభుత్వం ప్రజల కోసం నిర్వహించి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గరిడేపల్లి మండలం కలమలచెరువు సర్పంచ్




బచ్చలకూరి శ్రీనివాస్ కోరారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కల్మలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెగా హెల్త్ క్యాంపు ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల ద్వారా ఇలాంటి వైద్య శిబిరాలను నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. గ్రామాలలో ఇటువంటి వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా ప్రజలకు బాధితులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి మోనిక, ఏఎన్ఎం లు, ఆశా వర్కర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది, వైద్య శిబిరంలో పాల్గొన్న వివిధ స్పెషలిస్ట్ డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ్ సహకారంతోనే గ్రామాలు అభివృద్ధి

*గరిడేపల్లి,మార్చి12, ప్రభాతవార్త :*

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని మంగాపురం గ్రామ సర్పంచ్ బత్తిని అంజయ్య గౌడ్ అన్నారు.మండలంలోని మంగాపురం తండ లో ఎన్ఆర్ జీఎస్ నిధులనుండి వచ్చిన 5 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు.గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి లక్ష ్యంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పని చేస్తుందని ఆయన అన్నారు.కార్యక్రమంలో కారింగుల కృష్ణమూర్తి,మాజీ ఎంపీటీసీ బాల్ దూరి సందీప్,ఉప సర్పంచ్ ధరావత్ భాష, బూర,రేఖ, హర్జ,బత్తిని చిన్నమల్లయ్య,నాగరాజు, నరసింహారావు, రవి,పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు



# త్వరలో సీఎం చేతుల మీదుగా మోడల్ కాలనీ ప్రారంభం

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

*హుజూర్ నగర్ టౌన్,మార్చి 12:, ప్రభాతవార్త :*

హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలో రామస్వామి గుట్టవద్ద 110 ఎకరాలలో నిర్మించిన 2160 సింగిల్ బెడ్ రూమ్ మోడల్ హౌసింగ్ కాలనీని ఈ నెల లో త్వరలో తేదీ ఖరారు చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించ నున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌరసర ఫరాల శాఖామంత్రి కె నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం రామస్వామి గుట్ట వద్ద నిర్మించిన మోడల్ హౌసింగ్ కాలనీని ఆయన పరిశీలించారు. అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆదర్శ గృహ కాలనీ ప్రారంభానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు చెప్పారు. అధికారులు సిబ్బంది కార్మికులు అదనపు సమయం పనిచేసి అయినా మోడల్ కాలనీ అన్ని పనులు పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు ఈ మోడల్ కాలనీ ప్రాజెక్ట్ ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, అత్యంత పేద కుటుంబాలు, గ్రామీణ కూలీలు, రైస్ మిల్ కార్మికులు, హుజూర్నగర్ మున్సిపాలిటీ తో పాటు సమీప గ్రామాల పేద వర్గాల కోసం నిర్మించినట్లు తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా జరగాలని ఎంపిక బాధ్యత రెవెన్యూ డివిజన ల్ అధికారి ఆధ్వర్యంలోని అధి కారుల బృందానికి ఈ బాధ్యత అప్పగించినట్లు ఆయన తెలిపారు. మొదటి దశలో కేవలం 1,000 మంది లబ్ధిదారులను మాత్రమే ఖరారు చేస్తున్నామని అత్యంత అర్హులైన వారికి ప్రాధాన్యం ఇచ్చి, అనంతరం లబ్ధిదా రులను సూక్ష ్మం గా పరిశీలించి ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా ఈ ప్రక్రియ పూర్తి చేస్తామన్నా రు. సీఎం ప్రారంభించే ఈ కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ లబ్ధిదారులతో సీఎం సహపంక్తి భోజనం చేస్తారని మంత్రి చెప్పారు. ప్రారంభోత్స వా నికి సన్నాహక ఏర్పాట్లు కొనసాగు తున్నాయని చెప్పారు ఈ కార్యక్ర మం లో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ కె నరసిం హ, హౌసింగ్ పీడీ సిద్ధార్థ, ఆర్టిక ల్చర్ పిడి నాగయ్య, ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ ఛైర్మన్ దొంతగాని శ్రీనివాస్, వైస్ ఛైర్మన్ తన్నీరు మల్లికార్జున్, తహసిల్దార్ కవిత, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు





# అధిక వసూళ్లు చేస్తే ఏజెన్సీలు రద్దు



సూర్యాపేట జిల్లా కేంద్రంలో మీడియాతో మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి.

సూర్యాపేట బ్యూరో,మార్చి 12 (ప్రభాత వార్త)

గ్యాస్ సిలిండర్ల బ్లాక్ మార్కెట్ దందా కొనసాగితే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. కొరత పేరుతో వినియోగదారుల నుంచి అధిక ధరలు వసూలు చేసే గ్యాస్ ఏజెన్సీలను రద్దు చేస్తామని స్పష్టం చేశారు.గురువారం జిల్లా కేంద్రంలో మీడియాతో మాట్లాడిన ఆయన, ఎల్పీజీ గ్యాస్ కొరత నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమస్యపై రేపు చీఫ్ సెక్రటరీ ఆధ్వర్యంలో గ్యాస్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. డిమాండ్, సరఫరా పరిస్థితులపై సమగ్రంగా చర్చించి కొరత నివారణకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ రాష్ట్రంలో గ్యాస్ కొరత తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. ప్రస్తుతం డొమెస్టిక్ గ్యాస్ వినియోగంలో పెద్దగా ఇబ్బందులు లేవని, అయితే కమర్షియల్ సిలిండర్ల విషయంలో కొరత ఉన్నట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. చీఫ్ సెక్రటరీతో సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్లకు కొరత నివారణపై ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# ప్రజాపాలన 99 రోజులు గ్రామాభివృద్ధి మీ చేతుల్లోనే

సర్పంచుల,కౌన్సిలర్లకు విప్ బీర్ల ఐలయ్య స్పష్టమైన దిశా నిర్దేశం

యాదాద్రి భువనగిరి బ్యూరో ప్రభాతవార్త:



ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి పథకాలపై పూర్తి అవగాహన కలిగి అర్హులైన ప్రతి పేదవారికి వాటి ప్రయోజనాలు చేరేలా చూడాల్సిన బాధ్యత గ్రామ సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్లపై ఉందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. గ్రామాలు, పట్టణాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు ముందుండి పనిచేయాలని పిలుపునిచ్చారు.గురువారం భువనగిరి పట్టణంలోని వికన్వెన్షన్, న్యూ వివేరాలో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు మెంబర్లు, చైర్‌పర్సన్లకు ఒకరోజు అవగాహన శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమం ప్రారంభానికి ముందు రాష్ట్ర గేయం వందేమాతరం ఆలపించారు.

**99 రోజుల ప్రణాళికపై దృష్టి**

ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ మార్చి 6 నుంచి జూన్ 12 వరకు కొనసాగనున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. గత రెండు సంవత్సరాల్లో ప్రభుత్వం రైతు రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ వంటి పలు సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాలు, పట్టణాల్లో నీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

అభివృద్ధి పనులు ప్రజలు మెచ్చేలా చేయాలి..ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్) మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు ప్రజాపాలన 99 రోజుల ప్రణాళికపై పూర్తి అవగాహన పొందాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు మెచ్చేలా అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు.భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో సాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని తెలిపారు. ప్రజలకు సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని హామీ ఇచ్చారు.

**పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి..**

పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రత పాటిస్తే అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తుందని అన్నారు. ప్రజాపాలన ప్రణాళికలోని 10 ప్రధాన అంశాలపై గ్రామాలు, వార్డుల్లో సమస్యలను పరిష్కరించాలన్నారు

**నిధులను సమర్థంగా వినియోగించాలి..**

సెర్ప్ సీఈఓ, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులను సద్వినియోగం చేసి గ్రామాల్లో అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. అంగన్వాడీ భవనాలు, పచ్చదనం, శానిటేషన్ కార్యక్రమాలను బలోపేతం చేయాలని అన్నారు.

**ప్రజాప్రతినిధులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి.**

.జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులు ఈ శిక్షణ ద్వారా ప్రభుత్వ పథకాల అమలు విధానం, లబ్ధిదారుల ఎంపిక, శాఖల పనితీరు గురించి అవగాహన పొందాలని సూచించారు. .

# మోత్కూరు సబ్ ట్రెజరీ కార్యాలయంపై ఏసీబీ సోదాలు

సీనియర్ అకౌంటెంట్ ఖదీర్ అరెస్ట్

మోత్కూరు మార్చి 12 ప్రభాత వార్త:



మోత్కూరు సబ్ ట్రెజరీ కార్యాలయంలో గురువారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి, అవినీతికి పాల్పడుతున్న సీనియర్ అకౌంటెంట్ మొహమ్మద్ ఖదీర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ జగదీష్ చందర్ వెల్లడించిన వివరాల ప్రకారం, మోత్కూరు ఎంపీఓ జనార్దన్ రెడ్డి తన 38 రోజుల పెండింగ్ శాలరీ బిల్లును క్లియర్ చేయడానికి, నిందితుడు ఖదీర్ రూ.5000 లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఫోన్ పే ద్వారా ఆ నగదును నిందితుడికి బదిలీ చేశారు. అయితే, ఆర్థిక సంవత్సరం ముగింపు సమయం కావడంతో ఐటీ సమస్యలు వస్తాయని, లంచం ఇవ్వకుంటే ఫిబ్రవరి నెల జీతం కూడా ఆగిపోతుందని ఖదీర్ బాధితుడిని బెదిరించి మరో రూ.5,000 డిమాండ్ చేశారు. అవి కూడా నిందితుడి ఎకౌంట్కి ఫోన్ పే ద్వారా చెల్లించారు. విసిగిపోయిన



బాధితుడు ఏసీబీని ఆశ్రయి ంచడంతో, గురువారం కార్యాలయంలో, భువనగిరి లోని తన నివాస గృహంలో ఏకకాల ంలో సోదాలు నిర్వహించిన అధికారులు ఆధారాలను సేకరించారు. విచారణలో కేవలం ఎంపీఓ జనార్ధన్ రెడ్డి నుండే కాకుండా, గుండాలలోని మరోకరి జీతం బిల్లు కోసం కూడా ఖదీర్ రూ.5,000 వసూలు చేసినట్లు నిర్ధారణ అయిందన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ట్రెజరీ అధికారి ప్రాథమిక విచారణ జరిపి నివేదిక ఇవ్వడంతో ఏసీబీ ఈ చర్యలు చేపట్టిందని తెలిపారు. నిందితుడు ఖదీర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన అధికారులు, అతడిని అదుపులోకి తీసుకున్నారు. నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచ నున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని డీఎస్పీ జగదీష్ చందర్ ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు.

# పేదరిక నిర్మూలనే కాంగ్రెస్ లక్ష్యం

## ఎమ్మెల్యే బిఎల్ఆర్



మిర్యాలగూడ, మార్చి 12 ప్రభాతవార్త

పేదరిక నిర్మూలనే లక్ష ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన సాగిస్తున్నట్లు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మా రెడ్డి పేర్కొన్నారు. గురువారం మిర్యాలగూడ మండలం పరిధిలోని దుబ్బతండా, కుంటకింది తండా గ్రామాలలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ళతో పాటు సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ల ద్వారా పేద ప్రజల సొంత ఇంటికల నెరవేరుస్తునందుకు గర్వంగా ఉందన్నారు. సన్నబియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్ళు లాంటి అనేక పథకాలు పేద ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు రూపావత్ రాజు, మాలోతు ఇందిరా, గ్రామ కార్యదర్శులు నూకల రవీందర్ రెడ్డి, పందిరి సుచరిత, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# రబీ ధాన్యం కొనుగోళ్లకు భారీ సన్నాహాలు

**4.5 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష ్యం.. 330 కేంద్రాల**

ఏర్పాటురైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు జరపాలి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



యాదాద్రి భువనగిరి బ్యూరో ప్రభాతవార్త:

జిల్లాలో రబీ సీజన్‌లో సుమారు 4.5 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం లక్ష ్యంగా పెట్టుకున్నట్లు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, సాఫీగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.గురువారం కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్ హాల్‌లో సివిల్ సప్లై, వ్యవసాయ, సహకార, మెప్మా శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు. జిల్లాలో పెద్ద మొత్తంలో వరి ధాన్యం మార్కెట్‌కు రానున్న నేపథ్యంలో ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.కొనుగోలు కేంద్రాల్లో పూర్తి సదుపాయాలుజిల్లా వ్యాప్తంగా 330 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని సులభంగా విక్రయించేందుకు ప్రతి కేంద్రంలో అవసరమైన మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. ముఖ్యంగా గన్ని బ్యాగులు, టార్పాలిన్లు, మాయిశ్చర్ మీటర్లు, ప్యాడీ క్లీనర్లు, తూకం పరికరాలు వంటి సామగ్రి ముందుగానే సిద్ధం చేయాలని ఆదేశించారు.గన్ని బ్యాగులు, రవాణా సమస్యలు రాకుండా చర్యలుధాన్యం కొనుగోలు సమయంలో గన్ని బ్యాగుల కొరత లేదా రవాణా సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించి దిగుమతి ప్రక్రియ ఆలస్యం కాకుండా చూడాలని అధికారులకు సూచించారు కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఇప్పటికే కొనుగోలు చేసిన ఖరీఫ్ 2025-26 సీజన్‌కు సంబంధించిన సిఎంఆర్ బియ్యం డెలివరీలను త్వరితగతిన పూర్తి చేయాలని పౌరసరఫరాల శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, సివిల్ సప్లై డిఎం హరికృష్ణ, సివిల్ సప్లై అధికారి రోజారాణి, వ్యవసాయ అధికారి రమణారెడ్డి, ట్రాన్స్‌పోర్ట్ అధికారి సాయి కృష్ణ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శ్రీరామలింగేశ్వరుడి క్షేత్రం.. బ్రహ్మోత్సవాలకు సిద్ధం

**14న పెద్దరథోత్సవం, అగ్నిగుండాలు**



**చిట్యాల రూరల్, మార్చి 12, ప్రభాతవార్త :**

ప్రముఖ శైవ క్షేత్రాలలో ప్రసిద్ధి చెందిన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి (రాంపల్లి) గ్రామశివారులోని శ్రీరామలింగేశ్వం స్వామి గుట్ట భక్తుల విశ్వాసానికి నిలయంగా వెలుగొందుతోంది. త్రేతాయుగంలో శ్రీరాముడు స్వయంగా ప్రతిష్టించిన శివలింగమే ఇక్కడి శ్రీ రామలింగేశ్వర స్వామిగా ప్రసిద్ధి చెందిందని భక్తుల నమ్మకం. కోరిన కోరికలు తీర్చే దేవుడిగా పేరుగాంచిన ఈ క్షేత్రానికి ప్రతి సంవత్సరం వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. ఇక్కడ ప్రతి నెల అమావాస్య రోజున ప్రత్యేక పూజలతో పాటు భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తారు. ఈనెల 11 నుంచి నుంచి 17 వరకు వారం రోజులపాటు బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు దేవాదాయశాఖ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

## స్థల పురాణం..

పురాణాల ప్రకారం రావణాసురుడు పరమశివ భక్తుడిగా కోటిలింగాలు ప్రతిష్టించాలని సంకల్పించాడని చెబుతారు. యుద్ధంలో చివరి దశలో తన కోరికను నెరవేర్చాలని శ్రీరాముని కోరడంతో రాముడు రాంపల్లి ప్రాంతానికి వచ్చి గుట్టకింద నంది విగ్రహాన్ని, గుట్టపై గర్భగుడిలో



శివలింగాన్ని, పంచలింగాలను ప్రతిష్టించాడని స్థానికుల విశ్వాసం. అప్పటి నుంచి ఈ క్షేత్రం భక్తులకు పుణ్యస్థలంగా మారింది. కాకతీయుల కాలం నాటి ఆలయ నిర్మాణం.. గుట్టపై ఉన్న పురాతన శివాలయం రాతితో నిర్మించబడింది. ఆలయ నిర్మాణంలో కనిపించే శిల్పకళ కాకతీయుల కాలం నాటి వైభవాన్ని గుర్తు చేస్తోంది. గర్భగుడిలోని శివలింగంపై సూర్యకాంతి పడే విధంగా నిర్మాణం ఉండటం ప్రత్యేకతగా భావిస్తారు. పంచలింగాల ప్రాశస్త్యం ఈ



క్షేత్రంలో వాయు, పృథ్వి, తేజ, ఆకాశ, జల రూపాల్లో పంచలింగాలు ప్రతిష్టించబడినట్లు పురాణాలు చెబుతున్నాయి. పంచభూతాల ప్రతీకలైన ఈ లింగాలను దర్శిస్తే ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం లభిస్తాయని భక్తులు విశ్వసిస్తారు.

## జాతర ప్రత్యేకత..

ఫాల్గుణ మాసంలో జరిగే జాతరలో పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం, రథోత్సవం, అగ్నిగుండాలు, బోనాలు, అన్నదాన కార్యక్రమాలు ప్రత్యేకంగా నిర్వహిస్తారు. రైతులు ఎడ్లకు, వాహనాలకు పూజలు చేసి ఫలహార బండ్లతో ఊరేగింపుగా గుట్టకు చేరుకోవడం జాతర ప్రత్యేకతగా నిలుస్తోంది. పురాతన ఆలయాల పరిరక్షణ అవసరం వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఈ క్షేత్రాన్ని పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు. గుట్ట కింద కోనేరు, పైన పంచలింగాలు, పురాతన శివాలయాన్ని పునరుద్ధరించి కాకతీయుల వారసత్వాన్ని కాపాడాలని భక్తులు అభిప్రాయపడుతున్నారు

## . ఉత్సవాలలో రోజువారీ కార్యక్రమాలు.



. మార్చి 11వ తేదీ బుధవారం రోజున విఘ్నేశ్వర పూజ, పుణ్యావాచనం, స్వస్తివాచనం, అఖండ దీపారాధన చేస్తారు. 12వ తేదీ గురువారం రోజున స్వామివారికి అభిషేకం,



అంకురార్పణ, ధ్వజారోహణం. 13వ తేదీ శుక్రవారం రోజున రుద్రహోమం, అభిషేకాలు, కలశస్థాపన, బిల్వార్చన, అమ్మవారికి కుంకుమార్చన అనంతరం భక్తులకు అన్నదానం చేయబడును. రాత్రికి పార్వతీ పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవం అనంతరం చిన్న రథోత్సవం నిర్వహించబడును. 14వ తేదీ శనివారం రోజున ఫలహారపు బండ్లు, దీపారాధనలు, రేణుక ఎల్లమ్మ అమ్మవారికి బోనాలు, అగ్నిగుండాలు, కుంభాభిషేకం, పెద్ద రథోత్సవం సాంస్కృతిక కార్యక్రమాలు జరుగనున్నాయి. 15వ తేదీ ఆదివారం రోజున శ్రీపార్వతీ దేవికి కుంకుమార్చనలు నిర్వహించబడును. 16వ తేదీ సోమవారం రోజున రాత్రి 11 గంటలకు చక్ర రథోత్సవం, యక్షగానం, వీధి భాగవతం నిర్వహించబడును. తెల్లవారుజామున పార్వతీ పరమేశ్వరుల గ్రామోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

### భక్తులకు సమస్యలు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశాం

**బుస్సు శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్**

శ్రీ రామలింగేశ్వర స్వామి గుట్ట వద్ద వారం రోజులపాటు జరిగే బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. గుట్ట వద్ద తాగునీరు, లైటింగ్,



పారిశుద్ధం, పార్కింగ్ వంటి సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నాం. పోలీసు శాఖ సహకారంతో ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల రాకపోకలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అన్నదాన కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు



సక్రమంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.

# మొల్ల మాంబ జయంతిని అధికారికంగా జరపాలి



**నకిరేకల్ .ప్రభాతవార్త .మార్చి 12**

ఆతుకూరి మొల్లమాంబ జయంతిని అధికారికంగా జరపాలని నియోజకవర్గ శాసనసభ్యులు వేముల వీరేశం కి వినతిపత్రం అందజేసిన కుమ్మర్లునకిరేకల్ నియోజకవర్గ నాయకులు దొమ్మాటి సైదులు ప్రజాపతి ఆధ్వర్యంలో నియోజకవర్గ శాసనసభ్యులు వేముల వీరేశం ని శాలువాతో సన్మానించి కుమ్మరి ముద్దు బిడ్డ రామాయణం ని తెలుగులో అనువదించిన ఆతుకూరి మొల్లమాంబ జయంతిని ప్రభుత్వం అధికారికంగా జరిపించాలని వినతి పత్రం అందజేసిన నకిరేకల్ నియోజకవర్గ కుమ్మర్లుఈ కార్యక్రమంలో కుమ్మరి సంఘం రాష్ట్ర నాయకులు చేతరాజు వెంకటేశ్వర్లు,కౌన్సిలర్ గర్షకోటి సైదులు ఏరుకొండ వెంకన్న,నడికుడి సురేష్ యోహాహాదాస్, నడికుడి రాజేష్ శివ పొరెండ్ల, సాకుంట్ల సైదులు,బొడ్డుపల్లి సుగ్రీవులు, ఒరుగంటి శ్రీను,గంగాధరి గౌరయ్య, ఏరుకొండ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# పారిశుభ్రత పై ప్రభుత్వ నిబంధనలు పాటించాలి



**నార్కట్ పల్లి ప్రభాతవార్త మార్చి 12**

99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నార్కెట్‌పల్లి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చికెన్, మటన్ సెంటర్లు, ఫంక్షన్ హాల్స్ మరియు ఇతర వ్యాపార సంస్థల యజమానులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జేరిపోతుల భరత్ పాల్గొని వ్యాపారస్తులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం మరియు పట్టణ పరిశుభ్రతను దృష్టిలో ఉంచుకుని అన్ని వ్యాపార సంస్థలు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ముఖ్యంగా చికెన్, మటన్ సెంటర్లలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, వ్యర్థాలను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఫంక్షన్ హాల్స్ యజమానులు కూడా పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని సూచించారు.పట్టణ అభివృద్ధి మరియు ప్రజల ఆరోగ్యం కోసం గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ కట్టుబడి పనిచేస్తుందని సర్పంచ్ జేరిపోతుల భరత్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శిరీష ప్రవీణ్ రెడ్డి, వార్డు సభ్యులు జిల్లా మహేష్, మేడబోయిన శ్రీనివాస్, మేడబోయిన రాంబాబు, దస్తగిరి, ప్రసాద్, నవీన్ తదితరులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, వ్యాపారస్తులు మరియు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డ పెళ్లికి సహాయం అందజేసిన సర్పంచ్



**తుర్కపల్లి, మార్చి 12 ప్రభాతవార్త**

తుర్కపల్లి మండలం చిన్న లక్ష్మాపురం గ్రామానికి చెందిన ఓర్సు ప్రమీల కనకయ్య కూతురు కావేరి వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి ఆడబిడ్డ పెళ్లికి తమ వంతు 5000 రూపాయల సహాయాన్ని గ్రామ సర్పంచ్ కోమటిరెడ్డి సంతోష భాస్కర్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పార్వతి చిన్న నాయక్, వార్డు సభ్యులు ఓర్సు రాములు ,నరేష్ నాయక్, గ్రామస్తులు ఓర్సు ప్రశాంత్, మోత్కుపల్లి రవి, నరేష్ నాయక్, ప్రవీణ్ ,కనకయ్య, చంద్రం, దుర్గేష్ , పాల్గొన్నారు

## పబ్లిక్ టాయిలెట్ నిర్మాణంపై స్థానికుల అభ్యంతరం....



**. కోదాడ, మార్చి 12, ప్రభాతవార్త :**

పట్టణంలోని 25వ వార్డు చేపల మార్కెట్ సమీపంలో పబ్లిక్ టాయిలెట్ నిర్మాణ ప్రతిపాదనపై వార్డు కౌన్సిలర్, స్థానికులు మండిపడుతున్నారు. గత పదేళ్లుగా వినియోగంలో లేని పాత టాయిలెట్‌ను కూల్చివేసిన అధికారులు, అదే స్థలంలో మళ్లీ కొత్తది నిర్మించాలని చూడటం సరికాదన్నారు. రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలు, మద్యం సేవించడం వంటివి సాగుతున్నాయన్నారు. ఇరుకైన గల్లీ కావడంతో వర్షం వస్తే నీరు నిలిచి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ కార్యాలయం నుండి బస్టాండ్ వరకు పలు టాయిలెట్లు అందుబాటులో ఉన్నాయని, అవే వాడకంలో లేవని, వార్డులో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయమంటే నిధులు లేవని చెప్పే కమిషనర్ ప్రజలకు ఉపయోగపడని చోట నిధులు ఖర్చు చేయడం దుర్వినియోగమేనని విమర్శించారు. తమ అభ్యర్థనను కాదని ఇక్కడ టాయిలెట్ నిర్మించాలని చూస్తే ఊరుకోమన్నారు. ఎట్టి పరిస్థితుల్లో టాయిలెట్ నిర్మించకుండా అడ్డుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్ బాబా తాబుసం, జంపాల భద్రయ్య, భూలక్ష్మి, రామకృష్ణ, శ్రీనివాసరావు, మజీద్,ముత్యాలరావు, జాన్ బీ తదితరులు పాల్గొన్నారు.

## ఒత్తిడికి లోను కాకుండా పరీక్షలు రాయాలి



**మునగాల ,మార్చి 12, ప్రభాతవార్త :**

వార్షిక పరీక్షల ను విద్యార్థిని విద్యార్థులు పరీక్షలు ఒత్తిడికి లోను కాకుండా పరీక్షలు రాయాలని స్థానిక తహసిల్దార్ సరిత అన్నారు మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల లో గురువారం విద్యార్థిని విద్యార్థుల పరీక్షల మనోధైర్యానికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని పరీక్షా సమయంలో ఎటువంటి మానసిక ఒత్తిడికి లోను కాకుండా పరీక్షలకు సిద్ధం కావాలని ఆమె విద్యార్థులకు సూచించారు. పరీక్షలు ప్రారంభం దగ్గర నుండి ముగిసేంత వరకు తల్లిదండ్రులు విద్యార్థు లకు తమ సానుకూల తోడ్పాటును అందించాలని అన్నారు. పదవ తరగతిలో మండలంలో ఉత్తీర్ణత శాతాన్ని పెంచే విధంగా ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని ఈ సందర్భంగా ఆమె అన్నారు. మండల విద్యాధికారి పిడతల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రస్తుతం పరీక్ష షెడ్యూల్లో విద్యాశాఖ ప్రతిపరీక్షకు మూడు నుండి నాలుగు రోజుల వ్యవధి కల్పించిందని దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని బాగా చదివేందుకు కృషి చేయాలని అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యార్థులకు ప్యాడ్లు పెన్నులు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు బూర సైదయ్య గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం లో రిటైర్డ్ మండల విద్యాధికారి ఓరుగంటి రవి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాసర్ల కోటేశ్వరరావు, మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు నల్లపాటి శ్రీనివాస్ తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## టిఫిన్ బాక్సుల పంపిణీ

**నార్కట్ పల్లి ప్రభాతవార్త మార్చి 12**

మండలంలోని ఎడవల్లి గ్రామానికి చెందిన సామ తనీష్ రెడ్డి అకాల మరణం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు తనీష్ రెడ్డి మిత్రులు.ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నామని తెలిపారు. గురువారం సామ తనీష్ రెడ్డి దశదినకర్మ సందర్భంగా ఆయన స్నేహితురాలు సిద్దగోని సంజన శ్రీ తన మిత్రుడి స్మరణార్థంగా టిఫిన్ బాక్సులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తనీష్ రెడ్డి మంచి మనసున్న

## కొండయ్య మరణం పార్టీకి తీరని లోటు



**మునగాల , మార్చి 12, ప్రభాతవార్త :**

నమ్మిన సిద్ధాంతం కోసం తను మోసిన ఎర్రజెండా ఆశయాల కోసం కామ్రేడ్ ఉయ్యాల కొండయ్య అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. మండల పరిధిలోని నర్సింహులగూడెం గ్రామ సీపీఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ ఉయ్యాల కొండయ్య అనారోగ్యంతో గురువారం మృతి చెందడంతో ఆయన భౌతిక ఖాయం పై పూలమాల వేసి జోహార్లు అర్పించారు. అనంతరం జరిగిన అంతిమ యాత్ర లో ఆయన పాల్గొని మాట్లాడుతూ కొండయ్య చిన్నతనం నుండే ఎర్రజెండా ఎత్తుకొని దాడులు, దౌర్జన్యాలు ఎదుర్కొనీ ఎత్తిన ఎర్రజెండాను దించకుండా పార్టీని కాపాడటంలో ముఖ్య పాత్ర పోషించాడని అన్నారు. సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు దివంగత ఆదిరెడ్డి కి కుడి భుజంగా ఉండి గ్రామంలో పార్టీని కాపాడుతూనే నిర్బంధాలు సైతం లెక్కచేయకుండా పనిచేశారని అన్నారు. ఆయన వార్డు మెంబర్ గా, సింగిల్ విండో డైరెక్టర్ గా,గీత కార్మిక సంఘంలో అనేక బాధ్యతలు నిర్వహించి ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశాడని అన్నారు. ఎర్రజెండా పట్టుకొని పోరాటం చేసిన కొండయ్య బ్రతికినంత కాలం తన కుటుంబాన్ని పోషించుకుంటూనే గ్రామాభివృద్ధి కోసం పాటుపడి ప్రజలకు సేవ చేసాడని కొనియాడారు. తొలుత కొండయ్య భౌతిక కాయంపై సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి పూలమాలవేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమం లో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు,సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ములకలపల్లి రాములు, మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు, మట్టిపల్లి సైదులు,కోట గోపి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జూలకంటి విజయలక్ష్మి, ధనియాకుల శ్రీకాంత్,పల్లె వెంకట్ రెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు జిల్లా సిపిఎం సీనియర్ నాయకులు మెదరమెట్ల వెంకటేశ్వరరావు గ్రామ సర్పంచ్ కుంచం ఇందిరా నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను సాధించాలి



**నడిగూడెం, మార్చి 12, ప్రభాతవార్త :**

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరాలని మంచి ఫలితాలు సాధించాలని నడిగూడెం ఎస్సై అజయ్ కుమార్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా రక్షణ పరమైన అంశాల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. అందులో భాగంగానే గురువారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాటశాల విద్యార్థులకు చట్టాలు ,సత్ప్రవర్తన , లక్ష్యాల గురించి వివరించారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కష్టపడి చదువుకోవాలని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరాలని అన్నారు. పదవ తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఒత్తిడి లేకుండా చదవాలని పరీక్షలు బాగా రాసి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. సైబర్ మోసాల బారిన పడకుండా రోడ్డు ప్రమాదాలకు గురవకుండా విద్యార్థులు తల్లిదండ్రులను సమాజంలో ఉన్న వ్యక్తులను చైతన్య పరచాలని కోరారు. ప్రతి ఒక్కరికి సామాజిక అంశాల పట్ల అవగాహన కలిగి ఉండాలని అన్నారు. వ్యక్తిగత సమాచా న్ని అపరిచితులకు తెలపడం వల్లనే సైబర్ మోసాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చింతలపాటి వాణి, వైస్ ప్రిన్సిపాల్ విజయ శ్రీ, పాఠశాల ఉపాధ్యాయులు , విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

---

వ్యక్తి అని, ఆయన జ్ఞాపకాలను స్మరించుకుంటూ ఈ సేవా కార్యక్రమం నిర్వహించినట్లు ఆమె తెలిపారు.

## ముస్లిం సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది..



**కోదాడ, మార్చి 12, ప్రభాతవార్త :**

ముస్లిం ల సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గురు వారం పట్టణం లో మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు జబ్బార్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు ను ఆయన స్థానిక ఎమ్మెల్యే పద్మావతి తో కలిసి ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం లౌకిక ప్రభుత్వం అన్నారు. కోదాడ లో ముస్లిం ల సంక్షేమానికి తాను, తన సతీమణి ఎమ్మెల్యే పద్మావతి అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. ముస్లిం ల షాది ఖానా కు 3 కోట్లు, ఈద్గా కు 2 కోట్లు మంజూరు చేశామని, త్వరలో పనులు ప్రారంభం అవుతాయన్నారు. ముస్లిం లు చదువు కొని అభివృద్ధి చెందాలన్నారు. ముస్లిం యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. జబ్బార్ తనకు మంచి మిత్రుడని, జబ్బార్ పేదలకు చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను అభినందించారు. ముస్లిం సోదరులకు ముందస్తుగా రంజాన్ ఈద్ ముబారక్ తెలిపారు.కాగా రాష్ట్రం లో ఏర్పడ్డ గ్యాస్ కొరత పై విలేఖరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ డీలర్ లు కృత్రిమ గ్యాస్ కొరత సృష్టిస్తే కట్టిన చర్యలు తీసుకుంటామన్నారు. శుక్రవారం హైదరాబాద్ లో ఈ సమస్య పై చీఫ్ సెక్రటరీ తో , గ్యాస్ కంపెనీ యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి గ్యాస్ కొరత లేకుండా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లీశ్వరి, మాజీ సర్పంచ్లు ఎర్నేని బాబు,పార సీతయ్య, అల్తాఫ్ హుస్సేన్,చింతల పాటి శ్రీనివాస్, ఈదుల కృష్ణయ్య, బాగ్దాద్, బాజన్, కౌన్సిలర్ లు షాబుద్ధిన్,షఫీ, మైనార్టీ నాయకులు యజాజ్,మహిమూద్, జానీ, షమ్మీ,అలీ భాయ్, ఆర్డీఓ సూర్య నారాయణ, తహసీల్దార్ వాజిద్ అలీ, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సిఐ శంకర్ నాయక్, కమిషనర్ రమాదేవి, నాయకులు పాల్గొన్నారు.

## ఆరెగూడెంలో పరిశుభ్రతపై అవగాహన..

**చిట్యాల రూరల్, మార్చి 12, ప్రభాతవార్త :**



చిట్యాల మండలంలోని ఆరెగూడెం గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు, వ్యర్థాల నిర్వహణపై గ్రామ ప్రజలు, వ్యాపారులకు గురువారం సర్పంచ్ నాగంపల్లి శ్యాంసుందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలోని చికెన్, మటన్ కేంద్రాల నిర్వాహకులు, కోళ్ల ఫారాలు, కిరాణ దుకాణాల యజమానులతో ఆయన మాట్లాడుతూ గ్రామంలో చికెన్, మటన్ వ్యర్థ పదార్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అలాగే ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గ్రామాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జుంజు రాజు, పంచాయతీ కార్యదర్శి శారద, కిరాణ దుకాణాల యజమానులు, కోళ్ల ఫారం యాజమానులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దిరెడ్డి వెంకట్ రెడ్డి మృతి పట్ల నివాళి

**నార్కెట్ పల్లి ప్రభాతవార్త మార్చి 12**

చెర్వుగట్టు అవాస గ్రామం గుమ్మాలబావికి చెందిన మాజీ ఉప సర్పంచ్ పెద్దిరెడ్డి శంకర్ రెడ్డి తండ్రి పెద్దిరెడ్డి వెంకట్ రెడ్డి గత కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ అకాల మరణం చెందారు. వారి పార్థివ దేహానికి చెర్వుగట్టు సర్పంచ్ నేతకాని కృష్ణయ్య పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆమనగంటి జలంధర్ రెడ్డి, జిల్లా నాయకులు రేగట్టే నవీన్ రెడ్డి, గోదాల వెంకట్ రెడ్డి, మల్గ శంకర్, వార్డు సభ్యులు పిట్టల నాగయ్య, కూకుట్ల శ్రీకాంత్, అమరేందర్ రెడ్డి, సైది రెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులను పరిశీలించిన కేంద్ర బృందం

**కట్టంగూర్, మార్చి 12, ప్రభాతవార్త,**

మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం కేంద్ర బృందం పరిశీలించింది. ఈ సందర్భం గా జలసంచై జల భగీరథ ఇంపాక్ట్ స్టడీ బృందం ఉపాధి హామీలో చేపట్టినటువంటి నీటి నిలువ పనులను కేంద్ర బృందం మూల్యాంకనం చేయుట కొరకు మండల పరిధిలోని కట్టంగూర్ కల్మేర, పరడ, ఈదులూర్ గ్రామాలలో సోక్పేట్ అమృత్సర్ ఓవర్ ట్యాంక్ కట్టంగూరు పెద్ద చెరువు, పరడ గ్రామంలో చెక్ డాం, ఈదులూరు గ్రామంలో ఫారం పాండ్, చేపల చెరువు పనులను పరిశీలన చేసి ఈ పనుల వలన కలిగినటువంటి ప్రయోజనాలను రైతుల ద్వారా అడిగి తెలుసుకున్నారు.ఈ పనుల వలన నీటి నిల్వలు పెరగడంతోపాటు ఆయకట్టు రైతుల బోర్లలో నీరు పుష్కలంగా చేరుకొని ఉండటం, తద్వారా తేమతో కూడినటువంటి గ్రీనరీ గమనించారు. ఈదులూరు గ్రామంలో ఫారం పాండు పరిశీలన అనంతరం అందులో నిల్వ ఉండబడినటువంటి వాటర్ పత్తి తదితర పంటలకు ఉపయోగపడుతుం దని ఈ సందర్భంగా రైతు రాములు వివరించారు.



తద్వారా నీటి ఎద్దడిని అరికట్టడం జరిగిందని, ఇది ఫారం పాండు యొక్క ఉపయోగన్నారు. భారత బృంద సభ్యులు సోప్ పిట్ ఉపయోగాలు అడిగినందున సంబంధిత యజమాని వివరించారు. ఈ కార్యక్రమంలో ఈదులూర్, పరడ, కల్మేర, కట్టంగూర్ గ్రామాలకు సంబంధించిన సర్పంచులు ఇప్పలపల్లి అనితాశ్రీనివాస్, పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బృంద సభ్యులు ఏ.నవనీత్, రాచీగార్గ్, ప్రతీప్ కోర్ డే పాల్గొనగా, నకిరేకల్ క్లస్టర్ ఏపీడి బి.నరసింహారావు, కట్టంగూర్ మండల ఏపీవో కడెం రామ్మోహన్, ఈసీ శ్రీధర, క్లస్టర్ టిఏ రమణ, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ పొడిచేటి నిర్మల, ప్లాంటేషన్ సూపర్వైజర్ వివిధ గ్రామాల, టి ఏ లు ఫీల్డ్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

## ఏపూర్‌లో ప్రజాపాలన కార్యక్రమాలు



**చిట్యాల రూరల్, మార్చి 12, ప్రభాతవార్త**

:చిట్యాల మండలంలోని ఏపూర్ గ్రామంలో ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ పాలెం మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని రోడ్ల పక్కన పెరిగిన గడ్డిని తొలగించి, ఆకులను శుభ్రం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని రోడ్లపై ఎలాంటి చెత్త వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా, చెత్త ట్రాక్టర్ వచ్చినప్పుడు అందులో వేయాలన్నారు. రోడ్ల పక్కన రాళ్లు, ఇసుక వంటివి ఎక్కువకాలం ఉంచకూడదని, వీటివల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోపగోని శేఖర్, యువకులు, గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక డంపుల స్వాధీనం



**డిండి, మార్చి 12, ప్రభాతవార్త,**

ఇసుక అక్రమ డంపులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు డిండి ఎస్ఐ సిహెచ్. బాలకృష్ణ తెలిపారు. ఇందుకు సంబంధించి చేస్తే అందించిన వివరాల ప్రకారం పోలీసులకు అందిన సమాచారం మేరకు ఎస్సై బాలకృష్ణ తో పాటు రెవిన్యూ స్టాఫ్ కలసి గోనెబోనపల్లిలో అక్రమంగా ఇసుక డంప్ లు నిలువ ఉన్న స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించి వాటిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా అట్టి రవాణా చేసిన వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ సిహెచ్ బాలకృష్ణ మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా ఈసుక మట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సిహెచ్ బాలకృష్ణ తో పాటు హోంగార్డు శీను, ఆర్ ఐ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

**చిట్యాల రూరల్, మార్చి 12, ప్రభాతవార్త :**



పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలోని మస్జీదులో బుధవారం రాత్రి ముస్లిం సోదరులకు గ్రామ 2వ వార్డు సభ్యురాలు బొడిగె రాధిక సహకారంతో ఆమె భర్త బీఆర్ఎస్ నాయకుడు బొడిగె ప్రభాకర్ ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. నమాజ్ అనంతరం ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిం సోదరులకు ఆయన ఖర్జూర, పలు రకాల పండ్లు తినిపించి ఉపవాస దీక్షను విడిపించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదర సోదరీమణులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర రంజాన్ మాసం క్రమశిక్షణకు, దాతృత్వానికి, మత సామరస్యానికి ప్రతీక అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బత్తుల నర్సింహా గౌడ్, భీమిడి చిన్న వెంకట్ రెడ్డి, మండల మాజీ కో ఆప్షన్ సభ్యుడు షేక్ మోసీన్, బీఆర్ఎస్ మైనార్టీ విభాగం మండల అధ్యక్షుడు మొహమ్మద్ వాజీద్, ముస్లిం సోదరులు గాలీబ్, అసద్ అలీ, యూసూఫ్, సాజీద్, మాజీద్, అక్బర్, బాబా, ఆమేర్, ఆబేద్, గాలీబ్, బుజ్జు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీపార్వతీ రామలింగేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

**చిట్యాల రూరల్, మార్చి 12, ప్రభాతవార్త**

:చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామ పరిధిలోని మొర్సుగూడెంలో ఉన్న శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 12 నుండి మూడు 14వరకు అంగరంగ వైభవంగా జరగనున్నాయని ఆలయ అర్చకుడు నాగార్జున సత్యనారాయణ శర్మ తెలిపారు. ఈసందర్భంగా గురువారం నిత్యపూజలతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తున్నట్లు చేశారు. నేడు ఆలయంలో ధ్వజారోహణం, యజ్ఞం, అభిషేకములు నిర్వహించారు. శుక్రవారం రోజున ఉదయం ప్రభాత సేవ, గణపతి పూజ, శ్రీపార్వతీ రామలింగేశ్వర స్వామి అభిషేకములు అన్నపూజల అనంతరం శ్రీశ్రీశ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవము (తలంబ్రాలు) నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేయనున్నారు. 14వ తేదీ శనివారం రోజున ఉదయం గణపతి పూజ, ప్రభాతసేవ రథాంగ హోమము, బలిహరణ, రథోత్సవము, ఊరేగింపు మహానివేదము తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు దాతకు, పెద్దలను సన్మానం కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను వేయవద్దు

**కట్టంగూర్, మార్చి 12, ప్రభాతవార్త,**



మటన్, చికెన్, కిరాణ [illegible] దుకాణాదారులు బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు, చెత్తను వేయవద్దని కట్టంగూర్ సర్పంచ్ ముక్కాముల శ్యామల శేఖర్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాకలో భాగంగా గురువారం మండల కేంద్రంలో పర్యటించి పరిశుభ్ర పరిస్థితులను పరిశీలించి సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మటన్, చికెన్ దుకాణాల నుంచి వచ్చే వ్యర్థాలను సర్వీస్ రోడ్డు వెంట, బహిరంగ ప్రదేశాల్లో పడేయడం వల్ల దుర్వాసనతో పాటు వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. ప్రజల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని దుకాణాదారులు వ్యర్థాలు, చెత్తను నిర్దిష్ట ప్రదేశాల్లో వేసి పారిశుధ్య నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పారిశుద్ధ్య సమస్యల తలెత్తకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి వడ్లకొండ అశోక్ గౌడ్, వార్డు సభ్యులు ఏనుగు సైదులు, కళ్లెం నాగేశ్వరరావు, శ్రీరామ సంధ్యవీరేశం, చిక్కుల శివాని లింగస్వామి, గ్రామపంచాయతీ సిబ్బంది రాధిక, చిత్తలూరి జానకి రాములు, కాపుగంటి శ్రీనివాస్ కానుగు వెంకన్న ఎరుకల సత్తయ్య, ఎలగందుల బాలచందర్, స్థానికులు అయితగోని వెంకన్నగౌడ్, చిక్కు బుచ్చిబాబు, ఐతగోని రాములు తదితరులు ఉన్నారు.

## పరిశుభ్రత కార్యక్రమం




**నార్కెట్ పల్లి ప్రభాత వార్త మార్చి 12**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం ( ఎన్ఎస్ఎస్) యూనిట్-1 2 ఆధ్వర్యంలో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్ విద్యార్థులు పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు కళాశాల చుట్టుపక్కల ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి చెత్తను శుభ్రం చేశారు. కళాశాలలోని తరగతి గదులు మరియు వివిధ విభాగాల్లో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టి క్లాస్ రూమ్‌లను పరిశుభ్రంగా ఉంచారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డా. కె. అరుణ ప్రియ, జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా. మహమ్మద్ షరీఫ్, మ్యాతరి ఆనంద్ పాల్గొన్నారు. అదేవిధంగా వివిధ శాఖల అధ్యాపకులు ఆచార్య వి. శ్రీనివాస్, ఆచార్య విజయ బాబు, ఆచార్య మోహన్ రెడ్డి, డా. పండరయ్య, డా. రవీందర్ రెడ్డి, డా. పనస రామకృష్ణ, డా. సత్యనారాయణ రెడ్డి, డా. అనిత కుమారి, డా. అరవింద్, అనిల్ కుమార్, చక్రి, నాగార్జున, వివేక్ తదితరులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## . వాటర్ ట్యాంక్, పరిసరాల్లో శుభ్రత పనులు

**చిట్యాల రూరల్, మార్చి 12, ప్రభాతవార్త**

:చిట్యాల మండలంలోని వెంబావి గ్రామంలో ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ తో పాటు పరిసరాలను గ్రామ సర్పంచ్ గుణగంటి అలివేలు వెంకన్న ఆధ్వర్యంలో శుభ్రం చేసి చెత్తను ఊడ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో పరిశుభ్రతను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఉగాది తర్వాత సంజయ్ దాస్ రాజకీయ నిర్ణయం..

## ఆయన అడుగు ఎటువైపో !

**చిట్యాల, మార్చి 12, ప్రభాతవార్త**

: తెలంగాణ ఉద్యమం నుంచి ప్రజా పోరాటాల వరకూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన సీనియర్ రాజకీయ నాయకుడు, మలిదశ తెలంగాణ ఉద్యమ నేత కూనూరు సంజయ్ దాస్ గౌడ్ త్వరలోనే తన రాజకీయ భవిష్యత్తుపై కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. ఉగాది అనంతరం శుభ ముహూర్తంలో తన అనుచరులు, మిత్రులతో సమావేశమై తదుపరి రాజకీయ అడుగులపై ప్రకటన చేసే అవకాశముందని తెలుస్తోంది. దీంతో ఆయన ఏ రాజకీయ పార్టీ దిశగా అడుగులు వేస్తారన్న అంశం ప్రస్తుతం ప్రాంతీయ రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో సంజయ్ దాస్ గౌడ్ పలు కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ఉద్యమ కార్యకర్తగా గుర్తింపు పొందారు. ఉద్యమకాలంలో జరిగిన సమావేశాలు, నిరసనలు, అవగాహన కార్యక్రమాల్లో ముందుండి పనిచేసి ప్రజల్లో మంచి పేరు సంపాదించారు. అనంతరం కూడా ప్రజా సమస్యలపై స్పందిస్తూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సామాజికంగా చురుకుగా కొనసాగుతున్నారు. ఉద్యమకాలంలో ఆయన బీఆర్ఎస్ పార్టీతో పాటు తెలంగాణ జాగృతి సంస్థలో కూడా చురుకుగా కొనసాగారు.



తెలంగాణ ఉద్యమ కాలం నుంచే ఆయనకు బీఆర్ఎస్ అగ్రనేతలతో సన్నిహిత అనుబంధం ఉన్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. మాజీ మంత్రులు కేటీఆర్, గుంటకండ్ల జగదీష్ రెడ్డిలతో పాటు తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు ఆయన సన్నిహితుడిగా ఉంటూ మంచి పేరు సంపాదించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయా నేతలతో ఇప్పటికే చేరికపై సంప్రదింపులు జరిగినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తెలంగాణ జాగృతి కార్యక్రమాల్లోనూ ఆయన చురుకుగా పాల్గొన్నట్లు స్థానిక నేతలు గుర్తుచేస్తున్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుత అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో కూడా సంజయ్ దాస్‌కు గతంలో సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు తెలిసింది. వీరేశం తొలిసారి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆయనకు తోడుగా పనిచేశారని స్థానిక రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశాలపై కూడా రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఉగాది అనంతరం తన అనుచరులు, మిత్రులతో సమావేశమై రాజకీయ భవిష్యత్తుపై నిర్ణయం ప్రకటించే అవకాశముందని సమాచారం. ఈనేపథ్యంలో బీఆర్ఎస్ వైపు వెళ్తారా, తెలంగాణ జాగృతి సంస్థలోనే కొనసాగుతారా, లేక అధికార కాంగ్రెస్ పార్టీలో చేరుతారా అన్నదానిపై ఆసక్తి నెలకొంది. ప్రజా పోరాటాలు, సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో మంచి గుర్తింపు సంపాదించిన సంజయ్ దాస్ గౌడ్ తీసుకునే నిర్ణయం ప్రాంతీయ రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశముందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ప్రజల ఆశయాలే నా రాజకీయ నిర్ణయానికి ఆధారం కూనూరు సంజయ్ దాస్ గౌడ్, తెలంగాణ ఉద్యమం నుంచి ఇప్పటి వరకు నేను ప్రజల మధ్యే ఉన్నాను. ప్రజల ఆశయాలు, తెలంగాణ ఆత్మగౌరవాన్ని దృష్టిలో ఉంచుకొని నా రాజకీయ భవిష్యత్తుపై నిర్ణయం తీసుకుంటాను. ఉగాది తర్వాత నా అనుచరులు, మిత్రులతో సమావేశమై పూర్తి వివరాలను వెల్లడిస్తానని తెలిపారు.

## కోమటిరెడ్డి కి వివాహ ఆహ్వానం



**నార్కెట్ పల్లి ప్రభాతవార్త మార్చి 12**

నార్కట్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వడ్డెగోని నరసింహ నాగమణి కుమారుడి వివాహ ఆహ్వాన పత్రికను రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మరియు సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి అందజేశారు. ఈనెల 14న శనివారం రోజు జరగనున్న వివాహ మహోత్సవానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని వారు కోరారు. వారి వెంట ఎంపీటీసీల మాజీ జిల్లా అధ్యక్షులు పాశం శ్రీనివాస్. జిల్లా నాయకుడు యానాల రాంరెడ్డి. పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు,

## పెద్దిరెడ్డి వెంకటరెడ్డి మృతి పట్ల నివాళి

**నార్కట్పల్లి ప్రభాతవార్త మార్చి 12**

మండలం గుమ్మలబావి గ్రామానికి చెందిన నారాయణ రెడ్డి తండ్రి పెద్దిరెడ్డి వెంకటరెడ్డి మృతి చెందగా, వారి పార్థివ దేహానికి పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ మేకల రాజిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కమ్మంపాటి వెంకటయ్య, బాలం బిక్షం, గుంటి నరేష్, మచ్చ లింగయ్య, చీర మల్లేష్, వనం శంకర్, గాదరి రాంబాబు, మేక ఆంజనేయులు తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

## గ్రామ పరిశుభ్రతే మన అందరికీ సంపూర్ణ ఆరోగ్యం

**నల్లబెల్లి, మార్చి 12, ప్రభాతవార్త**

మన గ్రామ పరిశుభ్రత గ్రామ ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం కలిగిస్తుందని మండలంలోని రంగాపురం గ్రామ సర్పంచ్ ఒరుగంటి మాధురి



రాజు గ్రామస్తులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రత్యేక పారిశుద్ధ ప్రణాళికలో భాగంగా అత్యధికంగా చెత్తను ఉత్పత్తి చేసే వ్యాపారాలతో పాటు కార్యాలయాలను సర్పంచ్ ఆధ్వర్యంలో రంగాపురం గ్రామంలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. సంబంధిత చెత్తను ఉత్పత్తి చేసే నిర్వాహకులకు సరియైన విధంగా తడి పొడి చెత్తలో వేరు వేరు చేసి పంచాయతీ సిబ్బందికి అందించాలని విషయంపై అవగాహన కల్పించడం తోపాటు పలు సూచనలు చేశారు. మన గ్రామ పరిశుభ్రత మనందరి బాధ్యతని ఈ కార్యక్రమానికి గ్రామస్తులు సహకరించాలని వారు కోరారు. వైద్య ఆరోగ్యశాఖ పంచాయతీరాజ్ శాఖ అధికారులు సూచించిన విధంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని గ్రామస్తులు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని కోరినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామారావు. ఉప సర్పంచ్ రామ్మూర్తి వార్డు సభ్యులు శ్రీహరి. పంచాయతీ సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్గత రోడ్ల ఏర్పాటే ప్రభుత్వ లక్ష్యం

**నల్లబెల్లి, మార్చి 12, ప్రభాతవార్త**

ప్రతి గ్రామంలో అంతర్గత పక్కా రోడ్ల ఏర్పాటే ప్రజా పాలనలోని కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల మంజూరి చేయించగా మండలంలోని శనిగరం గ్రామంలో సిసి రోడ్డు పనులను చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు ఆ పనుల నిమిత్తం గురువారం ప్రారంభించామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నర్సంపేట ఎమ్మెల్యే మాధవరెడ్డి చొరవతో రాష్ట్రంలోనే నర్సంపేట నియోజకవర్గం ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే ఏర్పాట్లు జరుగుతున్నాయని ఆయన గుర్తు చేశారు. గ్రామాలలో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ప్రజా పాలన జరుగుతుందన్నారు.



ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మాలోత్ రమేష్. మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్ కిసాన్ సెల్ అధ్యక్షులు సంపత్ రెడ్డి మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాలోతు చరణ్ సింగ్ మండల నాయకులు జిల్లా మునేందర్ ఇంద్రారెడ్డి. బత్తిని మహేష్. కృష్ణ. రాజు. వడ్లూరి రమేష్. గోపి. రాజు.సదయ్య తదితరులు పాల్గొన్నారు.

# నర్సంపేట పట్టణ అభివృద్ధి దొంతి మాధవరెడ్డితోనే సాధ్యం

**నర్సంపేట, మార్చి 12, ప్రభాతవార్త**

నర్సంపేట పట్టణ అభివృద్ధి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తోనే సాధ్యమవుతుందని టిపిసిసి సభ్యులు వెన్నం రామానంద్ అన్నారు. గురువారం 25వ వార్డులో పర్యటించి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. వార్డులో మున్సిపల్ సిబ్బంది చేత సైడ్ డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తను రోడ్డుకి ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. మంచినీటి సౌకర్యం, వీధి దీపాల ఏర్పాటు, రోడ్డు



మరమతులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడం, ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడమే తమ లక్ష్యం అని తెలిపారు. నర్సంపేట మున్సిపాలిటీలో పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి సహకారంతో నర్సంపేట పట్టణంలోని ప్రతి వార్డులోని ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, పారదర్శక పరిపాలన అందిస్తామని హామీ ఇచ్చారు.

# విద్యార్థులు లక్ష్య సాధన వైపు అడుగులు వేయాలి

**నల్లబెల్లి, మార్చి 12, ప్రభాతవార్త**

విద్యార్థులు కష్టపడి ఇష్టంగా చదువుకొని లక్ష్య సాధన వైపు అడుగులు వేయాలని తెలంగాణ దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య పేర్కొన్నారు. మండలంలోని రంగాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో పదవ తరగతి విద్యను అభ్యసిస్తున్న బాలబాలికలకు ఉచితంగా పరీక్షా ప్యాడ్లు కంపాక్స్ బాక్సులు పెన్నుల పంపిణీ కార్యక్రమం ప్రధానోపాధ్యాయుడు పున్నం యాకూబ్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో దాత అయినటువంటి బట్ట సాంబయ్య మాట్లాడుతూ విద్యావేర్లు ఎంత చేదుగా ఉంటాయో దాని ఫలాలు ఎంతో మధురంగా ఉంటాయన్నారు. ప్రతి విద్యార్థి క్రీడలలో రాణించడంతోపాటు చదువుల్లో స్నేహ సంబంధాలను



మెరుగుపరచుకొని పోటీ తత్వాన్ని ప్రదర్శించి సమాజంలోని సుస్థిర స్థానాన్ని కల్పించుకోవాలన్నారు. రాబోయే పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఇలాంటి ఒత్తిళ్లకు లోను కాకుండా ప్రశాంత వాతావరణంలో లక్ష్యసాధన వైపు అడుగులు వేసే విధంగా పరీక్షలు రాయాలని ఆయన విద్యార్థులకు సూచించారు. జీపిఏ 10/10 వచ్చే విధంగా ముందుకు సాగాలన్నారు ఉన్న ఊరికి చదువుకున్న పాఠశాలకు విద్య నేర్పిన ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావడమే ప్రతి విద్యార్థి లక్ష్యంగా మెలగాలన్నారు. సమాజంలోని ఉన్నత శిఖరాలను అధిరోహించి సమాజసేవే లక్ష్యంగా విశిష్ట సేవలు అందించి అట్టడుగు వర్గాల అభ్యున్నతికి పాటు పాడాలని ఆయన కోరారు. వీటన్నిటిని సాధించాలంటే విద్యను అభ్యసించడం ఒక్కటే ప్రధాన మార్గం అన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పెన్నులు. కంపాక్స్ బాక్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల శ్రీనివాస్ రామకృష్ణ సూరి, రామ్మోహన్. మహేందర్ ఉపాధ్యాయులు వెంకట్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం బట్టు సాంబయ్యకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.